Published from Visakhapatnam
PRGI NO:APTEL/25/A1888

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com


మనిషి మనుగడలో అతిముఖ్యమైనది
శాంతి సుఖం సంతోషం ఆర్థికాభివృద్ధిఎదుగుదల,
ఇలాంటివి సాధించుకోవటానికి ఎదురయ్యే సమస్యలకు
గృహవాస్తు, జాతకదోషాలు,
అనేక రకాల సందేహాల నివృత్తి కోసం
చక్కటి పరిష్కారం కోసం సంప్రదించగలరు.
వాస్తు - జ్యోతిష పండితులు
మహామంత్రోపాసకులు
శ్రీ లలితాంబికా పీఠం వ్యవస్థాపకులు
బ్రహ్మశ్రీ మాడుగుల శివప్రసాద్ గురూజీ
79970 39039

విశాఖపట్నం Visakhapatnam | సంపుటి : 01 Vol.No : 01 | సంచిక : 142 Issue No : 142 | బుధవారం Wednesday | ఏప్రిల్ 29, 2026 29 APRIL 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

## ఉత్తరాంధ్ర నుంచి వలసలు కాదు

# ఇకపై ఉత్తరాంధ్రకే వలసలు



### స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌కు గూగుల్ క్లౌడ్ సహకారం

- గూగుల్ రాకకు లోకేష్ చొరవ చూపారు... ప్రధాని సహకరించారు
- పెట్టుబడుల్లోనే కాదు... ప్రాజెక్టుల గ్రౌండింగులోనూ ఏపీనే నెంబర్-1
- గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- జూన్ 1న విశాఖ రైల్వేజోన్‌కు నోటిఫికేషన్ ఇస్తామన్న రైల్వేమంత్రికి ధన్యవాదాలు తెలిపిన సీఎం

2 లో..

ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం: సెర్చ్ ఇంజిన్‌గా మొదలైన గూగుల్.. విశాఖలో ఏర్పాటు చేయబోతున్న సెంటర్ ద్వారా దేశానికే గ్రోత్ ఇంజిన్ కాబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. టెక్నాలజీ రంగంలో ఏపీలో కొత్త శకానికి శ్రీకారం చుడుతున్న రోజుగా 2026 ఏప్రిల్ 28వ తేదీ గుర్తుండిపోతుందని చెప్పారు. గూగుల్ క్లౌడ్ ఏఐ హబ్ ఏర్పాటుకు మంగళవారం విశాఖపట్నంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, గూగుల్ గ్లోబల్ ఇన్ ఫ్రా, క్లౌడ్ వైస్ ప్రెసిడెండ్ బికాస్ కోలే శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, హైదరాబాద్ లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్, భారతీ ఎంటర్ ప్రైజెస్ వైస్ చైర్మన్ రాకేష్ మిట్టల్, అదానీ గ్రూప్ చైర్ పర్సన్ జీత్ అదానీ, గూగుల్ ఇండియా ప్రతినిధి ప్రీతి లోబానా పాల్గొన్నారు.

అదానీ కనెక్స్, ఎయిర్ టెల్ నెక్స్ ట్రా భాగస్వామ్యంతో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో క్లౌడ్ డేటా సెంటర్ ను గూగుల్ ఏర్పాటు చేస్తోంది. 1 గిగావాట్ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నారు. తర్లువాడ, రాంబిల్లి, అడవివరం ప్రాంతాల్లో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు 601 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. శంకుస్థాపన కార్యక్రమానికి ముందు గూగుల్ ఎక్స్ పీరియెన్స్ జోన్‌ను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు



ద్రవిడ నమూనా వల్లే తమిళనాడు రెండంకెల

## వృద్ధి సాధించింది

- తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్

చెన్నై : బిజెపి పాలిత రాష్ట్రాల కంటే తమిళనాడు రెండంకెల వృద్ధిని సాధించింది. 2025-26 సంవత్సరం తమిళనాడు వృద్ధి రేటు 10.83 శాతం, 2024-25 సంవత్సరంలో 11.19 శాతం వృద్ధి రేటు నమోదైంది. ఈ సమాచారాన్ని ఓ ఆంగ్ల పత్రిక లెక్కలతో సహా వార్తను ప్రచురించింది. ఈ వార్త క్లిప్‌ను తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ సందర్భంగా తమినాడు చేపట్టిన ద్రవిడ నమూనా వల్లే రెండంకెల వృద్ధి సాధ్యమైందని ఆయన ప్రశంసించారు.

- మిగతా 2లో..

# సిక్కింలో మోదీ 'ఫుట్‌బాల్' సందడి..

### రూ. 4 వేల కోట్లతో అభివృద్ధి ప్రాజెక్టుల జాతర!

- సిక్కిం రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50 ఏళ్లు
- ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిన ప్రధాని
- తన చిన్ని స్నేహితులతో ఫుట్‌బాల్ ఆటను ఎంజాయ్ చేశానన్న ప్రధాని

సిక్కిం : సిక్కిం రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ గ్యాంగ్‌టక్ వెళ్లారు. తన పర్యటన సందర్భంగా, ఈ ఉదయం పాల్జోర్ స్టేడియంలో యువతీయువకులతో కలిసి ప్రధాని ఫుట్‌బాల్ ఆడారు. ఎంతో బిజీగా ఉండే ప్రధాని... కాసేపు యువతతో కలిసి ఆటను ఎంజాయ్ చేశారు. ఈ సందర్భంగా తన సంతోషాన్ని ఎక్స్ వేదికగా ఆయన పంచుకున్నారు.



"నా చిన్ని స్నేహితులతో ఫుట్‌బాల్ ఆడటం చాలా సరదాగా, ఉత్తేజంగా అనిపించింది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా విద్య, వైద్య, మౌలిక సదుపాయాల రంగాలకు సంబంధించి రూ. 4 వేల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సిక్కిం యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్, హెలెన్ లెప్చా మెడికల్ కాలేజ్ ప్రారంభోత్సవం వంటివి ఇందులో కీలకం. ఈ పర్యటనలో భాగంగా ఈశాన్య రాష్ట్రాల కోసం 6 క్రికెట్ అకాడమీలను కూడా ప్రధాని ప్రకటించారు.



### చైనా, రష్యా నేతలతో రాజ్‌నాథ్‌సింగ్ చర్చలు

బిష్కెక్ (కిర్గిజికిస్తాన్) : ఏప్రిల్ 28న కిర్గిజిస్తాన్ రాజధాని బిష్కెక్‌లో షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశం జరుగుతుంది. ఈ సమావేశానికి భారత రక్షణ శాఖామంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరయ్యారు.

2 లో



### నేనూ కోర్టుకు హాజరుకాను

- మనీష్ సిసోడియా

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ రూట్లోనే ఆ పార్టీ నేత మనీష్ సిసోడియా వెళు_న్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో.. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వరణ కాంత శర్మ ముందు

2 లో

## ఈస్ట్-వెస్ట్ రైల్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటు చేయండి



### ఏపీలోని రైల్వే ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- పోర్టుల కనెక్టివిటీకి ప్రథమ ప్రాధాన్యత- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్
- దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం సందర్శించిన సీఎం, రైల్వే మంత్రి

ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ నుంచి వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులను రవాణా చేసేందుకు ప్రత్యేక కంటైనర్ రీఫర్ రైళ్లు అవసర మని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైల్వే శాఖను కోరారు. ఏపీని లాజిస్టిక్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు అవసరమైన రైలు కనెక్టివిటీని పెంచాలని విజ్ఞప్తి చేశారు.

2 పేజీలో..

పెట్రోల్ బంకులకు మంత్రి నాదెండ్ల మనోహర్

## హెచ్చరిక



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : రాష్ట్రంలో ఇంధన సరఫరా పరిస్థితులపై ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పెట్రోల్, డీజిల్ సరఫరా, నిల్వలు, ఫిర్యాదులపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల కమిషనర్ కన్నబాబు కూడా పాల్గొన్నారు.

- మిగతా 2లో..

## ఉక్కు నగరం నుంచి డేటా సిటీగా విశాఖ..

### చరిత్ర సృష్టిస్తున్నాం : మంత్రి లోకేశ్

- విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్‌కు శంకుస్థాపన
- ఉక్కు నగరం ఇకపై 'డేటా సిటీ'గా మారుతుందన్న మంత్రి లోకేశ్
- విశాఖను ట్రిలియన్ డాలర్ ఎకనామిక్ రీజియన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి
- ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే తమ ప్రభుత్వ విధానమని స్పష్టీకరణ
- కొందరు కేసులు వేసి ప్రాజెక్టును అడ్డుకోవాలని చూశారని పరోక్ష విమర్శలు



ప్రజాభూమి ప్రతినిధి, విశాఖపట్నం : విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్‌కు శంకుస్థాపన జరిగింది. ఈ చారిత్రక ప్రాజెక్టుతో ఉక్కు నగరంగా పేరుగాంచిన విశాఖ.. ఇకపై 'డేటా సిటీ'గా ప్రపంచ పటంలో నిలవనుందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా భారత్‌లోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖకు వచ్చిందని, ఇది రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటుకు సహకరిస్తున్న అదానీ కనెక్స్, ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రా సంస్థలకు, భూములు ఇచ్చిన రైతులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏఐ డేటా సెంటర్‌తో విశాఖ గ్లోబల్ ఐటీ మ్యాప్‌లో చేరిందని, ఈ ప్రాంతాన్ని మొదటి ట్రిలియన్ డాలర్ ఎకనామిక్ రీజియన్‌గా అభివృద్ధి చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు.

2 లో

ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే

# ఎందుకొచ్చింది?

### ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

- ఇంధన సంక్షోభంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్ షర్మిల
- రూ.500 డీజిల్ కోసం ఆక్వా రైతు పడిన ఆవేదనను ప్రస్తావించిన వైనం
- ఇది రైతును రక్షించే ప్రభుత్వమా, భక్షించే ప్రభుత్వమా అని ప్రశ్న
- మోదీకి తొత్తుగా ఉంటూ చంద్రబాబు బీజేపీ భజన చేస్తున్నారని విమర్శ
- వదంతులు నమ్మొద్దని చెప్పడం కాదు.. కళ్లు తెరవాలని చంద్రబాబుకు హితవు



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : రాష్ట్రంలో తీవ్ర ఇంధన సంక్షోభం ఏర్పడిందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రూ.500 డీజిల్ కోసం ఓ ఆక్వా రైతు పడిన ఆవేదనను ప్రస్తావిస్తూ, ఇది రైతులను రక్షించే ప్రభుత్వమా లేక భక్షించే ప్రభుత్వమా అని ఘాటుగా ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో ఆక్వా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, ఇది వారి పాలిట శాపంగా పరిణమించిందని ఆమె విమర్శించారు.

- మిగతా 2లో..

నేడు తెలంగాణ

# టెన్త్ ఫలితాలు..

### ఈసారి వాట్సాప్‌లోనూ రిజల్ట్!

- నేడు మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ పదో తరగతి ఫలితాలు
- దాదాపు 5.15 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం వెల్లడి
- ఈ ఏడాది కొత్తగా వాట్సాప్‌లోనూ ఫలితాలు తెలుసుకునే సౌకర్యం
- నిర్ణీత నంబర్‌కు 'హాయ్' అని పంపి రిజల్ట్స్ సులభంగా పొందొచ్చు

2 పేజీలో..



ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ : తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభవార్త. రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు (బుధవారం) విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు విద్యాశాఖ అధికారులు ఈ ఫలితాలను అధికారికంగా వెల్లడించనున్నారు.

## సంపాదకీయం

# పెట్రో సంక్షోభం!



కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దేశ ప్రజలకు ఏదో ఒక కారణంతో క్యూలలో పడిగాపులు కాయడం అలవాటుగా మార్చుకోవాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నోట్ల రద్దుతో ప్రారంభమైన ఈ క్యూల పరంపర, కరోనా మహమ్మారి కాలంలో విశ్వరూపం దాల్చింది. అప్పట్లో కూరగాయలు, ఇతర అత్యవసర వస్తువుల నుండి ఆసుపత్రుల్లో బెడ్లు, ఆక్సిజన్ సిలిండర్లు, చివరకు శ్మశానాల్లో అంత్యక్రియల వరకూ క్యూలు తప్పని పరిస్థితి నెలకొంది. ఆ పరంపరలోనే తాజాగా పెట్రోల్ బంకుల ముందు క్యూలను చూడాల్సి ఉంది. నిజానికి ఇది దాదాపు నెల రోజుల క్రితం గ్యాస్ ఏజెన్సీల ముందు సిలిండర్ల కోసం కనిపించిన క్యూలకు కొనసాగింపే. ప్రభుత్వ యంత్రాంగంలో అప్పటి నుండి లోపించిన ముందుచూపు ఫలితమే ఈ తాజా క్యూలు. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల ముందు 'నో స్టాక్' బోర్డులు, తెరిచి ఉంచిన బంకుల వద్ద కిలోమీటర్ల మేర కనిపించే క్యూలు పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 4,500కి పైగా పెట్రోల్ బంకులు ఉండగా, వాటిలో 421 మూతపడ్డాయి. అసోసియేషన్ లెక్కల ప్రకారం దాదాపు 1,500 బంకులు మూతపడ్డాయి. వాస్తవానికి ఈ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. విజన్‌లకు ప్రతిరూపంగా తనను తాను చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హడావిడిగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ సంక్షోభ బాధ్యతను అధికారుల మీద, కింది స్థాయి యంత్రాంగంపై నెట్టివేయడానికి ప్రయత్నించడం విస్మయం కలిగిస్తోంది.

?ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఏకపక్షంగా యుద్ధానికి దిగిన వెంటనే ఇంధన రంగంలో సంక్షోభం తప్పదన్న సంకేతాలు వచ్చాయి. నిపుణుల్లోనే కాదు, సాధారణ ప్రజల్లోనూ ఈ విషయం చర్చనీయాంశమైంది. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే ఆయిల్ కంపెనీలు పెట్రోల్ బంకులకు అరువు ఇవ్వడం మానేశాయి. ముందస్తు చెల్లింపులు చేస్తేనే ఇంధనాన్ని అందిస్తామని చెప్పడంతో పాటు ఆ విధానాన్ని అమలు చేయడం ప్రారంభించాయి. అప్పటి నుంచే రాష్ట్రంలో బంకుల ముందు 'నో స్టాక్' బోర్డులు కనిపించడం ప్రారంభమైంది. ఈ విషయం అప్పుడే ప్రభుత్వ దృష్టికి వెళ్లినా, కనీస స్పందన కూడా కనిపించలేదు. ఇప్పుడు ప్రజలు అతిగా భయపడుతున్నారనో, అధికారుల నిర్లక్ష్యమని బుకాయించడం దారుణం. క్యూల మాదిరిగానే ఎన్నికల తరువాత ధరలు పెరగడం కూడా మోడీ పాలనలో ప్రజలకు అలవాటైపోయింది. వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడం ఖాయమని ప్రజలు భావిస్తున్నారు. దీనికి అనుగుణంగానే ఆయిల్ కంపెనీలు తమ సరఫరాలను తగ్గించాయి. ఫలితంగా అనేక జిల్లాల్లో రోజువారీ అవసరాలకు అవసరమైన ఇంధనంలో 50 నుండి 60 శాతం మాత్రమే సరఫరా అవుతోందని సమాచారం. వాస్తవం ఇది కాగా, ప్రజలు భయంతో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని నెపం వారిపై మోపడం బాధ్యతారహితం.

ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ సంక్షోభం సాధారణ పరిపాలనా లోపం కాదు. ఇది ముందస్తు ప్రణాళికల లేమి, సంక్షోభ నిర్వహణ వైఫల్యం! అక్షరాలా నిలువెత్తు నిర్లక్ష్యం! దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కడా లేని డబుల్ ఇంజిన్ సర్కారు మన రాష్ట్రంలో ఉండటంతో ఈ అన్ని లోపాలు కలిసి ఒక్కసారిగా ప్రజలపై దాడిచేస్తున్నట్టు కనిపిస్తోంది. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా యుద్ధ ప్రాతిపదికపై పెట్రోల్, డీజల్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ఆయిల్ కంపెనీలు చేసే సరఫరాను కట్టుదిట్టంగా పర్యవేక్షించాలి. సరఫరా తీరుతెన్నులపై ఎప్పటికప్పుడు స్పష్టమైన సమాచారం ప్రజలకు అందించాలి. నిత్య జీవితంలో ఒక భాగమైపోయిన పెట్రో ఉత్పత్తుల విషయంలో కొరత ఉండదన్న భరోసాను, ఎన్నికల తరువాత కూడా వాటి ధరలు పెరగవన్న నమ్మకాన్ని ప్రజలకు కలిగించాలి. ఆ దిశలో తాము ఆక్సిజన్ ఇస్తున్న కేంద్ర ప్రభుత్వంపై టిడిపి, జనసేన ఒత్తిడి తీసుకురావాలి.?

## ద్రవిడ నమూనా వల్లే తమిళనాడు
# రెండంకెల వృద్ధి సాధించింది

ప్రజా మద్దతు వల్లే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు.కాగా, 'ద్రావిడ నమూనా విలక్షణమైనది. అది ఇప్పుడు గణాంకాలతో నిరూపితమైంది. వృద్ధి సాధించాలని మేము మూడేళ్లలో పునాది వేశాము. వరుసగా రెండు సంవత్సరాలు రెండంకెల వృద్ధిని సాధించాము. ఈ పురోగతికి తమిళనాడు ప్రజలే కారణం. మీ కృషికి, మాపై ఉంచిన నమ్మకానికి మా ధన్యవాదాలు' అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.ఇది కేవలం ప్రారంభమే. మీ మద్దతుతో ఈ పురోగతి మరింత వేగవంతమవుతుంది. మేము భారతదేశంలో పోటీ పడటం లేదు. తమిళనాడు దక్షిణాసియాకు నాయకత్వం వహిస్తుంది అని ఆయన పోస్టులో తెలిపారు. తమిళనాడు పరిశ్రమల శాఖా మంత్రి టిఆర్‌బి రాజా పనితీరు, పరిశ్రమలకు ప్రాధాన్యతనిచ్చే విధానాలు, ఎం.కె. స్టాలిన్ నేతృత్వంలోని స్థిరమైన పాలన వల్లే రెండంకెల వృద్ధి సాధ్యమైందని అన్నారు. స్టాలిన్ ఈసందర్భంగా రాజా పనితీరును ప్రశంసించారు.ప్రపంచ వాణిజ్య ప్రతికూలతలు ఉన్నప్పటికీ తమిళనాడు అభివృద్ధి నమూనా స్థిరమైన ఫలితాలను అందిస్తోందని స్టాలిన్ నొక్కి చెప్పారు. ద్రావిడ నమూనా నినాదాల మీద కాకుండా ఫలితాల మీద దృష్టి పెడుతుందని అన్నారు. వరుసగా రెండు సంవత్సరాలు రెండంకెల వృద్ధి సాధించామన్నది ప్రచారం కాదు. ఇవి వాస్తవ సంఖ్యలు అని స్టాలిన్ పోస్టులో పేర్కొన్నారు. ఈ వృద్ధికి సంబంధించి తమిళనాడు పరిశ్రమల శాఖా మంత్రి టిఆర్‌బి రాజా 025-26 సంవత్సరం తమిళనాడు వృద్ధి రేటు 10.83 శాతం, 2024-25 సంవత్సరంలో 11.19 శాతం వృద్ధి రేటు నమోదైందదని, ఇది సగటు వృద్ధి రేటు 7.4 కంటే ఎక్కువ అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

# పెట్రోల్ బంకులకు మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరిక

రాష్ట్రంలో కొంతమంది పెట్రోల్ బంకులు నిల్వలు ఉన్నప్పటికీ లేవని చెబుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి తెలిపారు. అలాంటి బంకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బల్క్‌గా డీజిల్, పెట్రోల్‌ను పక్కదోవ పట్టిస్తే సహించబోమని స్పష్టం చేశారు.



## ఉత్తరాంధ్ర నుంచి వలసలు కాదు
# ఇకపై ఉత్తరాంధ్రకే వలసలు...

మాట్లాడుతూ..."ఏపీ చరిత్రలో కొత్త టెక్ శకానికి శ్రీకారం చుడుతున్న రోజు ఇది. గూగుల్ రాక విశాఖకే కాదు ఏపికి ఓ గేమ్ చేంజర్. 30 ఏళ్ల క్రితం సైబరాబాద్ నగరాన్ని ఐటీ సిటీగా నిర్మాణం చేస్తే సంపద సృష్టికి కేంద్ర అయ్యింది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో భారత చరిత్రలో 2026 ఏప్రిల్ 28వ తేదీ శాశ్వతంగా నిలిచిపోతుంది. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో టెక్నాలజీ రంగంలో ఏపీ తలెత్తుకుని నిలబడుతుంది. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఇది. దేశానికి ఏఐ డేటా గేట్ వేగా ఏపీ నిలుస్తుంది. సెర్చ్ ఇంజన్‌గా మొదలైన గూగుల్ సంస్థ... భారత్ గ్రోత్ ఇంజన్‌గా మారుతుంది. ప్రతీ ఒక్కరూ గూగుల్‌లో సెర్చ్ చేస్తే గూగుల్ ఏపీని సెలెక్ట్ చేసుకుంది"అని ముఖ్యమంత్రి చెప్పారు.

**సీఎంఓ సెక్రటరీగా గూగుల్ ఏఐ అసిస్టెంట్**

"ఏపీ ప్రభుత్వం అందిస్తున్న స్పీడ్ ఆఫ్ గవర్నెన్సుకు గూగుల్ ఏఐ డేటా సెంటర్ నుంచి కూడా సహకారం తీసుకుంటాం. సీఎంఓలోని నలుగురు కార్యదర్శులతో పాటు నాకు కొత్తగా ఏఐ అసిస్టెంట్ కూడా సుపరిపాలన అందించేందుకు సహకారం అందిస్తుంది. గూగుల్ రావటంతో విశాఖలోని యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఉత్తరాంధ్ర అంటే గతంలో వలసలు, వెనకబాటుతనం, నిరుద్యోగం కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకే వలస వస్తారు. ట్యాలెంట్ మైగ్రేషన్ ముగిసింది. విశాఖ ఇకపై టాలెంట్‌కు డెస్టినీగా నిలవనుంది. విశాఖకు గూగుల్ సెంటరును తీసుకురావడంలో లోకేష్ చొరవను ప్రశంసిస్తున్నాను. లోకేష్ తొలిసారి గూగుల్ సెంటర్ సందర్శించినప్పుడు విశాఖకు గూగుల్ వస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. కానీ ఆ తర్వాత అది సాకారమైంది. గూగుల్ సంస్థ ఇండియాలో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని భావించినప్పుడు ప్రధానిని కలిశారు. రాష్ట్రానికి గూగుల్ పెట్టుబడులు పెట్టేందుకు సహకరించాలని కోరారు. గూగుల్ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే... పూర్తిగా సహకరిస్తామని ప్రధాని మోదీ చెప్పారు.. చెప్పినట్టుగానే సహకరించారు. లోకేష్ చొరవ... ప్రధాని సహకారంతో విశాఖలో గూగుల్ ప్రాజెక్ట్ సాకారమైంది. ప్రతిష్టాత్మక అదానీ గ్రూప్, ఎయిర్ టెల్ లాంటి దిగ్గజ సంస్థలు ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తాయి. 2028 సెప్టెంబరు నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రారంభించాలని కోరుతున్నాను. ప్రాజెక్టు సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుంది. ఈ ప్రాంతానికి నీటి సమస్య లేదు. 60 రోజుల్లోనే గోదావరి నీరు విశాఖకు తీసుకువస్తాం."అని సీఎం భరోసా ఇచ్చారు.




**విశాఖకు మరిన్ని హంగులు...**

"ఇప్పుడు విశాఖ గ్లోబల్ సిటీ. గ్లోబల్ సిటీగా మారిన విశాఖకు మరిన్ని హంగులు రాబోతున్నాయి. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పినట్టు... విశాఖ శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. జూన్ 1వ తేదీ నుంచి సౌత్ కోస్టల్ రైల్వే జోన్ కు అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేస్తున్నందుకు రైల్వే మంత్రికి ధన్యవాదాలు. ఈస్ట్ వెస్ట్ కారిడార్ ను కలపటం ద్వారా ఈ ప్రాంతాన్ని లాజిస్టిక్స్ పరంగా కూడా అభివృద్ధి చేయవచ్చు. జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభింప చేస్తాం. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ నుంచి కూడా తొలి షిప్ మెంట్ ఎగుమతి అవుతుంది. రెన్యూ పవర్ ద్వారా ఇంగాట్ సోలార్ వేఫర్స్ ఉత్పత్తి కూడా మొదలవుతుంది. అనకాపల్లి జిల్లా మరో రంగారెడ్డి జిల్లాగా తయారై అభివృద్ధికి కేంద్రం అవుతుంది. ఇక బులెట్ ట్రైన్ ప్రాజెక్టుతో రాష్ట్రంలోని వివిధ రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. వచ్చే నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టులు సాకారమయ్యేలా చూడాలని కోరుతున్నాను. దేశంలోకి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు ఏపీకే వచ్చాయి. ఒప్పందాలకు, పెట్టుబడులకే కాదు... ప్రాజెక్టుల గ్రౌండింగ్ లో కూడా ఏపీ నెంబర్ 1గా ఉంది. పోలవరం ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఇప్పటికే ఒప్పందం చేసుకున్నాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, అనిత, గుమ్మిడి సంధ్యారాణి, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎక్కడా లేని ఇంధన కొరత
# ఏపీలోనే ఎందుకొచ్చింది?

ఈ మేరకు ఆమె ఓ రైతు ఆక్రోశిస్తున్న ఓ వీడియో పంచుకున్నారు. "కూటమి పాపం.. ఆక్వా రైతన్న పాలిట శాపం. రాష్ట్రంలో ఇంధన సంక్షోభం రొయ్య రైతులకు అంతులేని కష్టం. కంటికి రెప్పలా చూసుకొనే రొయ్య పిల్లలను బ్రతికించేందుకు ఓ పెట్రోల్ బంకు దగ్గర రైతన్న పడిన ఆవేదన వర్ణనాతీతం. రూ. 500 డీజిల్ కోసం ఆ రైతు రోదించిన తీరు చూసి కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలి. "అన్నా నాకు ఫ్యాన్ సీట్లు (ఏరేటర్) తిరగాలన్నా .. అప్పుచేసి రొయ్య పిల్ల వేశాను.. ఫ్యాన్ సీట్లు తిరగకపోతే నా రొయ్య పిల్ల చచ్చిపోద్ది అన్న" రైతన్న ఆవేదన వింటుంటే ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా? లేనట్లా? చంద్రబాబు గారి ఛాతిలో ఉన్నది గుండెనా? బండనా? ఇది రైతన్నను రక్షించే ప్రభుత్వమా? భక్షించే ప్రభుత్వమా? ఇదేనా చంద్రబాబు గారి విజినరీ? దీన్నే అంటారా అద్భుతమైన గుడ్ గవర్నెన్స్?రైతులతో కాళ్లు పట్టించుకున్న పాపం ఈ కూటమి ప్రభుత్వానికి తగలకపోదు. ఎక్కడా లేని ఇంధన సంక్షోభం ఏపీలోనే ఎందుకొచ్చింది ? ఎన్డీయే పాలిత రాష్ట్రంలో ఇంధనం కోసం ప్రజల పడిగాపులా? పెట్రోల్ బంకుల దగ్గర మల్లయుద్ధాలా? రేషన్ విధానంలో పెట్రోల్, డీజిల్ పోయడమా? సరిపడేంత ఇంధనం ఉంటే దాదాపు 3 వేల బంకుల్లో నో స్టాక్ బోర్డులు ఇవ్వాల్టికి ఎందుకున్నాయి? ఇదేనా రాష్ట్ర ప్రజలపై కేంద్రానికున్న చిత్తశుద్ధి? ఇందుకేనా పడి పడి మోదీజీకి మద్దతు ఇచ్చేది? బంకుల దగ్గర జనాలు అవస్థలు పడుతుంటే, ప్రత్యక్షంగా అన్నీ రంగాలపై ఇంధన సంక్షోభం తీవ్ర పరిణామాలు చూపిస్తుంటే, ఇంకా బీజేపీ భజన చేయడానికి, మోదీగారి తొత్తుగా ఉండటానికి చంద్రబాబు గారు సిగ్గుపడాలి. రాష్ట్రంపై బీజేపీకి పట్టింపు లేదనడానికి ఇంధన సంక్షోభం ఒక నిదర్శనం. వదంతులు నమ్మొద్దని చెప్పే బదులు... ఇప్పటికైనా కళ్లు తెరవండి చంద్రబాబు గారు" అంటూ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# ఈస్ట్-వెస్ట్ రైల్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటు చేయండి




విశాఖలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయాన్ని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం రైల్వే మంత్రితో కలిసి దక్షిణ మధ్య, తూర్పు, దక్షిణ కోస్తా రైల్వే జోన్ల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కొత్త రైల్వే జోన్ కార్యకలాపాలు, ఏపీలో రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి, రైల్వే మంత్రితో కలిసి చర్చించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధి, కార్యకలాపాలు సహా, ఏపీ లోని రైల్వే ప్రాజెక్టుల పై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. 2026 జూన్ 1 తేదీ నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభించేలా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం శుభ పరిణామమన్నారు. నూతనంగా ఏర్పాటు అవుతున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ లో మరికొన్ని రైల్వే సెక్షన్లు విలీనం చేస్తూ కొన్ని పాలనా పరమైన మార్పులు చేయాలని సీఎం కోరారు. ఏపీ రాష్ట్ర పరిధిలోకి వచ్చే అరకు – కొత్తవలస సెక్షన్, కర్నూలు – డోన్ లను కొత్త జోన్ లో కలపడం ద్వారా ఆయా ప్రాంతాల అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని వెల్లడించారు. రైల్ రూట్ డెన్సిటీ లేని కారణంగా ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేసేలా నిర్దేశించుకున్న లక్ష్యాలకు ఇబ్బంది కలుగుతున్నట్టు వివరించారు. రాయలసీమలోని వివిధ ప్రాంతాలను అనుసంధానిస్తూ నూతన రైల్వే మార్గాలను వేయాలని కోరారు. రాష్ట్రంలోని ప్రస్తుతం ఉన్న పోర్టులు సహా కొత్తగా నిర్మిస్తున్న మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులకు కనెక్టివిటీనీ పెంచాలని విజ్ఞప్తి చేశారు. చత్తీస్ ఘడ్, ఒడిశా, తెలంగాణా, మహారాష్ట్రలోని నాగ్ పూర్, మధ్య ప్రదేశ్ లోని ఇటార్సీ, కర్ణాటకలోని బళ్లారి, బెంగుళూరు తదితర ప్రాంతాల నుంచి ఈ పోర్టులకు కార్గో రవాణా చేసేలా హింటర్ ల్యాండ్ ను రైల్వే ద్వారా అనుసంధానించాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను సీఎం చంద్రబాబు కోరారు.

**ఓడరేవుల అనుసంధానం: రైల్వే మంత్రి**

ఏపీలోని పోర్టులను అనుసంధానించే అంశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల్లో జరుగుతున్న పనులు, ప్రతిపాదిత నూతన మార్గాలు, పనుల గురించి ముఖ్యమంత్రికి ఆయన స్వయంగా వివరించారు. ఈ సమీక్షకు మంత్రి డీబీవీ స్వామి,
ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణ బాబు, విష్ణు కుమార్ రాజు, రైల్వే శాఖ ఉన్నతాధికారులు, ఏపీ రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తదితరులు హాజరయ్యారు.

# నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు..

ఫలితాల విడుదలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ ఏడాది మార్చి 14వ తేదీ నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఏప్రిల్ 23వ తేదీ నాటికే జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. వాస్తవానికి మే మొదటి వారంలో ఫలితాలు ప్రకటించాలని తొలుత భావించినప్పటికీ, ఆ గడువు కంటే ముందే ఫలితాలను విడుదల చేస్తుండటం గమనార్హం.

**వాట్సాప్‌లో సులభంగా ఫలితాలు :** ఈ విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ ఎస్సెస్సీ బోర్డు ఒక వినూత్న సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు తమ ఫలితాలను సులభంగా వాట్సాప్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ఇప్పటికే హాల్‌టికెట్లను వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించిన బోర్డు, ఇప్పుడు అదే తరహాలో



ఫలితాలను అందించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే వాట్సాప్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థుల మొబైల్ నంబర్‌కు ఫలితాల మెమో ఆటోమేటిక్‌గా వస్తుంది. ఒకవేళ ఆ సదుపాయం వినియోగించుకోని వారు, తమ ఫలితాలను తెలుసుకోవాలంటే.. 80969 58096 అనే వాట్సాప్ నంబర్‌కు 'ఎఱ' అని సందేశం పంపించాలి. ఆ తర్వాత 'హూజ =వంబశ్రీం' అని టైప్ చేసి, హాల్‌టికెట్ నంబర్ వంటి వివరాలు నమోదు చేస్తే, ఫలితం వారి ఫోన్ స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతుంది. ఈ కొత్త విధానం ద్వారా విద్యార్థులు సర్వర్ల రద్దీ సమస్య లేకుండా తమ ఫలితాలను వేగంగా తెలుసుకునేందుకు వీలు కలుగుతుంది.

## చైనా, రష్యా నేతలతో రాజ్‌నాథ్‌సింగ్ చర్చలు

ఈ సందర్భంగా ఆయన చైనా ప్రతినిధి, పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీకి కమాండర్‌గా పనిచేసిన డాంగ్ జున్ తో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ పర్యటన సందర్భంగా, రాజ్‌నాథ్ సింగ్ రష్యా రక్షణ మంత్రి ఆంద్రీ బెలోసోవ్‌తోనూ సంభాషించారు. ఈ ఉన్నత స్థాయి దౌత్యపరమైన చర్చలు ప్రారంభం కావడానికి ముందు, రాజ్‌నాథ్ సింగ్ విక్టరీ స్క్వేర్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమరవీరులకు నివాళులర్పించారు. కాగా, తాజాగా జరుగుతున్న ఎస్‌సిఓ సమావేశంలో సభ్య దేశాల రక్షణ మంత్రులు అంతర్జాతీయ శాంతి, ఉగ్రవాద నిరోధక చర్యలు, కూటమిలో రక్షణ సహకారాన్ని పెంపొందించడం వంటి కీలక అంశాలపై చర్చించనున్నారు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఏడాది శిఖరాగ్ర సమావేశం జరుగుతున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## నేనూ కోర్టుకు హాజరుకాను

హాజరుకాబోనని సిసోడియా స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం జస్టిస్ స్వరణ కాంతకు లేఖ రాశారు. సోమవారం కేజ్రీవాల్ లిక్కర్ స్కాం కేసులో తాను వ్యక్తిగతంగా కానీ, న్యాయవాది ద్వారా కానీ జస్టిస్ స్వరణ ముందు హాజరుకాబోనని లేఖ రాసిన విషయం తెలిసిందే. అయితే కేజ్రీవాల్ మాదిరిగానే నేడు సిసోడియా కూడా లేఖ రాశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తనకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని ఆ లేఖలో పేర్కొన్నారు. న్యాయ తనతరఫున కూడా ఏ న్యాయవాది హాజరు కారు. మీ పిల్లల భవిష్యత్తు తుషార్ మెహతా చేతుల్లో ఉందని సిసోడియా లేఖలో తీవ్ర విమర్శలు చేశారు. తాను న్యాయాన్ని ఆశించడం లేదని, తాను సత్యాగ్రహ బాటలోనే నడుస్తానని సిసోడియా లేఖలో పేర్కొన్నారు.

## ఉక్కు నగరం నుంచి డేటా సిటీగా విశాఖ..

2019-24 మధ్య రాష్ట్రంలో జరిగిన విధ్వంసాన్ని పునరుద్ధరించేందుకే ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చారని లోకేశ్ అన్నారు. సీఎం చంద్రబాబుకు సైబరాబాద్‌ను హైటెక్ సిటీగా మార్చిన ట్రాక్ రికార్డు ఉందని గుర్తుచేశారు. ఆర్సెలార్ మిట్టల్, గూగుల్ వంటి ప్రాజెక్టులు వేగంగా వస్తుండటమే రాష్ట్రంపై పెట్టుబడిదారులకు పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ సహకారంతో దేశంలోనే 25 శాతం మేర పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయని వివరించారు. తమది 'ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని' విధానమని, 'అభివృద్ధి వికేంద్రీకరణ' నినాదంతో ముందుకు వెళ్తున్నామని లోకేశ్ స్పష్టం చేశారు. క్లస్టర్ ఆధారిత అభివృద్ధితో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు మొత్తం 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.కొందరు ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు కేసులు వేసి ఇబ్బంది పెట్టాలని చూశారని లోకేశ్ విమర్శించారు. 'ప్రజా ప్రభుత్వానిది గూగుల్ అయితే, ఆ పార్టీది గొడ్డలి' అంటూ పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌పై విశ్వాసం ఉంచి పెట్టుబడులు పెట్టినందుకు గూగుల్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాభూమి

ఎన్టీఆర్, కృష్ణా

బుధవారం, ఏప్రిల్ 29, 2026

3


# జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి : కలెక్టర్ డీకే బాలాజి





**ఏడు నియోజకవర్గాల ప్రత్యేక అధికారులతో సమీక్ష**
**రహదారులు, తాగునీరు, మౌలిక వసతులకు అగ్రపీఠం**
**ప్రభుత్వానికి సమగ్ర నివేదికలు పంపాలని ఆదేశం**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు యుద్ధ ప్రాతిపదికన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కృష్ణజిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో నియోజకవర్గాల ప్రత్యేక అధికారులతో ఆయన కీలక సమీక్ష నిర్వహించారు.ప్రాధాన్యత క్రమంలో పనులుజిల్లాలోని మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, గుడివాడ, పామర్రు, గన్నవరం మరి యు పెనమలూరు నియోజకవర్గాల్లో చేపట్టా ల్సిన పనులపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా ఈ క్రింది అంశాలపై దృష్టి సారించాలని సూచించారురవాణా సౌకర్యాలు బీటీ మరియు సీసీ రహదారుల అభివృద్ధి. మురుగు నీటి పారుదల కోసం సీసీ డ్రైన్ల నిర్మాణం.

తాగునీరు: ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ల ఏర్పాటు.కమ్యూనిటీ భవనాల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలు.ప్రతిపాదనల్లో ఆయా పనుల వల్ల ఏ ప్రాంతాలకు మేలు జరుగుతుంది, ఎంతమంది జనాభా లబ్ధి పొందుతారు అనే అంశాలను స్పష్టంగా పేర్కొనాలి. అప్పుడే నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి సమగ్ర నివేదికలు పంపడం సులభతరమవుతుంది.డీకే బాలాజి, జిల్లా కలెక్టర్అధికారుల భాగస్వామ్యం ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ నమ్రత అగర్వాల్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గాల ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తున్న డ్వామా పీడీ ఎన్. శివప్రసాద్ యాదవ్, మార్కెటింగ్ ఏడీ నిత్యానంద్, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి. షేక్ షాహిద్ బాబు, పశుసంవర్ధక శాఖ అధికారి చిన నరసింహులు, మెప్మా పీడీ సాయిబాబు, మార్క్‌ఫెడ్ డీఎం మురళీ కిషోర్, గణాంక అధికారిణి కె. పద్మజ తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.త్వరితగతిన నివేదికలు అందిస్తే, నిధుల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి జిల్లా రూపురేఖలు మారుస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# బందరు రేవు సాకారం.. వైసిపి సంకల్ప గర్జన



**మచిలీపట్నం వేదికగా భారీ సమావేశం**
**పోర్టు పనుల వేగవంతమే లక్ష్యం**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కృష్ణా జిల్లా రాజకీయ ముఖచిత్రం మరోసారి వేడెక్కింది. దశాబ్దాల కల అయిన బందరు పోర్టు నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయాలన్న దృఢ నిశ్చయంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భారీ సంకల్పసాధన సమావేశం నిర్వ హించింది. పోర్టు పనుల్లో పురోగతిని సమీక్షించడంతో పాటు, భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేసేందుకు పార్టీ శ్రేణులు మచిలీపట్నంలో ఏకమయ్యాయి.హేమాహేమీల హాజరు - ప్రాంతీయ సమన్వయకర్తల దిశా నిర్దేశంవైఎస్సార్సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం పార్టీ ఐక్యతకు, అభివృద్ధి కాంక్షకు అద్దం పట్టింది.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ కార్యక్రమంలో పలు జిల్లాల అధ్యక్షులు మరియు కీలక నేతలు తమ గళాన్ని వినిపించారు: మేరుగు నాగార్జున (పల్నాడు)పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (బాపట్ల) పేర్నినాని (కృష్ణా జిల్లా)దేవినేని అవినాష్ (ఎన్టీఆర్ జిల్లా)దూలం నాగేశ్వరరావు (ఏలూరు)ముదునూరి ప్రసాదరాజు (పశ్చిమ గోదావరి)చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ (తూర్పు గోదావరి) బందరు పోర్టు కేవలం ఒక నిర్మాణం కాదు.. ఈ ప్రాంత ఆర్థిక విప్లవం. పనులు వేగవంతం చేయడమే మా ఏకైక లక్ష్యం.సమావేశంలో వై.వి. సుబ్బారెడ్డి వ్యాఖ్యలుమూడు జిల్లాల సమన్వయం.. ఇంఛార్జిల వ్యూహరచనఉమ్మడి గుంటూరు, కృష్ణా, మరియు పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన నియోజక వర్గ ఇంచార్జీలు ఈ సమావేశంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పోర్టు ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని నేతలు తీర్మానించారు.

పోర్టు పనుల ప్రస్తుత స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్.నిర్దేశ గడువులోగా ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రణాళికలు.ఉమ్మడి జిల్లాల నేతల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీల ఏర్పాటు.మచిలీపట్నంలో పోర్టు రాకతో ఈ భారీ ప్రాజెక్టు ద్వారా లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని, దీని కోసం వైసిపి శ్రేణులు అంకితభావంతో పనిచేయాలని ఈ సమావేశం పిలుపునిచ్చింది.

# బందరుకు వచ్చింది దండుపాళ్యం బ్యాచ్..

**వారి మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లే**
**వైసీపీ నేతల తీరుపై మంత్రి కొల్లు రవీంద్ర నిప్పులు**
**డిసెంబర్ నాటికి మచిలీపట్నం పోర్టు పూర్తి చేసి తీరుతాం**
**లడ్డూలు కల్తీ చేసిన వారు, హత్యలు చేసిన వారు నీతులు చెప్పడమా?**



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

మచిలీపట్నం అభివృద్ధి విషయంలో వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు బందరు అభివృద్ధిని అడ్డుకున్న వ్యక్తులు ఇప్పుడు ఇక్కడికి వచ్చి ఏదో ఉద్ధరించినట్లు మాట్లాడటం హాస్యాస్పదమని మండిపడ్డారు.దోపిడీ బ్యాచ్‌కు బందరులో ఏం పని?వైసీపీ నేతల గతాన్ని ప్రస్తావిస్తూ మంత్రి ఘాటు విమర్శలు చేశారుఅవినీతి చరిత్ర టీటీడీ లడ్డూను కల్తీ చేసి జేబులు నింపుకున్న వారు, పేదల బియ్యాన్ని బొక్కేసి బెయిలుపై తిరుగుతున్న వారు బందరు వచ్చి నీతులు చెబుతున్నారని ధ్వజమెత్తారు.పెట్టుబడుల విద్రోహులు కియా సంస్థను కమిషన్ల కోసం బెదిరించిన చరిత్రలు వంటి అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రం నుండి తరిమేసిన నీచ చరిత్ర వైసీపీదేనని ఆరోపించారు.

ఈవీఎంలు పగలగొట్టి, హత్యలు చేసి జైలుకు వెళ్లి వచ్చిన వారు కూడా నేడు రాజకీయాల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.పోర్టు ద్రోహి పేర్ని నానిబందరు పోర్టు విషయంలో మాజీ మంత్రి పేర్ని నాని వైఖరిని మంత్రి కొల్లు రవీంద్ర ఎండగట్టారు. పోర్టును గోగిలేరుకు తరిమేసేందుకు లేఖలు రాసిన ఘనుడు నాని. మేము పోర్టు కోసం ఉద్యమాలు చేస్తే మమ్మల్ని పెయిడ్ ఆర్టిస్టులని అవహేళన చేశారు. ముక్కు నేలకు రాస్తా, రాజకీయ సన్యాసం తీసుకుంటా అని ప్రగల్భాలు పలికిన ఆయన, అధికారంలో ఉన్న ఐదేళ్లూ పోర్టును గాలికి వదిలేశారు" అని విమర్శించారు.కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాకారంమచిలీపట్నం పోర్టు పురోగతిపై మంత్రి స్పష్టతనిచ్చారు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పోర్టు పనులను వేగవంతం చేసి, ఇప్పటికే 40 శాతం పూర్తి చేశామన్నారు.ఈ ఏడాది డిసెంబర్ నాటికి పోర్టు పనులను పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు, పెట్టుబడుల ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.అసెంబ్లీకి ఎందుకు రావడం లేదు?వైసీపీ నేతలకు ప్రజా సమస్యలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసిరారు. ప్రజల భావోద్వేగాలతో ఆడుకోవడమే జగన్ రెడ్డి పనిగా పెట్టుకున్నారని, తప్పుడు ప్రచారాలతో రాజకీయ విద్వేషాలు సృష్టించాలని చూస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ సమావేశంలో కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, తెలుగుదేశం టౌన్ పార్టీ అధ్యక్షులు లోగిశెట్టి స్వామి, ఇలియాజ్ భాషా, వివిధ వార్డు ఇన్చార్జిలు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కుంచె దుర్గాప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్

మచిలీపట్నం/ప్రజా భూమి ప్రతినిధి

మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్, ప్రముఖ నాయకులు కుంచె దుర్గాప్రసాద్ (నాని) గని స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర మిషన్ రాష్ట్ర డైరెక్టర్ బోలు నాగమణి భర్త మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న దుర్గాప్రసాద్ గారిని మంగళవారం వారు కలిశారు.ఆరోగ్యంపై ఆరా - త్వరగా కోలుకోవాలని ఆకాంక్షఈ సందర్భంగా బోలు నాగమణి , వారి భర్త రామారావు దుర్గాప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించి, వారు పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకుని తిరిగి ప్రజా సేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శించిన వారిలో రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు స్థానిక నాయకులు కూడా ఉన్నారుస్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర మిషన్ డైరెక్టర్రామారావు ప్రముఖ నాయకులురాంబాబు చల్లపల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుఈడే శీను నవీన్ మెట్ల కాలనీ ప్రధాన కార్యదర్శి



వీరితో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ముఖ్య నేతలు దుర్గాప్రసాద్ గారిని పరామర్శించి ధైర్యాన్ని నింపారు.



# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

**ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు**
**వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రారంభించిన మాజీ ఎంపీ**
**పుస్తక పఠనంతోనే ఉన్నత శిఖరాలకు చేరవచ్చు**
**మచిలీపట్నం జిల్లా గ్రంథాలయంలో ఘనంగా శిక్షణ తరగతుల ప్రారంభం**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు గ్రంథాలయాలు పునాదులని, అవి విజ్ఞానాన్ని అందించే అక్షయ పాత్రలని రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులను మంగళవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనుభవమే నా పాఠం.. గ్రంథాలయమే నా మార్గదర్శి ఈ సందర్భంగా కొనకళ్ళ మాట్లాడుతూ తన జీవిత అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. నేను కేవలం పదో తరగతి వరకే చదువుకున్నప్పటికీ, మచిలీపట్నం లైబ్రరీలో చదివిన పుస్తకాలే నాకు విజ్ఞానాన్ని ఇచ్చాయి. ఆ జ్ఞానంతోనే దేశ అత్యున్నత చట్టసభ అయిన లోక్‌సభలో స్పీకర్ ప్యానెల్‌లో కూర్చుని సభను నడిపే స్థాయికి ఎదిగాను. గ్రంథాలయాలకు నేను ఎప్పుడూ రుణపడి ఉంటాను అని భావోద్వేగంగా పేర్కొన్నారు. సెల్ ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉండి పుస్తక పఠనం వైపు మళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.నేటి కాలానుగుణంగా గ్రంథాలయాల అభివృద్ధిజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు కేటాయిస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీలను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఉషా మాట్లాడుతూ.. తాను మధ్యప్రదేశ్‌లో పుట్టినప్పటికీ, లైబ్రరీ ద్వారా పుస్తకాలు, పేపర్లు చదవడం వల్లే నేడు తెలుగులో అనర్గళంగా మాట్లాడగలుగుతున్నానని వివరించారు.పిల్లల్లో నైతిక విలువలు పెంచాలిసీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ.. పిల్లలను చిన్నతనం నుంచే నైతిక విలువలతో పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణం కావొద్దని హెచ్చరించారు.40 రోజుల శిక్షణ జిల్లా గ్రంథాలయంలో 40 రోజుల పాటు నిష్ణాతులైన వారితో శిక్షణ తరగతులు జరుగుతాయని కార్యదర్శి వేములపల్లి రవికుమార్ తెలిపారు.ఉచిత శిక్షణ బుధవారం ఉదయం 8 నుండి 11 గంటల వరకు గ్రంథాలయ ప్రాంగణంలో ఈ ఉచిత తరగతులు నిర్వహించబడతాయి.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సహాయ లైబ్రేరియన్ బీరం వెంకట రమణ, కార్పొరేటర్ మరకాని సమతా కీర్తి, ప్రముఖ కవయిత్రి గుడిపూడి రాధికా రాణి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణి కుమార్, అధ్యాపకులు దిట్టకవి వెంకటేశ్వరరావు, సవరం వెంకటేశ్వరరావు, ముదిగొండ శాస్త్రి, పలువురు కవులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పేదలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలి

**ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**
**అవనిగడ్డలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ జే.సాయితేజ్, డాక్టర్ వై.హైందవి**

అవనిగడ్డ ప్రజాభూమి ప్రతినిధి

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పేదలకు ఉత్తమ సేవలు అందించి మంచిపేరు తెచ్చుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. మంగళవారం చల్లపల్లి మండలం పురిటిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన వైద్యాధికారులు డాక్టర్ జే.సాయితేజ్, డాక్టర్ వై.హైందవి అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాదును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కే.సుమతి, ఎంపీహెచ్ఎస్ఎఫ్ ఎం.భరణి పాల్గొన్నారు. పురిటిగడ్డలో విధులు నిర్వహించిన డాక్టర్ విజయరావు, డాక్టర్ శివరామకృష్ణ బదిలీ కాగా, విజయవాడ యూ. పీ. హెచ్. సీ



నుంచి డాక్టర్ జే.సాయితేజ్, గుంటూరు సంగడిగుంట యూ.పీ.హెచ్.సీ నుంచి డాక్టర్ వై.హైందవి పురిటిగడ్డకు బదిలీపై వచ్చారు.

# కృష్ణా యూనివర్సిటీలో డిజిటల్ లిటరసీ పై అవగాహన సదస్సు

**నేటి విద్యా విధానంలో డిజిటల్ పరిజ్ఞానం అనివార్యం : బాబు రెడ్డి**




మచిలీపట్నం /ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా విశ్వవిద్యాలయంలోని అనుబంధ కళాశాలల విద్యార్థుల కోసం జాతీయ విద్యా విధానం ( ఎన్ ఈ పి 2020) ఆధ్వర్యంలో మంగళవారం డిజిటల్ లిటరసీ & ఇన్నోవేషన్ పై ప్రత్యేక అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. స్థానిక అకడమిక్ బ్లాక్‌లోని గది సంఖ్య 113లో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది.డిజిటల్ విప్లవమే లక్ష్యంఈ సదస్సులో ముఖ్యంగా ఆధునిక బోధన-అభ్యాస పద్ధతులు, సాంకేతికతను విద్యలో ఎలా అనుసంధానం చేయాలి మరియు విద్యా పరిపాలనలో డిజిటల్ మార్పుల ప్రాముఖ్యతపై లోతైన చర్చ జరిగింది. ఏ బి సి పై ప్రత్యేక దృష్టి విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమైన అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ ( ఏ బి సి ) గురించి ఈ సందర్భంగా సమగ్రంగా వివరించారు. దీని ప్రాముఖ్యత, అమ లు తీరు మరియు విద్యార్థుల భవిష్యత్తుకు ఇది ఎలా తోడ్పడుతుందనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి బాబు రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిజిటల్ పరిజ్ఞానం విద్యార్థులకు ఆయుధం వంటిది. ఎన్ ఈ పి 2020 ద్వారా వస్తున్న విప్లవాత్మక మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని ఎన్ ఈ పి సార్థి సమన్వయకర్త సుశీల గసమన్వయం చేయగా, నీప్ సారథి సభ్యులు ఎస్. రూపి జెస్సికా, పి. దుర్గా బి, ఎస్. తులసి దుర్గా నాగలక్ష్మి తదితరులు కార్యక్రమ విజయవంతంలో కీలక పాత్ర పోషించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.విద్యార్థులు తమ డిజిటల్ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ నవ ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయకపోతే సహించేది లేదు



**అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**
**మోపిదేవి ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్**
**పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేసిన నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు**

అవనిగడ్డ / మోపిదేవి ప్రజాభూమి ప్రతినిధి

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయకపోతే సహించేది లేదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం మోపిదేవి మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార పనుల్లో అధికారుల నిర్లక్ష్యంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపాదనలు ఆలస్యమైతే నిధుల సాధన ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించే, అభివృద్ధి అంచనాలు రూపొందించే అధికారులే గ్రామ ప్రత్యేక అధికారులుగా ఉన్న నేపథ్యంలో వారందరూ కీలకంగా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రత్యేక అధికారులు కొరడా ఝళిపించి కార్యదర్శులతో సమర్థవంతంగా పని చేయించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు, మార్గదర్శకాలకు అనుగుణంగా సకాలంలో ప్రతిపాదనలు రూపొందించకపోతే అభివృద్ధి నిధుల సాధన ఎలా సాధ్యం అని ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు మాట్లాడుతూ జలధార పనుల ఎంపిక, తీర్మానాలు ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తూ పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మోపిదేవి మండలం ఒక్కటే వెనుకబడి ఉందన్నారు. చెరువులు, కాలువలు ఉపాధి హామీ కార్మికుల ద్వారా పూడిక తీయించుకునే బాధ్యత విస్మరించిన పంచాయతీ కార్యదర్శులపై భగ్గుమన్నారు. పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పని చేయకపోతే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సస్పెండ్ చేయిస్తానని సాయిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రజల నుంచి 42 అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే వాటిని పరిశీలించి పరిష్కారాలు సూచించారు. ప్రజా దర్బార్ అర్జీలను సంబంధిత అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. సీఎం



చంద్రబాబు ప్రాముఖ్యతనిచ్చి చేపట్టిన ఈప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఆషామాషీగా తీసుకోవద్దని సూచించారు. నూతన రహదారుల పరిరక్షణపై ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నూతనంగా నిర్మించిన గ్రామీణ రహదారులు ధ్వంసం కాకుండా పరిరక్షించాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సూచించారు. నూతన రోడ్లపై ట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా, అతివేగంగా రాకపోకలు సాగిస్తున్నాయని, భారీ టిప్పర్లు తిరుగుతున్నాయని తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వాహనాలను రెవిన్యూ, పోలీస్ అధికారులు గుర్తించి నియంత్రించాలని ఎమ్మెల్యే సూచిం చారు. పంచాయతీరాజ్ శాఖ డీఈఈ పగడాల సురేష్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించిన అభివృద్ధి పనులు, నిర్మించిన సీసీ, తారు రోడ్ల వివరాలు సభ దృష్టికి తీసుకువచ్చారు. రహదారుల పరిరక్షణకు రెవిన్యూ, పోలీస్ అధికారుల సహకారం కోరారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీపీ నడకుదుటి జనసీకుమారి, తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాధ్, ఎంపీడీఓ జంగం స్వర్ణభారతి, వివిధ శాఖల డీఈఈలు, ఏఈఈలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.<

# మచిలీపట్నంలో వైభవంగా మోహన్ క్యాటరర్స్ యజమాని కుమార్తె వివాహం

**హాజరైన మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ళ నారాయణ,బండి రామకృష్ణ**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి



స్థానిక మోహన్ క్యాటరర్స్ అధినేత రామ మోహన్ రావు - భారతి దంపతుల కుమార్తె గ్రేస్ లదియా, ప్రశాంత్ ల వివాహ వేడుక మచిలీపట్నంలో కన్నుల పండువగా జరిగింది. ఈ వేడుకకు రాజకీయ ప్రముఖులు భారీగా తరలివచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు.ప్రముఖుల సందడివివాహ వేడుకకు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా విచ్చేశారు. వధూవరులకు పుష్పగుచ్ఛం అందించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. మంత్రితో పాటు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, రాజకీయ నేతలు ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.కొల్లు రవీంద్ర - రాష్ట్ర మంత్రికొనకళ్ల నారాయణరావు - ఆర్టీసీ చైర్మన్బండి రామకృష్ణ - డీసీఎంఎస్ చైర్మన్వివాహానికి హాజరైన అతిథులకు రామ మోహన్ రావు దంపతులు సాదరంగా స్వాగతం పలికారు. పట్టణంలోని పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు కూడా ఈ వేడుకలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజాభూమి

## ఏలూరు, పశ్చిమగోదావరి 4

బుధవారం 29, ఏప్రిల్ 2026


## పెట్రోల్ బంకులు వద్ద సిబ్బందిని ఉంచి డీజిల్ సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

**డీజిల్ సమస్యపై అధికారులు, తహాశీల్దార్లతో కలెక్టర్ కె. వెట్రిసెల్వి టెలి కాన్ఫరెన్స్**




**ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**

పెట్రోల్ బంకుల వద్ద డీజిల్ పక్కదారి పట్టకుండా సిబ్బందిని నియమించి డీజిల్ సక్రమంగా సరఫరా అయ్యేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. డీజిల్ కొరతపై మంగళవారం అధికారులు, తహశీల్దార్లతో కలెక్టర్ టెలీకాన్ఫెరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వివిధ ఆయిల్ కంపెనీల నుండి ట్యాంకర్లు మంగళవారం మధ్యాహ్నానికి ఇండెంట్ పెట్టిన బంక్ లకు చేరుకుంటున్నాయని, బంక్ ల నుండి డీజిల్ సక్రమంగా సరఫరా జరిగేలా ప్రతీ బంక్ దగ్గర సిబ్బందిని నియమించి పర్యవేక్షించాలన్నారు. బంక్‌లలో డీజిల్ నిల్వలు పరిశీలించి, రికార్డ్‌లలో తెలియజేసిన నిల్వలలో లోటుపాట్లు ఉన్నా, అధిక ధరలకు అమ్ముతున్నా, డీజిల్ నిల్వలు ఉన్నప్పటికీ నో స్టాక్ బోర్డులు పెడుతున్న తనిఖీలు చేసి కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో గత వారం సాధారణ వినియోగం కంటే 200 శాతం అధికంగా డీజిల్‌ను అందుబాటులో ఉంచినప్పటికీ సోషల్ మీడియా ద్వారా డీజిల్ కొరత ఉందంటూ వదంతులు వ్యాప్తి చెందడంతో డీజిల్ కొరత ఏర్పడుతుందేమోనని ఆందోళనతో పానిక్ కొనుగాళ్లకు ప్రజలు ప్రయత్నిస్తున్నారని, దీనికారణంగా సమస్య ఏర్పడుతుందన్నారు. ప్రజలు ఆందోళన చెందకుండా ప్రజల అవసరాలకు సరిపడా డీజిల్ నిల్వలు ఉన్నాయని ప్రజలకు తెలియజేయాలన్నారు. వ్యవసాయానికి హార్వెస్టింగ్ యంత్రాలు వినియోగించే వారికి ఏ రోజు వినియోగిస్తున్నారో తెలుసుకుని అదే రోజుకు డీజిల్ సరఫరా అయ్యేలా చూడాలన్నారు. అదేవిధంగా ఆక్వా రైతులకు కూడా సమస్య లేకుండా డీజిల్ అందేలా చూడాలన్నారు. డీజిల్ కొరతపై ఫిర్యాదులను కంట్రోల్ రూమ్ 75692 96272 నంబర్ కి ఫిర్యాదు చేసేలా ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓలు కిషోర్, రమణ, డిఎస్ఓ బాబు విలియమ్స్, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా , మత్స్య శాఖాధికారి రాజ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగ పరచుకోవాలి




**ప్రజాభూమి ప్రతినిధి – పెదపాడు**

విద్యార్థుల మనోవికాసాన్ని పెంపొందించుకునేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పెదపాడు గ్రంధాల అధికారి దుగ్గపోగు జాన్ బాబు అన్నారు. మంగళవారం పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కార్యక్రమాలు ఆసక్తికరంగా ప్రారంభమైనది. ఈ కార్యక్రమంలో వేల్పుల ప్రభాకర్ మాస్టారు,ఎం. వేణుగోపాల్ మాస్టారు,ఎం.సురేష్ మాస్టారు పాల్గొని వేసవి శిక్షణ శిబిరం ను ప్రారంభించినారు. ఈ సందర్భంగా ప్రారంభకులు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు వీటిని ప్రతి ఒక్క విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవల సినదిగా కోరినారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రతి ఒక్కరూ సెల్ ఫోనుకు దూరంగా ఉండి ఎండలో తిరగకుండా క్రమశిక్షణతో గ్రంథాలయంలో జరగబోవు కార్యక్రమంలో అన్నింటిలో పాల్గొని మంచి విజ్ఞానం సంపాదిం చుకోవాలని తెలిపారు. పిల్లలతో క్యారమ్స్ ఆట ఆడించారు. తదుపరి కథలు చెప్పడం, కథలు చదివించడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ పూడి రవికుమార్, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు,విద్యార్థిని, విద్యార్థులు 15 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గ్రంథా లయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

## ఏలూరులో అధికారులతో పెట్రోల్ బంకులు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**డీజిల్ కొరతపై ఫిర్యాదులను కంట్రోల్ రూమ్ 7569296272 నంబర్ కి ఫిర్యాదు చెయ్యండి**



**ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**

డీజిల్ కృతిమ కొరత సృష్టించే బంక్ యజమానులపై కేసులు నమోదు చేయాలనీ జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏలూరు నగరంలోని పలు పెట్రోల్ బంక్ లను మంగళవారం అధికారులతో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి ఆకస్మికంగా తనిఖీ చేసి డీజిల్ నిల్వలు, సరఫరా, రికార్డులను పరిశీలించారు. ఏలూరు నగరంలోని వెంకటాపురం శ్రీ సరస్వతి పెట్రోల్‌బంక్,, వంగాయగూడెం లోని ఎస్. ఆర్. ప్రీమియం ఫ్యూయల్స్. ఏలూరు నరసింహారావు పేటలోని ది ఏలూరు పెట్రోల్ సప్లై కంపెనీ బంక్ లను పరిశీలించి, డీజిల్ నిల్వలు, సరఫరా, రికార్డులనుఅధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో గత వారం సాధారణ వినియోగం కంటే 200 శాతం అధికంగా డీజిల్ ను అందుబాటులో ఉంచినప్పటికీ సోషల్ మీడియా ద్వారా డీజిల్ కొరత ఉందంటూ వదంతులు వ్యాప్తి చెందడంతో డీజిల్ కొరత ఏర్పడుతుందేమోనని ఆందోళనతో పానిక్ కొనుగాళ్లకు ప్రజలు ప్రయత్నిస్తున్నారని, దీనికారణంగా సమస్య ఏర్పడుతుందన్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని కొందరు బంక్ యజమానులు డీజిల్ నిల్వలు ఉన్నప్పటికీ వారి బంక్ ల ముందు నో స్టాక్ లు పెడుతున్నారన్నారు. దీనికారణంగా ప్రజలలో మరింత ఆందోళన పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. తహసీల్దార్లు, పౌర సరఫరాల శాఖాధికారులు తమ పరిధిలోని బంక్ లను పరిశీలించి డీజిల్ నిల్వలు ఉన్నప్పటికీ నో స్టాక్ బోర్డులు పెట్టి కృత్రిమ కొరత సృష్టించే వారిపై, పెట్రోల్, డీజిల్ ను బ్లాక్ మార్కెటింగ్ చేసే బంక్ యజమానులపై కేసులు నమోదు చేయాలనీ ఆదేశించారు. డీజిల్ ను ఇళ్లవద్ద నిల్వ ఉంచవద్దని, మండే స్వభావం ఉన్న డీజిల్, వేసవి తీవ్రత దృష్ట్యా అగ్నిప్రమాదాలకు కారణమవుతుందని, ఈ విషయాన్నీ ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓలు కిషోర్, రమణ, డిఎస్ఓ బాబు విలియమ్స్, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా , మత్స్య శాఖాధికారి రాజ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## చిత్తూరు జర్నలిస్ట్‌పై దాడి అమానుషం

**దోషుల్ని వెంటనే అరెస్ట్ చేయాలి: ఏపీడబ్ల్యు జె ఎఫ్, ఏపీబీజేఏ డిమాండ్**



**ప్రజాభూమి – ఏలూరు**

చిత్తూరు జిల్లా వీకోటలో ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డిపై జరిగిన క్రూర హత్యను తీవ్రంగా ఖండిస్తూ, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యు జేఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఎ పి బి జే ఎ ) ఏలూరు జిల్లా శాఖలు డిమాండ్ చేశాయి. ఈ ఘటన రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతగా దిగజారాయో చూపిస్తున్నదని, జర్నలిస్టులపై ఇటువంటి దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమని సంఘాల నాయకులు పేర్కొన్నారు. సమాజం కోసం పనిచేసే జర్నలిస్టులు కూడా భయంతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోయారు. ఇలాంటి దారుణ సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యు జె ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్. శంకర్రావు, సీనియర్ నాయకుడు కె. బాలసౌరి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎస్.డి. జబీర్, కార్యదర్శి వై.వి. హరీష్, ఏపీబీజేఏ అధ్యక్షుడు పి. నారాయణరావు, కార్యదర్శి కిరణ్ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.

## ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధతపై శిక్షణ ముగింపు



**ప్రజా భూమి ప్రతినిధి – ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి మండలంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణను ఆగిరిపల్లి రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండవ రోజు శిక్షణ కార్యక్రమం ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారి జె. భవాని ఇతర శిక్షణా తరగతులకు హాజరైన నేపథ్యంలో, నూజివీడు మండల వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు ఆధ్వర్యంలో కొనసాగింది. రాబోయే ఖరీఫ్ సీజన్‌లో అనుసరించాల్సిన సాగు విధానాలు, వ్యవసాయ శాఖ ప్రణాళికలు, రైతులకు అందించాల్సిన సేవలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మండల వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు, ప్రకృతి వ్యవసాయ మండల ఇంచార్జి అల్పన్నా రాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అలాగే గ్రామాల వారీగా వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

## సిసి రహదారుల పనులు పరిశీలించిన ఎమ్మెల్యే బడేటి చంటి



**ప్రజాభూమి – ఏలూరు**

జవాబుదారీ పాలనకు పారదర్శక విధానాలు తోడైతేనే ప్రజామోదం లభిస్తుందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు 4, 5 డివిజన్‌లలో రూ. 35 లక్షలతో నిర్మిస్తున్న సిసి రహదారుల పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న రహదారులు, పూర్తైన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గతంలో పాదయాత్రలో గుర్తించిన సమస్యలకు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏర్పడిన రహదారి సమస్యలను పరిష్కరిస్తున్నామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీలు నెరవేర్చడంలో వెనుకడుగు వేయబోమని చెప్పారు. జూన్ నెలాఖరు నాటికి టిడ్కో గృహాలను అర్హులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ కొరతను అరికట్టాలి : సిఐటియు




**ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**

పెట్రోల్ డీజిల్ కొరతను అరికట్టాలని సీఐటీయూ అనుబంధ ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు చక్రాల అమర్ కుమార్ జే గోపి డిమాండ్ చేశారు. డీజిల్ పెట్రోల్ కొరతను నిరసిస్తూ ఏలూరు పాత బస్ స్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయిల్ కొరత అరికట్టాలి అని ఉపాధి అవకాశాలు కాపాడాలని, నినాదాలు చేశారు ఈ ధర్నా ను ఉద్దేశించి అమర్ కుమార్ గోపి మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులు పెట్రోల్ డీజిల్ కొరతతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయిల్ కంపెనీల ధన దాహానికి సామాన్య వినియోగదారులు బలైపోతున్నారని, ఆయిల్ కంపెనీలు బ్లాక్ మెయిల్ చేస్తున్న అరికట్టలేని స్థితిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. ఆటోలకు ఇతర వాహనాలకు రేషన్ పద్ధతిలో 200 నుండి 300 రూపాయల ఆయిల్ మాత్రమే పెట్రోల్ బంకులు యాజమాన్యాలు కొడుతున్నాయని అయినప్పటికీ కొరత తీవ్రంగా ఉండటం ప్రభుత్వ వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. ఆటో నడిపితేనే రోజువారి కుటుంబ పోషణ జరుగుతుందని, డీజిల్ కొరత వలన సగటు ఆటో డ్రైవర్ బతుకు బండి నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత రాష్ట్రంలోనే 115 పట్టణాలలో రాపిడ్ వంటి కార్పొరేట్ కంపెనీలకు అనుమతులు ఇచ్చి ఆటో డ్రైవర్ల నడ్డి విరిచిందని, స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు పథకం వలన తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని ఇది చాలా దాన్నట్లు ఇప్పుడు డీజిల్ కొరత వలన ఆటోడ్రైవర్లు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నారా లోకేష్ యువ గళం పాదయాత్రలో ఇచ్చిన వెల్ఫేర్ బోర్డు హామీ పేరు దాటిన తర్వాత బోడి మల్లన్న చందంగా ఉన్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నారపల్లి రమణారావు, వైయస్ కనకారావు, మంచెల్ల ఇస్సాకు, పంపన రవికుమార్, అద్దాల నాని, పి. నారాయణ, శ్రీను, పాపి నాయుడు, గనిగంటి కోటేశ్వరరావు, ఎస్ సత్యనారాయణ, ఈ ధర్నాకు నాయకత్వం వహించగా పెద్ద ఎత్తున ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## అవగాహనతోనే నేరాలకు అడ్డుకట్ట




**ప్రజాభూమి ప్రతినిధి – నూజివీడు**

ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, నూజివీడు డిఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో, రూరల్ సిఐ కె. రామకృష్ణ, ఎస్సై జ్యోతిబసు పాల్గొనగా పోతిరెడ్డిపల్లి గ్రామంలో మహిళల భద్రత, బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల రక్షణ చట్టాలు, బాల్య వివాహాలపై చర్యలు, 112, 181, 1098 హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై సూచనలు ఇచ్చారు. చట్టంపై అవగాహనతోనే నేరాలకు అడ్డుకట్ట పడుతుందని డిఎస్పీ ప్రసాద్ తెలిపారు.

## ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటితో ప్రెస్ ఫోరమ్ ప్రతినిధుల భేటీ



**ప్రజాభూమి – ఏలూరు**

ది ఏలూరు ప్రెస్ ఫోరమ్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ఈరోజు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫోరమ్ నూతన అధ్యక్షులు ద్రోణంరాజు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి పి. రవీంద్ర కుమార్, గౌరవ అధ్యక్షులు పి.వి.ఎ. ప్రసాద్, పి.ఆర్.ఓ ఎస్. సంజయ్ పాల్గొన్నారు. ప్రెస్ ఫోరమ్ అభివృద్ధి, జర్నలిస్టుల సంక్షేమం, కార్యాలయానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్తులో జర్నలిస్టులకు ఉపయోగపడే విధంగా శిక్షణా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలనే తమ లక్ష్యాలను ప్రతినిధులు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బడేటి చంటి ప్రెస్ ఫోరమ్ చేస్తున్న సేవలను అభినందిస్తూ, జర్నలిస్టుల అభ్యున్నతికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పత్రికా రంగం బలోపేతానికి తన వంతు సహకారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## శోభనాచలునుని జయంతి ఉత్సవాలు



**ప్రజా భూమి ప్రతినిధి – ఆగిరిపల్లి**

శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 30న జయంతి ఉత్సవాలు ప్రారంభమై సుప్రభాత సేవ, విశేష అర్చనలు, నవకలశ పంచామృత స్నపన, సహస్రనామార్చన, హోమాలు నిర్వహించనున్నారు. మే 1న వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఎగువ సన్నిధిలో స్వామివారికి పంచామృత స్నపన, విశేష అలంకరణ, సహస్రనామార్చన, నారసింహ మూల మంత్ర హోమం జరుగుతుంది. ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై సోమవారం దర్శించుకుని తీర్థ ప్రసాదాలు సేకరించవలసిందిగా ఆలయ కార్యనిర్వహణాధికారి సిహెచ్ సాయి తెలిపారు.

## మేడే వేడుకలను జయప్రదం చేయాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం. నాగమణి**



**ప్రజాభూమి – బుట్టాయగూడెం.**

మే డే వేడుకలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు మొడియం నాగమణి పిలుపు నిచ్చారు. బుట్టాయగూడెంలో మంగళవారం మేడే గోడ పత్రికలను నాగమణి ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా నాగమణి మాట్లాడుతూ 140 సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక హక్కుల కోసం జరిగిన పోరాటంలో ఎందరో కార్మికులు బలయ్యారని గుర్తు చేశారు. అవే హక్కుల కోసం మళ్లీ నేటి కార్మికులు కూడా పోరాటాలు చేయడం, ప్రాణాలను ఫణంగా పెట్టడం నేటికీ జరు గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గం మేలుకోకపోతే ప్రస్తుత కనీస స్థితిగతుల నుండి మరింత బలహీన పడి తీవ్రమైన బానిసత్వంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులంతా మేడే పతా కాన్ని వాడ వాడలా ఎగురవెయ్యాలని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన నాలుగు లేబర్ కొండలు రద్దు చేయాలని, స్కీం వర్కర్స్ కు సమాన పనికి సమాన వేతనాలు కల్పించాలని , కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పి శేఖర్, రామలక్ష్మి, భూదేవి, కృష్ణ, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓ అభాగ్యురాలి కష్టానికి చలించిన మంత్రి దుర్గేష్

- కారు దిగి వచ్చి.. కన్నీరు తుడిచి..సత్యవేణి కష్టానికి చలనం.. మంత్రి దుర్గేష్ హామీతో ఆనందం
- దివ్యాంగురాలు సత్యవేణి ఆవేదనకు చలించిన మంత్రి దుర్గేష్..తన నివాసం వద్ద కదులుతున్న కారు దిగి వచ్చి బాధితురాలి చెంతకు చేరి వినతి స్వీ కరణ
- తనను నమ్మి వచ్చిన వారికి న్యాయం చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్



**ప్రజాభూమి ప్రతినిధి – రాజమహేంద్రవరం**

కష్టాల్లో ఉన్న సామాన్యుడికి పాలకుడు అండగా నిలిస్తే ఆ ధైర్యమే కొండంత అండ అవుతుంది. రాజమహేంద్రవరంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ నేడు మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. జననేత కదిలి వస్తే కన్నీటి కష్టానికి కాలం చెల్లుతుందని ధవళేశ్వరానికి చెందిన కోలాటి సత్యవేణి విషయంలో మరోసారి నిరూపితమైంది. తన కష్టాన్ని చెప్పుకోవడానికి వచ్చిన ఒక దివ్యాంగురాలి పట్ల రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ చూపిన మానవత్వం అందరినీ కదిలించింది. వివరాల్లోకి వెళ్తే రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం ధవళేశ్వరం పెన్నేటి వారి వీధికి చెందిన కోలాటి సత్యవేణి (46) అనే దివ్యాంగురాలు 90 శాతం వికలాంగత్వం కలిగి ఉంది. దివ్యాంగుల కోటాలో ప్రస్తుతం వస్తున్న రూ.6,000 పెన్షన్ తన వైద్య ఖర్చులకు, కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల కోటాలో తనకు రావాల్సిన రూ.15,000 పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ తన వృద్ధ తల్లితో కలిసి రాజమహేంద్రవరంలోని మంత్రి దుర్గేష్ నివాసానికి చేరుకుంది. ఎండను సైతం లెక్కచేయక మంత్రి ఇంటి ముందు వేచి ఉన్న సత్యవేణిని చూడగానే మంత్రి కందుల దుర్గేష్ తన కారు దిగి నేరుగా ఆమె వద్దకు వెళ్లారు. మెడికల్ ఆఫీసర్ ధృవీకరించిన పత్రాలను పరిశీలించి, ఆమె దీనస్థితిని అడిగి తెలుసుకున్నారు. గత కొంతకాలంగా అధికారుల చుట్టూ తిరిగినా "ప్రాసెస్‌లో ఉంది" అనే సమాధానమే తప్ప న్యాయం జరగలేదని సత్యవేణి ఆవేదన వ్యక్తం చేసింది. ఏ ఆధారం లేని తనకు దేవుడిలా మీరే న్యాయం చేయాలని వేడుకుంది. దీనిపై తక్షణమే స్పందించిన మంత్రి దుర్గేష్.. తన వ్యక్తిగత సిబ్బందిని పిలిచి ఆమె వివరాలన్నీ సేకరించాలని ఆదేశించారు. త్వరలో మంజూరు చేయబోయే కొత్త పెన్షన్ల జాబితాలో సత్యవేణి పేరును చేర్చి ఆమెకు అందాల్సిన రూ.15,000 పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. "విభిన్న ప్రతిభావంతులు సమాజానికి స్ఫూర్తిప్రదాతలు.. మీ కుటుంబానికి నేను అండగా ఉంటాను" అని ఆయన భరోసా ఇవ్వడంతో సత్యవేణి కళ్లు ఆనందంతో చెమ్మగిల్లాయి. తమ కష్టాన్ని గుర్తించి, ఒక అన్నలా అండగా నిలిచిన మంత్రి దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ సత్యవేణి ఆనందంగా ఇంటికి తిరుగు ప్రయాణమైంది.

ప్రజాభూమి
కాకినాడ, తూర్పుగోదావరి 5
బుధవారం 29, ఏప్రిల్ 2026

# జిల్లాలో కిశోరి వికాసం కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**



ప్రజాభూమి ప్రతినిధి - కాకినాడ

బాలికల సాధికారిత, భద్రత, విద్యా, నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యంగా వివిధ అంశాలపై కిశోరి బాల బాలికలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్.. కిశోరి వికాసంపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయన మాట్లాడుతూ.. కిశోరి వికాసం కార్యక్రమాన్ని ప్రణాళిక ప్రకారం నిర్వహించాలన్నారు. కిశోరి బాల బాలికల సమగ్ర అభివృద్ధి కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కిషోరి వికాసం వేసవి సమావేశాలు కౌమార బాలికలు, కౌమార బాలురకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో గ్రామ మరియు వార్డ్ స్థాయిల్లో వారంలో మంగళవారం శుక్రవారం రెండు రోజులలో నిర్వహించాలన్నారు. మే 01 నుంచి జూన్ 10వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జావుగా నిర్వహించాలన్నారు. సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టి తల్లిదండ్రులు కౌమార బాలబాలికలు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో కిషోరి వికాసం కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యం, పోషణ, వ్యక్తిత్వ వికాసం, విద్యా ప్రాముఖ్యత, లైంగిక, బాల్య వివాహాల నివారణ, బాలల రక్షణ వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించి అవగాహన కార్యక్రమాలు గ్రామ, వార్డు స్థాయిలో 11 సంవత్సరాలు వయస్సు నుండి 18 సంవత్సరాల వయస్సు గల కౌమార బాల బాలికలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. కిషోరి దశలో బాలికలకు సరైన మార్గదర్శకత్వం, ఆరోగ్య పరిరక్షణ, విద్య మరియు నైపుణ్యాల అభివృద్ధి ఎంతో అవసరమని తెలిపారు. ఈ దశలో సమగ్ర అభివృద్ధి సాధిస్తే, భవిష్యత్తులో వారు ఆత్మవిశ్వాసంతో సమాజంలో ముందుకు సాగగలరని పేర్కొన్నారు. అలాగే బాలికల సాధికారితకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆయన సూచించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి కిషోరి బాలికల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశాల ద్వారా కౌమార దశలో ఉన్న బాలబాలికలకు సరైన మార్గదర్శకత్వం అందించడం, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి సహాయపడటం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సీహెచ్ లక్ష్మి, జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట రావు, వివిధ శాఖల అధికారులు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవోలు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్లైన్ సిబ్బంది ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికగా యనమల దివ్య ప్రజా దర్బార్



ప్రజాభూమి ప్రతినిధి - తుని

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వ విప్ యనమల దివ్య ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్లు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా తుని మండలం చామవరం గ్రామంలోని క్యాంప్ కార్యాలయం వద్ద మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి అధ్యక్షతన నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించింది. సీనియర్ నేత యనమల రాజేష్‌తో కలిసి చామవరం విచ్చేసిన ఎమ్మెల్యే యనమల దివ్యకు స్థానిక కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం తహశీల్దార్ ప్రసాదరావు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రతి దరఖాస్తును స్వయంగా పరిశీలించి, అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చాలా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించిన ఎమ్మెల్యే, మిగతా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సుర్ల లోవరాజు, చోడిశెట్టి గణేష్, కరపా అప్పారావు, బొప్పన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం




ప్రజాభూమి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌర గ్రంథాలయ శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర గ్రంథాలయం, కాకినాడలో వేసవి విజ్ఞాన శిబిరాలను మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతి రాజు ఈశ్వరరాజు వర్మ (సాయిబాబు రాజు) అత్యంత ఘనంగా ప్రారంభించడం జరిగినది. ఈ ప్రారంభోత్సవానికి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను ప్రతి విద్యార్థి ఉపయోగించుకునేలా వారి తల్లిదండ్రులు దగ్గరుండి శిక్షణా శిబిరాలకు తీసుకుని రావాలని ప్రస్తుత కాలంలో కేవలం నాలుగు గదులకి పరిమితమైన విద్యను విశాలమైన ప్రాంతంలో ఒత్తిడి లేకుండా పిల్లలకు మానసిక ఆధ్యాత్మికత జోడించి ఏర్పాటుచేసిన ఈ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు వారి జీవితంలో ఒక మంచి నడవడికతో ఎదుగుదలకు ఉపయోగపడుతుందని పిల్లలు సెల్ఫోన్ కు బానిసవ్వకుండా ఉంటారని చైర్మన్ విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేశారు. అలాగే నిష్ణాతులైన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఈ శిబిరాలలో కేవలం ఏమీ ఆశించకుండా రాబోయే తరాలకు మంచి యువతను అందించాలని ముందుకు వచ్చి ఈ శిబిరాలలో విజ్ఞానాన్ని బోధిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య అధికారి ఆనంద్ బాబు, కాకినాడ డివిజనల్ పంచాయతీ అధికారి అన్నామని విశ్రాంత ఉపాధ్యాయులు నోరి బలరామకృష్ణ టీఎస్ లక్ష్మీకుమారి ఉపాధ్యాయులు కేసరి శ్రీనివాస్ ఎం శ్రీరాములు గ ఎం సత్యబాల టి సునీత అలాగే గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీ.సా.జ పాలంకి నాగరాజు, జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి ×/కిషోర్, శ్రావ్య, సాయి వెంకట్రావు, రాజు, నాగేంద్ర కుమార్, ఫణీంద్ర కుమార్, వీర్రాజు, దుర్గాప్రసాద్, అరుణ విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్తపేటలో బీజేపీ మండల శిక్షణా కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట

కొత్తపేట మండల బీజేపీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కళ్యాణమండపంలో శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మండల బీజేపీ అధ్యక్షులు సంపతి కనకేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యనందం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అడబాల సత్యనారాయణ పార్టీ కార్యవిస్తరణపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. బీజేపీ చరిత్రను చట్రతి రాంబాబు వివరించగా, కార్యపద్ధతిపై రామ వర్మ అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై బాబీ మాస్టర్, సోషల్ మీడియా వినియోగంపై చిలకమర్తి కస్తూరి, రాష్ట్ర స్థాయి కార్యక్రమాలపై సలాది వీరబాబు కార్యకర్తలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, బూత్ కమిటీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొలకోటి వెంకటేశ్వరరావు, వానపల్లి పల్లాలమ్మ దేవస్థానం డైరెక్టర్ బల్ల దుర్గాలక్ష్మి రాజు, ఆత్మ కమిటీ డైరెక్టర్ పాలాటి మాధవ స్వామి, రాష్ట్ర యువ మోర్చా నాయకులు పాలూరి జయప్రకాశ్ నారాయణ, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు కోటిపల్లి దామోదర్, ఓబీసీ మోర్చా నాయకులు దొడ్డిపట్ల శ్రీనివాస్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఫోనుగుపాటి శ్రీనివాస్, సిద్ధంశెట్టి గంగారావు, రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు చిట్టూరి రాజేశ్వరి, జిల్లా బీజేపీ కార్యదర్శి మోకా ఆదిలక్ష్మి, సబ్బవరపు సత్యనారాయణ, వలపశెట్టి కిరణ్, ఇళ్ల పల్లంశెట్టి, ఉద్దరాజు ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొప్పాక గ్రామంలో డ్రైనేజీ పనులపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ



ప్రజాభూమి - పెదవేగి

గ్రామాల పారిశుధ్యంపై నిర్లక్ష్యం సహించబోమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులకు హెచ్చరించారు. మంగళవారం పెదవేగి మండలం కొప్పాక గ్రామంలో ఆకస్మికంగా పర్యటించిన ఆయన డ్రైన్లు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడం, మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులను అక్కడికి రప్పించిన ఎమ్మెల్యే దాదాపు మూడు గంటల పాటు క్షేత్రస్థాయిలో ఉండి జేసీబీలతో పూడికతీత పనులు నిర్వహింపజేశారు. డ్రైన్ల మరమ్మత్తులు చేసి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైన్లలో వేయవద్దని విజ్ఞప్తి చేస్తూ, పారిశుధ్యంపై రాజీ పడబోమని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## రైతులు సమక్షంలోనే రీ సర్వే పనులు నిర్వహించాలి

- రైతులకు నోటీసులు జారీ చేసిన తర్వాతే గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రక్రియ చేపట్టాలి
- రైతులకు సరిహద్దు తగాదా లేకుండా జిల్లాలో రీ సర్వే పనులు..
- జిల్లాలో 34 గ్రామాల్లో 5వ దశ రీ సర్వే పనులు..
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి - కాకినాడ

జిల్లాలో జరుగుతున్న 5వ దశ రీ సర్వే పనులు పారదర్శకంగా రైతులకు ఎటువంటి సరిహద్దు తగదాలకు తావు లేకుండా రైతుల సమక్షంలోన రీ సర్వే పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ డివిజన్ తాళ్లరేవు మండలం పాలేకూరు శివారు చినబాపనపల్లి గ్రామంలో జరుగుతున్న 5వ దశ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి రీ సర్వే మొత్తం విస్తీర్ణం, రైతుల నుంచి ఎదురవుతున్న అంశాలు ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రీసర్వే నిర్వహిస్తున్న రైతు కర్రి రామకృష్ణ, రేవు జ్యోతి సత్య, పెమ్మాడి వెంకటరమణలతో మాట్లాడి రీసర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. కాకినాడ జిల్లా 34 గ్రామాల్లో 5వ దశ రీ సర్వే చేపట్టడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా రీ సర్వే పనులు నిర్వహించాలి జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రీ సర్వే గ్రామాల్లో రైతులకు నోటీసులు జారీ చేసిన తర్వాతే గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ పనులు చేపట్టాలన్నారు. ఈకేవైసీ పూర్తి అయిన తర్వాత డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చి, రైతుల తమ భూమి వివరాలు నిర్ధారణ చేసిన తర్వాతే పట్టాదార్ పాస్ పుస్త కం ముద్రణకు పంపించాలన్నారు. కాకినాడ డివిజన్ పరిధిలో తాళ్ళరేవు మండలం పాలేకూరు గ్రామంలో 560 ఎకరాల విస్తీర్ణంలో 5వ దశ రీసర్వే పనులను చేపట్టడం జరిగిందని, ఇప్పటివరకు 287 ఎకరాల్లో రీ సర్వే పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ రీ సర్వే పనులపై రెవెన్యూ, సర్వే అధికారులు ప్రత్యేకదృష్టి పెట్టి క్షుణ్ణంగా సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో ఏడి సర్వే కె.శ్రీనివాసరావు, తాళ్ళరేవు మండలం తహసీల్దార్ పి.త్రినాథరావు, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సూరిబాబు, రీ సర్వే డీటీ కె. వీరబాబు, గ్రామసర్వే అధికారులు పాల్గొన్నారు.

## అసమర్థ పాలనతోనే ఇంధన కొరత : వైసిపి నేత కుంచే రమణారావు విమర్శ



ప్రజాభూమి ప్రతినిధి - అమలాపురం

చంద్రబాబు అసమర్థ పాలనతోనే రాష్ట్రంలో డీజిల్ పెట్రోల్ కొరత ఏర్పడిందని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకుడు కుంచే రమణారావు ధ్వజమెత్తారు. అమలాపురంలో మంగళవారం రమణారావు స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తు న్నాయని డీజిల్, పెట్రోల్ కొరకు కొట్లాడుకునే పరిస్థితులు కనిపిస్తు న్నాయని అన్నారు. బంకుల వద్ద కిలోమీటర్ల కొద్దీ వాహనాలు బార్లు తీరి వినియోగదారులు అవస్థలు పడుతున్నార న్నారు. వ్యవసాయ పనుల సీజన్ కావడంతో డీజిల్ కొరత కారణంగా రైతాంగం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. వినియోగదారులు అల్లాడుతుంటే ప్రభుత్వం మాత్రం ఇంధన కొరత ఎక్కడా లేదని ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పక్క రాష్ట్రాలలో ఇంధన కొరత ఎక్కడా లేదని ఒక్క కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ లో మాత్రమే ఈ దుస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. ఇంధన కొరత సమస్యను గుర్తించి పరిస్థితులను చక్కదిద్ద డంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నాటి నుండి ప్రజలకు క్యూ లైన్ కష్టాలు తప్పడం లేదన్నారు. విత్తనాలు ఎరువులు గ్యాస్ వంటి వాటికోసం రైతులు ప్రజలు క్యూలు కట్టాల్సిన దుస్థితి ఈ రాష్ట్రంలోనే నెలకొందని విమర్శించారు. రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ కొరత పూర్తిగా ప్రభుత్వ చేతగానితనమన్నారు. ఇప్పటికైనా కేంద్రంతో తక్షణమే మాట్లాడి రాష్ట్రంలో డిమాండ్ కు తగ్గట్టుగా డీజిల్, పెట్రోల్ సరఫరాను పునరుద్ధ రించి ప్రజలు ఇబ్బందులు తొలగించాలని లేనిపక్షంలో ప్రజలు మీకు తగిన గుణపాఠం చెబుతారని రమణారావు అన్నారు.

## గురువుల పట్ల వినయం - నేటి యువతకు మార్గదర్శకం



ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట

నేటి వేగవంతమైన జీవితంలో విలువలు, సంప్రదాయాలు కొంతవరకు కనుమరుగవుతున్న తరుణంలో గురువుల పట్ల గౌరవం ఎంత ముఖ్యమో చాటి చెప్పే సంఘటన కొత్తపేటలో చోటుచేసుకుంది. కొత్తపేట నియోజకవర్గానికి నాలుగోసారి శాసనసభ్యుడిగా సేవలందిస్తున్న బండారు సత్యానందరావు, తనకు విద్య నేర్పిన గురువు పట్ల చూపిన వినయం నేటి యువతకు ఆదర్శంగా నిలిచింది. విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు గదుల ప్రారంభోత్స వానికి విచ్చేసిన సందర్భంగా, కళాశాల మాజీ ప్రిన్సిపాల్ కంకటాల సత్యనారాయణని చూసిన వెంటనే ఆయన పాదాలకు నమస్కారం చేసి గురుభక్తిని వ్యక్తపరిచారు. ఈ దృశ్యాన్ని అక్కడున్న విద్యార్థులు, అధ్యాపకులు ఆసక్తిగా వీక్షించారు. గురువు కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి మాత్రమే కాదని, జీవితానికి దిశ చూపే మార్గదర్శని, మన వ్యక్తిత్వ వికాసంలో గురువుల పాత్ర అపారమైనదని, తల్లిదండ్రుల తరువాత గురువులే మన భవిష్యత్తుకు పునాది వేస్తారు. బండారు సత్యానందరావు ఈ వినయపూర్వక చర్య సమాజానికి స్పూర్తిదాయకంగా నిలిచింది. అధికారంలో ఉన్నా, ఉన్నత స్థానంలో ఉన్నా, గురువుల పట్ల వినయం కోల్పోకూడదనే సందేశాన్ని ఆయన ఆచరణలో చూపించారు.

## రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ కు దివ్యాంగుల సమస్యలపై వినతి



ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట

రావులపాలెం ఆర్టీసీడిపోలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ల్యాంప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అడ్వకేసి కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ నేతృత్వంలో డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్. కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ఎం. అచ్చుతాంబలకు ఈ వినతిపత్రం అందజేశారు. దివ్యాంగ శక్తి ఫ్రీ బస్సు పథకం మంచి ఉద్దేశంతో ప్రారంభమైనప్పటికీ, కేటాయించిన సీట్లలో ఇతర ప్రయాణికులు కూర్చోవడం వల్ల దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో ర్యాంపులు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీ స్థాయిలో బస్సు పాస్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. దీనిపై స్పందించిన డిపో మేనేజర్ కుమార్, దివ్యాంగులకు కేటాయించిన సీట్లపై స్టిక్కర్లు ఏర్పాటు చేశామని, త్రాగునీటి సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. అయితే ప్రయాణికుల సహకారం లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. సమస్యపై సిబ్బందికి మళ్లీ సూచనలు ఇస్తామని హామీ ఇచ్చారు. అసిస్టెంట్ మేనేజర్ అచ్చుతాంబ మాట్లాడుతూ, గ్రామాల్లో సమావేశాలు నిర్వహించినప్పుడు సమాచారం అందిస్తే సిబ్బందిని పంపించి బస్సు పాసులు జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ గురవయ్య, ఏ.డి.సి.టి చినవీరభద్రరావు, సి.బి.ఆర్ వర్కర్ మహిమారావు, కమిటీ సభ్యులు సూర్యరావు, ధనలక్ష్మి, రామకృష్ణ, భాను, భాస్కర్, నాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అదనపు తరగతి గదుల ప్రారంభం



ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట

ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. మంగళవారం విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.14.44 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో పాఠశాలలు, కళాశాలలను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. ఉన్నత విద్య పూర్తయ్యే సరికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పెట్టుబడులు ఆకర్షిస్తున్నామన్నారు. విద్యార్థులతో మాట్లాడిన ఎమ్మెల్యే, వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ల అవసరం వ్యక్తం చేయడంతో రూ.2 లక్షలతో వాటిని కొనుగోలు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

## మేడేను జయప్రదం చేయండి




ప్రజాభూమి - కుకునూరు

మేడే వారోత్సవాలను ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని జిల్లా సిఐటియు కార్యదర్శి పిలుపునిచ్చారు. మంగళవారం మేడే జయప్రదం కోరుతూ జిసిసి కార్యాలయం వద్ద మేడే పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి స్ఫూర్తితో కార్మికుల ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమల్లోకి తీసుకువస్తున్న 12 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకొని ఎనిమిది గంటల పని విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసే కుట్రలను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం వారు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మండలంలో అన్ని కార్మిక ప్రాంతాల్లో మేడే జెండా ఎగరవేసి మేడే విజయవంతం చేయాలని నాయకులు పంపించారు .ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కడారి తిరుపతయ్య, సురేష్ ,రమేష్, వెంకట్రావు, సాయిరాం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## ఇంధనంపై అపోహలు వద్దు - తహసీల్దార్ స్పష్టం

ప్రజాభూమి ప్రతినిధి - ఆగిరిపల్లి

పెట్రోల్, డీజిల్‌ను అనవసరంగా నిల్వలు చేసుకోవద్దని, అందరికీ సరిపడా సరఫరా ఉందని ఆగిరిపల్లి మండల తహసీల్దార్ పిఎన్‌వి ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అడవి నెక్కలం గ్రామంలోని పెట్రోల్ బంకును తనిఖీ చేశారు . ఈ కార్యక్రమంలో ఆర్ఐ యూనస్, జూనియర్ అసిస్టెంట్ ఉమా శంకర్, మరియు పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని ఏడు పెట్రోల్ బంకుల్లో ఆరు బంకుల్లో ఇంధనం సమృద్ధిగా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. పెట్రోల్ బంకులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా అవసరమైనంత మేరకే ఇంధనం వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజాభూమి

## అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

బుధవారం 29 ఏప్రిల్ 2026


## పెట్రోల్, డీజిల్ వెంటనే సరఫరా చేయాలి..

**అసమర్థ ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ పెట్రోల్ బంక్ వద్ద జరిగిన నిరసన.. పాల్గొన్న మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త డా. సాకే శైలజానాథ్.**




ప్రజాభూమి, పుట్లూరు.

పెట్రోల్, డీజిల్ కొరతతో రాష్ట్రంలో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా కూటమి ప్రభుత్వం మాటలతో కాలయాపన చేస్తోందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త డా. సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు.వైస్సార్సీపీ పార్టీ ఆదేశాల మేరకు అసమర్థ కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ పెట్రోల్ బంక్ వద్ద వైస్సార్సీపీ శ్రేణులతో కలసి ఆయన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.మాజీ మంత్రి డా. శైలజానాథ్ మాట్లాడుతూ.. ఇంధనం అందుబాటులో లేకపోవడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంధన సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంధన కొరత కారణంగా రైతులు, వాహనదారులు, సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ లేక ప్రజలు పెట్రోల్ బంకుల వద్ద క్యూలైన్లలో నిలబడి ఇబ్బంది పడుతున్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు కనీసం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాపునాడు హిందూపురం పట్టణ అధ్యక్షునిగా బలిజ విశ్వనాథ్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

కాపునాడు హిందూపురం పట్టణ అధ్యక్షునిగా బలిజ విశ్వనాథ్ ను నియమిస్తూ కాపునాడు జిల్లా అధ్యక్షులు ఇటికింటి మహేష్, హిందూపురం నియోజకవర్గం అధ్యక్షులు మహేష్ కుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా బలిజ విశ్వనాథ్ మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో బలిజలకు అధిక సీట్లకు కృషి చేస్తానని చెప్పారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి ప్రభుత్వం నిర్వహించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పేద విద్యార్థుల చదువు కోసం ఆదుకుంటామని,బలిజల అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. నా ఎన్నికకు సహకరించిన హిందూపురం బలిజ కులస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నగరంలోని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కమిషనర్ తో కలిసి ఆకస్మిక పర్యటన



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

కమిషనర్ జశ్వంత్ రావుతో కలిసి రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ పరిసర ప్రాంతాల్లో పర్యటన తెల్లవారుజామున 5:30 నుంచి పర్యటిస్తూ సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే నూతనంగా వేసిన రోడ్లు పరిశీలన పారిశుద్ధ్యం ఇతర మౌలిక వసతుల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నా ఎమ్మెల్యే రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ ను పరిశీలించిన ఎమ్మెల్యే మార్నింగ్ వాకర్స్, మహిళలతో మాట్లాడిన ఎమ్మెల్యే పార్కులో సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే నగరంలోని 28 పార్కుల్లో సమస్యలను స్పెషల్ డ్రైవ్ కింద పరిష్కరిస్తాం. ఎమ్మెల్యే దగ్గుపాటి వేసవి దృష్ట్యా పిల్లలు ఎక్కువగా పార్కులకు వస్తున్నారు. ప్రతి పార్కులో తాగునీరు, టాయిలెట్స్ ఉండేలా చూస్తున్నాం. జిమ్ పరికరాలన్నీ సక్రమంగా పనిచేసేలా చూస్తున్నాం. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పార్కులు ఉంటాయి. ఎమ్మెల్యే గతం కంటే నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడిందన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రజా సమస్యల పరిష్కారానికి ఆకస్మిక పర్యటనలు కొనసాగుతాయన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.



## పురపాలక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చండి

### -డిఈఓకు ఎపిఎంటిఎఫ్ వినతి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పురపాలక పాఠశాలల్లో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను వచ్చే సంవత్సరానికైనా తీర్చాలని మున్సిపల్ ఉపాధ్యాయ సంఘం నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణప్పకు విన్నవించారు. ఈ సందర్భంగా సంబంధిత ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ, పేద, బలహీన విద్యార్థులు చదువుకునే మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత విద్యా సంవత్సరం ఉపాధ్యాయులు లేకుండానే గడిచిపోయిందని పేర్కొన్నారు. మునిసిపల్ పరిధిలో ఉన్నతీకరించిన ఉన్నత పాఠశాలల్లో భాషా పండితుల కొరత , ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉందని తెలిపారు. త్వరలో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సిద్దగిరి శ్రీనివాస్, రామ్ మోహన్, పెన్నోబులం, బాలకృష్ణ, కృష్ణ మోహన్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## 1 నుండి ఉచిత వేసవి బడులు

### -బ్రోచర్ల విడుదల



ప్రజాభూమి, హిందూపురం టౌన్

బడి బయట ఉన్న పిల్లలకు ఉచిత విద్యను అందించాలన్న సంకల్పంతో గత 27 సంవత్సరాలుగా దాతల సహకారంతో మార్గదర్శి విద్యానికేతన్ నిర్వాహకులు మాళప్ప, దంపతులు ఉచిత బడులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా రాజ్యలక్ష్మీ నిర్వాహకులు మోహన్ కుమార్, నాగరత్న దంపతుల ఆర్థిక సహకారంతో మే 1వ తేదీ నుండి నెల రోజులపాటు ఉచిత వేసవి బడులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఇందుకు సంబంధించిన రోచర్లను స్థానిక ప్రెస్ క్లబ్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాళప్ప మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా ప్రతి ఏటా వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉచిత విద్య అందించడం జరుగుతుందన్నారు. దాతల సహకారంతో ఈ వేసవి బడులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు విద్యతోపాటు ఉచిత భోజన సౌకర్యం, వసతి, పుస్తకాల పంపిణీ జరుగుతుందన్నారు. అదేవిధంగా యోగా, క్రీడలు, చిత్రలేఖనం తదితర అంశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తాము నిర్వహిస్తున్న ఉచిత వేసవి బడులకు గత 28 సంవత్సరాలుగా సహకారం అందిస్తున్న దాతలకు మాళప్ప దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. అధిక సంఖ్యలో విద్యార్థులు వేసవి బడులకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో గూగుల్ డేటా సెంటర్ ప్రారంభించడం ఒక చారిత్రాత్మక ఘట్టం..

**- : రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్ సంస్థను తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఎంతగానో కృషి చేశారు.. ఇందుకు సీఎంకి, మంత్రికి అభినందనలు..**

**- : తాగునీటి, విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి ఆర్.డబ్ల్యు.ఎస్ విద్యుత్, పంచాయతీ రాజ్ మూడు శాఖలతో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు..**

**- : గ్రామస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లను బాధ్యులను చేస్తూ 'ఫస్ట్ రెస్పాన్స్' వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నాం..**

**- వేసవిలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా పక్కా ప్రణాళికలు అమలుకు చర్యలు**

**- : ప్రెస్ మీట్ లో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, మంత్రి పయ్యావుల కేశవ్..**



ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం నగరంలోని ఆర్.అండ్.బి అతిథి గృహంలో మంగళవారం మంత్రి పయ్యావుల కేశవ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గూగుల్ డేటా సెంటర్ ప్రారంభించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని, దీనివల్ల భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్ సంస్థను తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేష్ చేసిన కృషిని మంత్రి అభినందించారు. ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్ సిటీ నిర్మించడం ద్వారా ఐటీ రంగంలో తెలుగు జాతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ మరియు డేటా సెంటర్ల ద్వారా అదే విధమైన మార్పు రాబోతుందన్నారు. రాష్ట్రంలో క్వాంటం టెక్నాలజీ మరియు డేటా సెంటర్ల ఏర్పాటుతో రాబోయే 20 ఏళ్లలో ఎక్కడ ఉద్యోగ అవకాశాలకు ప్లాట్ఫారంగా మారుతుందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అమరరాజా వంటి పరిశ్రమలు రాష్ట్రం వదిలి వెళ్ళిపోయాయని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రెడిట్ కోసం కాకుండా అభివృద్ధి కోసం పనిచేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వంలో వస్తున్న ప్రాజెక్టుల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనని, ఎకో సిస్టం క్రియేట్ చేస్తామన్నారు. అన్ని విషయాల్లోనూ తమ లక్ష్యాన్ని సాధించి తీరుతామన్నారు. వేసవి చాలా తీవ్రంగా ఉందని, వేసవిలో త్రాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం, శ్రీ సత్యసాయి వాటర్ బోర్డు స్కీమ్, సిపిడబ్ల్యూ స్కీమ్స్, గ్రామస్థాయిలో పథకాల గురించి అనలైజ్ చేసామన్నారు. జిల్లాలో శ్రీ సత్యసాయి తాగునీటి పథకానికి సంబంధించి విద్యుత్ శాఖకు దాదాపు రూ. 310 కోట్ల బకాయిలు ఉన్నాయని, అలాగే ఉద్యోగుల జీతాల కోసం మరో రూ. 30 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. పిఏబిఆర్ వద్ద పంపింగ్ కేంద్రాలలో మోటార్ల నిర్వహణ అధ్వాన్నంగాఉందని, స్టాండ్బై మోటార్లు కూడా అందుబాటులో లేకపోవడం వల్ల నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, పీఏబీఆర్ డ్యామ్ వద్ద మోటార్ల మరమ్మతుల కోసం తక్షణమే రూ. 3.5 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. తాగునీటి, విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి మూడు శాఖలతో (తాగునీటి, విద్యుత్, పంచాయతీ రాజ్) కలిపి ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో పైపులు పగిలినా లేదా విద్యుత్ సమస్యలు తలెత్తినా గంట వ్యవధిలోనే కంట్రోల్ రూమ్కు సమాచారం అందించేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లను బాధ్యులను చేస్తూ 'ఫస్ట్ రెస్పాన్స్' వ్యవస్థను తీసుకువచ్చామన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, పంపింగ్ సమయాన్ని పెంచాలని అధికారులను ఆదేశించామన్నారు. ఎక్కడైనా 18 గంటల పంపింగ్ ఉంటే దానిని 20 గంటలకు, 20 గంటలు ఉన్న చోట 22 గంటలకు పెంచాలని సూచించామన్నారు. సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల్లో ఎలక్ట్రికల్, పైపులైన్ల మరమ్మతుల కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని, స్టాండ్బై మోటార్లను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. ఎల్ నినో ప్రభావంతో ఎండలు పెరిగే అవకాశం ఉన్నందున, జూన్ వరకు అవసరమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని తెలిపారు. కంట్రోల్ రూమ్ నంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. గత ప్రభుత్వ కాలం నుండి పేరుకుపోయిన సుమారు రూ. 300 - 400 కోట్ల బకాయిల వల్ల వ్యవస్థ బలహీనపడిందని, ముఖ్యంగా కార్మికుల జీతాలు మరియు కనీస నిర్వహణ ఖర్చుల కోసం సుమారు రూ. 40 కోట్లు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ రాజ్, సచివాలయ వ్యవస్థ మరియు విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూగర్భ జలాలు తగ్గిపోతున్న తరుణంలో, రిజర్వాయర్లలో నీటి నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, భవిష్యత్తు అవసరాల కోసం 'సబ్ సర్ఫేస్ చెక్ డ్యామ్'ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు.

## జిల్లాలో పెట్రోల్, డీజల్ కు ఎలాంటి ఇబ్బంది లేదు.. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం నగరంలోని సంగమేష్ సర్కిల్ లో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ను, సప్తగిరి సర్కిల్ నందు ఇండియన్ ఆయిల్ మేడా పెట్రోల్ బంక్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్..**



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం నగరంలోని సంగమేష్ సర్కిల్ లో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ను, సప్తగిరి సర్కిల్ నందు ఇండియన్ ఆయిల్ మేడా పెట్రోల్ బంక్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ.. పెట్రోల్ దొరుకుతుందా అంటూ ఆరా తీయగా, నిన్నటి నుండి ఎలాంటి ఇబ్బంది లేకుండా దొరుకుతోంది అని వినియోగదారులు తెలిపారు. అవసరం మేరకు మాత్రమే పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయాలని, నిల్వ చేసుకునేలా చేయరాదని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో పెట్రోల్, డీజల్ కు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. సోమవారం కూడా స్టాక్ వచ్చిందని, 24 గంటల నుంచి అదనంగా జిల్లాలో పెట్రోల్, డీజల్ స్టాక్ వస్తోందని, ఈరోజు 42 లోడ్లు సాయంత్రంలోపు వచ్చేస్తాయని, ఎక్కడా పెద్దగా సమస్య లేదని, ఎవరూ ఆందోళన చెందరాదన్నారు. ఈ సందర్భంగా స్టాక్ ఆన్లైన్ వివరాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి, ఇండెంట్ మేరకు డీజిల్, పెట్రోల్ వస్తుందా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## పేద మహిళలకు చీరలు పంపిణీ




ప్రజాభూమి, హిందూపురం టౌన్

వైకాపా హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణు రెడ్డి జన్మదిన సందర్భంగా మంగళవారం 7వ వార్డులో బేగ్ సోదరులు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వార్డులో కేక్ కట్ చేసి పేద కుటుంబాలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో పాటు బేగ్ సోదరులు దీపికా వేణురెడ్డి సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, అలాగే రాబోయే కాలంలో హిందూపురం ఎమ్మెల్యేగా గెలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు ఇంచార్జ్ అయూబ్ బేగ్, పట్టణ కమిటీ సభ్యులు షేక్ బాబాజాన్ తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుడి హత్యపై నిరసన

### -కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్




ప్రజాభూమి, హిందూపురం టౌన్

చిత్తూరు జిల్లా వి.కొత్తకోటలో పాత్రికేయుడు జగన్మోహన్ రెడ్డి హత్యపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమ య్యాయి. ఇందులో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురంలో పాత్రికేయులు స్థానిక ప్రెస్ క్లబ్ నుండి ప్రధాన రహదారి గుండా తహసిల్దార్ కార్యాలయం వరకు జర్నలిస్టు భారీ నిరసన ర్యాలీ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. హత్య కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించాలని డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్షలు విధించాలన్నారు. అవినీతిని బయట పెడితే వారిని దారుణ హత్య చేయడం ఎంతవరకు సమంజసం ప్రశ్నించారు. జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ ప్రతినిధులతో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

## బకాయి కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలి

### -సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రాము



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలోని పౌరసరఫరాల శాఖ గోడౌన్లో పనిచేస్తున్న హమాలీలకు బకాయి ఉన్న కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి రాము డిమాండ్ చేశారు. గత సంవత్సరం తో పాటు మార్చి నెలలో పెండింగ్ లో ఉన్న కూలి డబ్బులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సివిల్ సప్లై హమాలి యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం పౌరసరఫరాల శాఖ స్టాక్ పాయింట్ వద్ద నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు సిఐటియూ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా రాము, సివిల్ సప్లై హమాలీ యూనియన్ కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ,మండుటెండల్లో కష్టపడి లోడింగ్, అన్ లోడింగ్ పనులు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర కూలి డబ్బులు సైతం సక్రమంగా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం రూ. 60, 465 కూలి డబ్బులు బకాయి ఉందన్నారు. సంవత్సర కాలంగా ఆ డబ్బులను మంజూరు చేయాలని అధికారులను కోరుతున్నప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదన్నారు. మార్చి నెలలో లోడింగ్ చేసిన వారికి పూర్తి బిల్లు ఇచ్చారని, అన్ లోడింగ్ కు సంబంధించి రూ. 1,72,902 ఇవ్వాల్సి ఉంటే కేవలం రూ. 34 వేలు మాత్రమే హమాలీల ఖాతాలో జమ చేశారన్నారు. స్థానికంగా ఉన్న పౌరసరఫరాల శాఖ స్టాక్ పాయింట్ అధికారికి తమ సమస్యను పరిష్కరించాలని విన్నవిస్తున్నప్పటికీ ఏమాత్రం చొరవ చూపడం లేదన్నారు. తమ కూలీ డబ్బులను వెంటనే మంజూరు చేయకపోతే పనులు ఆపి స్టాక్ పాయింట్ ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశ్వర్థ, నారాయణ, గణేష్ తో పాటు హమాలీలు పాల్గొన్నారు.

## అంగన్వాడి ఆయా నియామకంలో అక్రమాలు

### -ఎమ్మెల్యే జోక్యం చేసుకుని న్యాయం చేయాలి




ప్రజాభూమి, హిందూపురం టౌన్

అంగన్వాడి ఆయా నియమాకంలో అక్రమాలు జరిగాయని చిలమత్తూరు మండలం శెట్టిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అర్హతలను ఏ మాత్రం పట్టించుకోకుండా తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థికి పోస్టు ఇచ్చారని, ఈ విషయంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం చిలమత్తూరు మండలం బి.శెట్టిపల్లి గ్రామపంచాయతీ ఎస్సీ కాలనీలో అంగన్వాడి ఆయా పోస్టు నియామకంలో అక్రమాలు జరిగాయని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు స్థానిక ప్రెస్క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించి జరిగిన అన్యాయంపై వివారించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం ఇటీవల ఎస్సీ కాలనీలోని అంగన్వాడి కేంద్రానికి ఆయా పోస్టు భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టుకు ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా మెరిట్ ఆధారంగా ఎంపిక జరగాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా తక్కువ మార్కులు సాధించిన అభ్యర్థిని ఎంపిక చేశారని ఆరోపించారు. ఎంపికైన సి. అనూష పదవ తరగతిలో తక్కువ మార్కులు సాధించారని, స్థానిక భాష తెలుగు పట్ల సరైన పట్టు లేదని, ఆమె మాతృభాష కన్నడ అని గ్రామస్తులు పేర్కొన్నారు. పిల్లలతో నిత్యం మమేకమై ఉండాల్సిన అంగన్వాడి కేంద్రంలో స్థానిక భాషపై పట్టు కలిగిన అభ్యర్థినే నియమించాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. మండలంలో కొంతమంది స్వార్థ రాజకీయ నాయకులు స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం అందకుండా లోపాయికారి వ్యవహారం నడిపి తమ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి నిజమైన అర్హత కలిగిన మెరిట్ అభ్యర్థికి ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా అంగన్వాడి నియామకాల్లో పారదర్శకత పాటించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనితమ్మ, రత్నమ్మ, లలితమ్మ, గంగప్ప, నారాయణప్ప, మంగమ్మ, అలివేలమ్మ, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజల్ కొరతల సమస్యకు బాధ్యత వహించాల్సింది కూటమి ప్రభుత్వమే

### డీజిల్ కొరతతో అస్తవ్యస్తమైన వ్యవసాయ రంగం -వైకాపా నాయకుల డిమాండ్

### డీజిల్,పెట్రోలు కొరత లేకుండా వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

ప్రజాభూమి,పులివెందుల



ఇతర రాష్ట్రాలలో ఎక్కడ చూసినా పెట్రోల్ డీజిల్ పుష్కలంగా దొరుకుతూ ఉంటే కేవలం ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే డీజిల్ పెట్రోల్ కొరత ఎందుకు వచ్చిందని మున్సిపల్ మాజీ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, మాజీ చైర్మన్ రసూల్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, దేరంగుల చంద్రమౌళి లు అన్నారు. మంగళ వారం పట్టణంలోని పాత ఎమ్మెల్యే కార్యాలయం వద్ద వారి విలేకరులతో మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వం పెట్రోల్, డీజల్ కొరత లేదని చెబుతు న్నా, మరోవైపు ఎక్కడ చూసినా పెట్రోల్, డీజల్ బంకుల్లో అయిపోయిందని చెప్తున్నారని వారన్నా రు. డీజిల్ పెట్రోల్ కోసం మహిళలతో సహా క్యూ లైన్ లో నిలబడాల్సిన పరిస్థితి నెలకొనిందన్నారు. అభివృద్ధి మాట దేవుడెరుగు కానీ ఈ రాష్ట్రం ఎక్కడ పోతుందని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజు కచ్చితంగా దగ్గరలో ఉందని వారన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వంలో నాయకులు వారి స్వార్థం కోసం సంపాదనలో మునిగిపోయారన్నారు. ప్రజల మేలుకో సంఘాన్ని, రాష్ట్ర అభివృద్ధి కోసం గానీ కృషిచేసిన దాఖలాలే లేవన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం కుదేలు అయిపోయిందన్నారు.రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని, మంత్రి నాదెండ్ల మనోహర్ గాడ నిద్రలో ఉన్నారని వారన్నారు. చంద్రబాబు నాయుడు దీనిపై దృష్టి పెట్టకుండా స్వార్థం అతని ఆస్తులు పెంచుకునేందుకే ప్రయత్నం చేస్తున్నారే కానీ రాష్ట్ర అభివృద్ధి కోసం ఆలోచించి న దాఖలాలే లేవన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా జీవనం స్తంభించి పోయిందని వారు తీవ్రంగా మండిపడ్డారు. సరకు రవాణా నిలిచి పోయిందని, వ్యవసాయ రంగానికి కావాల్సిన డీజల్ లభించక పోవడంతో రైతులు చాలా ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. ప్రస్తుతం నెల కొన్న పెట్రోల్, డీజల్ కొరత లేకుండా చూడాలని వారు ప్రభుత్వాన్ని వైకాపా పార్టీ తరఫునడిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, బ్యాటరీల ప్రసాద్, నగిరిగుట్ట నాగరాజు, అంజనప్ప, కనక , రాయుడు, దాసరి చంద్రమౌళి, దాసరి ఈశ్వరయ్య, కొమెర నాగరాజు,ఫైర్ రామకృష్ణ, చెన్నూరు కార్తీక్, రవికుమార్, శ్రీరాములు, కలందర్, ఎల్లారెడ్డి, పెద్ద వీరయ్య, తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# ప్రజాభూమి

వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7

బుధవారం 29 ఏప్రిల్ 2026


## గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి రేపు నెల 6 వ తేదీ వరకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి తెలిపారు. మంగళవారం సమ్మర్ క్యాంపులో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠన, చిత్రలేఖనం నేర్పించా రు. ప్రతిరోజు గ్రంథాలయానికి హాజరై గ్రంథాలయం లో ఉన్న విలువైన పుస్తకాలను పఠించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమం లో రిసోర్స్ పర్సన్,కానిస్టేబుల్ అశోక్,లైబ్రరీ హెల్పర్ లక్ష్మీ నరసమ్మ,, పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపీలో ఇంధన సంక్షోభాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలి

**కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించిన ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి**

ప్రజాభూమి,పులివెందుల



ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకొని ఏపీలో ఇంధన సంక్షోభాన్ని నివారించేం దుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా డీజిల్, పెట్రోల్ సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని పెట్రోలియం, సహజ వాయువుల కేంద్ర మంత్రిత్వ శాఖ సెక్రటరీ డాక్టర్ నీరజ్ మిట్టల్‌ని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్రోల్ పంప్ యజమానులు కృత్రిమంగా కొరత సృష్టిస్తు న్నార ని,ఈ కొరత వల్ల సామాన్యులు, రైతులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన కు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ లో వ్యవసాయదారులు,వ్యాపారస్తులు, సామాన్య ప్రజలు పెట్రోల్,డీజిల్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారు. అలాగే వాణిజ్య సిలిండర్ల ధరలు పెరగడంతో కొన్ని చమురు మార్కెటింగ్ కంపెనీలు సరఫరానుతగ్గించ వచ్చని దీని వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటార న్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, రాష్ట్రంలో ఇంధన సరఫరాను పునరుద్ధరించాలని ఆయన కోరారు.

## దేవస్థానం అభివృద్ధి పనులపై రీజినల్ జాయింట్ కమిషనర్‌కు వినతి

**– బకాయిల వసూలు, సిబ్బంది నియామకాలు, ఉత్సవాల అనుమతులపై విజ్ఞప్తి**

ప్రజాభూమి, వేంపల్లె



దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎస్.ఎస్. చంద్రశేఖర్ ఆజాద్‌ని మంగళవారం తిరుపతిలోని వారి కార్యాలయంలో శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ప్రతినిధి బృందం కలసి దేవస్థానంలో చేపట్టవలసిన వివిధ అభివృద్ధి పనులపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థానం షాపింగ్ గదుల లైసెన్స్ దారుల వద్ద పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే వసూలు చేయాలని, చెల్లింపులు చేయని వారికి నోటీసులు జారీ చేసి అవసరమైతే ఖాళీ చేయించి తిరిగి టెండర్లు పిలవాలని రీజినల్ జాయింట్ కమిషనర్ ఆదేశించారు. అదేవిధంగా దేవస్థానంలో పరిచారకులు, భజంత్రీలు, వాచ్మెన్ సిబ్బంది కొరత ఉన్న నేపథ్యంలో తగిన సిబ్బందిని నియమించుకునేందుకు అనుమతులు మంజూరు చేయాలని దేవస్థానం తరఫున అభ్యర్థించారు. ఇంకా, శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి అనుబంధ ఆలయం శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలను 10.05.2026 నుండి 12.05.2026 వరకు మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ శ్రీ పి.వి. రమణ, దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. సుభాష్, పాలకమండలి సభ్యులు సునీల్, ముఖ్య అర్చకులు హరిప్రవీణ్ హాజరయ్యారు.

## ఇంధన సరఫరా పై ఎవరు ఆందోళన చెందవద్దు

**-కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది**

**-సమస్యల నుండి ప్రజలను విముక్తుల్ని చేయడానికే ప్రజాదర్బార్**

**-సమస్యలపరిష్కారానికి సత్వర చర్యలు బీటెక్ రవి**

ప్రజాభూమి, పులివెందుల



పెట్రోల్ డీజిల్ కొరత సమస్యపై ఎవరు ఆందోళన చెందవద్దని, కూటమి ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని, వైకాపా నాయకులు సమస్యలను సృష్టిస్తు న్నారని , ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని పులివెందుల టిడిపి నియోజక వర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వ వైఫల్యా లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యల నుండి విముక్తుల్ని చేయడానికే ప్రజాదర్బార్ ను నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ముఖ్యమం త్రి నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,మంత్రి నారా లోకేష్ ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన అన్నారు. పలు సమస్యలపై టీడీపీ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. మరి ఇచ్చిన అర్జీలను తీసుకొని వారి సమస్యల పరిష్కారానికి అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, టి ఎన్ టి యు సి అధికార ప్రతినిధి నల్లగారి భాస్కర్ రెడ్డి ,కాశీం వలీ , టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్యకు నిరసనగా సిద్ధవటంలో వినతిపత్రం



ప్రజాభూమి, సిద్ధవటం: చిత్తూరు జిల్లా వి.కోట మండల ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ సిద్ధవటం మండల పాత్రికేయులు మంగళవారం డిప్యూటీ తాసిల్దార్ మాధవిలతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలేకరుల రక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, హంతకులను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లను డిమాండ్ చేశారు. పాత్రికేయులపై దాడులు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనకు రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, జనసేన నాయకులు చిన్న వెంకటయ్య , మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాత్రికేయులు పాల్గొన్నారు.

## విలేఖరి జగన్ మోహన్ రెడ్డి హత్యాకాండపై చలపాటి చంద్ర తీవ్ర దిగ్భ్రాంతి

### నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్!



ప్రజాభూమి, సిద్దవటం: చిత్తూరు జిల్లా వి.కోట మండల ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్ మోహన్ రెడ్డిపై జరిగిన కిరాతక దాడిని రాజంపేట పార్లమెంటు వాణిజ్య అధికార ప్రతినిధి చలపాటి చంద్ర తీవ్రంగా ఖండించారు. మంగళవారం సిద్దవటం మండలంలోని మాధవరం-1 గ్రామంలో ఉన్న తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో దుండగులు మారణాయుధాలతో దాడి చేసి విలేఖరిని దారుణంగా హత్య చేయడం అమానుషమని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న విలేఖరులకే రక్షణ లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హత్యకు బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి వారి వెనుక ఎంతటి వారు వున్నా చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యమే ప్రజల ఆరోగ్యం

ప్రజాభూమి,పులివెందుల



పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యమే ప్రజల ఆరోగ్యం అని మునిసిపల్ కమీషనర్ మునికుమార్ పేర్కొన్నారు.ప్రపంచ కార్మికుల భద్రత, ఆరోగ్య దినోత్సవం (ఏప్రిల్ 28) సందర్భంగా పులివెందుల పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించా రు. ఈ కార్యక్రమాన్ని పురపాలక సంఘం కమీషనర్ మునికుమార్, ఐసిటీసి కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు తమ పనిలో ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, మరియు వాటిని నివారించే మార్గాలపై ఆయన వివరించారు. కార్మికులకు వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, శుభ్రత, ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను తెలియజే శారు. ముఖ్యంగా వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను విశదీకరించారు. అలాగే అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమీషనర్ మునికుమార్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు మన సమాజానికి అండగా నిలిచే ముఖ్యమైన సిబ్బంది. వారి ఆరోగ్యం, భద్రతకు పురపాలక సంఘం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ప్రతి 6 నెలలకు పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి హెల్త్ ప్రొఫైల్ ను రికార్డు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక మేనేజర్ సతీష్ కమలాకర్,స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పర్యావరణ ఁ పారిశుద్ధ్య కార్యదర్శులు మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## వైయస్ భాస్కర్ రెడ్డికి న్యాయస్థానం ఫ్రీ బెయిల్ మంజూరు

### ఆనందోత్సాహాలలో వైకాపా నాయకులు

ప్రజాభూమి,పులివెందుల



వైకాపా పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ వైయస్ భాస్కర్ రెడ్డి కి న్యాయస్థానం ఫ్రీ బెయిల్ మంజూరు చేయడంతో పులివెందుల పట్టణంలోని వైకాపా నాయకులు ఆనందోత్సాహాలతో సంబరా లు చేసుకున్నారు . ఈ సందర్భంగా మాజీ చైర్మన్ రసూల్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో స్వీట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ,పట్టణ ఉపాధ్యక్షు డు పార్నపల్లె కిషోర్ లు హాజరై స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందని వారు అన్నారు. చేయని తప్పుకు శిక్ష విధించాలని చూస్తే భగవంతు డు ఆయనను కాపాడడం జరిగిందన్నారు. ఆయన మీద కూటమి నాయకులు లేనిపోని ఆరోపణలు గతంలో చేయడం జరిగిందన్నారు. కానీ ఈరోజు న్యాయం గెలిచిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో దేరంగుల చంద్రమౌళి, మాజీ కోఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, కనక, దాసరి ఈశ్వరయ్య, సోపాల వీరా, చెన్నూరు కార్తీక్, సంపత్, తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పత్రికా విలేఖరి హత్యను తీవ్రంగా ఖండించిన టీడీపీ నాయకులు



ప్రజాభూమి, సిద్దవటం: ఆంధ్రజ్యోతి విలేఖరిపై జరిగిన దారుణ హత్యను రాజంపేట పార్లమెంట్ టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య మరియు ఇతర ముఖ్య నేతలు తీవ్రంగా ఖండించారు. మంగళవారం భాకరాపేట లోని ఆయన నివాసంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన విలేఖరులపై ఇలాంటి దాడులు జరగడం హేయమైన చర్య అని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా మాజీ సింగల్ విండో అధ్యక్షులు సుధా మురళి, రాజంపేట నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి కడితం రామమోహన్ నాయుడు మాట్లాడుతూ.. నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం టీడీపీ నాయకులు పుత్తా శివానంద, మండల తెలుగు యువత అధ్యక్షులు పుత్తా సుధీర్ రాయల్ తదితరులు పాల్గొని, మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## చిత్తూరు జిల్లాలోని వి.కోటలో విలేఖరి దారుణ హత్య ఖండిస్తున్నా

**-ఈ హత్య వెనుక ఎంతవారు ఉన్నా ఉపేక్షించ కూడదు**

**-హత్యకు పాల్పడిన దుండగులను నడిరోడ్డుపై ఎన్ కౌంటర్ చేయాలి**

**-దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్**

ప్రజాభూమి,పులివెందుల



చిత్తూరు జిల్లా వి.కోటలో ఆంధ్రజ్యోతి విలేఖరిగా పనిచేస్తున్న జగన్మోహన్ రెడ్డి ఉదయాన్నే వాకింగ్ వెళ్తే ఆయనను మారణాయుధాలతో నరికి చంపడం దారుణమని, విలేకరిని నరికి చంపిన వ్యక్తిని పోలీసులు ఎన్కౌంటర్ చేయాలని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజల కోసం పాటుపడుతూ ప్రభుత్వం ప్రజల మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులను హత్య చేయడం దారుణం అన్నారు. వాస్తవాలను వెలుగులోకి తేవడం ప్రజల పక్షాన నిలబడడం, రాత్రనక పగలనక, రౌడీలు దేశద్రోహులు స్మగ్లర్లు, వారి చేసే విధ్వంసాలను, ఎండగడుతూ ఎప్పటిక ప్పుడు ప్రభుత్వాలకు అందజేస్తూ,రహస్యంగా వారి కదలికలపై నిశిత అన్వేషణ చేస్తూ ఎంతోమంది ప్రాణాలను అర్పించారు అన్నారు. అయినా బెదిరింపులకు బెదరక గొంతుపై కత్తి పెట్టినా కూడా అదరక, బెదరక ధైర్యంగా పోరాడే ఏకైక వ్యక్తి జర్నలిస్ట్ అన్నారు. హత్యచేసిన వారిని వెంటనే పోలీసులు అరెస్టు చేసి ఎన్కౌంటర్ చేయాలని ఆయన అన్నారు. జర్నలిస్ట్ కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా 50 లక్షలు ఇస్తూ వాళ్ళ కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు.

## రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు వరప్రసాద్ ను సన్మానించిన దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు

ప్రజాభూమి,పులివెందుల



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బిసి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమితులైన మాజీ మునిసి పల్ చైర్మెన్ వల్లెపు వరప్రసాద్ ను దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ ఆయనను దుశ్శాలువాతో,పులహారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కష్టపడి పనిచేసే వారికి పార్టీలో పదవులు కచ్చితంగా వస్తాయని ఆయన అన్నారు. వరప్రసాద్ పార్టీ కోసం నిరంతరం కృషి చేశారన్నా రు. వరప్రసాద్ ఇలాంటి మరెన్నో ఉన్నత పదవుల ను పొందాలని దేవుని ప్రార్థిస్తునట్లు ఆయన తెలిపారు.

## నిరుపేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి-కుప్పాల వెంకటసుబ్బయ్య



ప్రజాభూమి, సిద్ధవటం: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం లాంటిదని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం సిద్ధవటం మరియు ఒంటిమిట్ట మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. సిద్ధవటం మండలం మాచుపల్లికి చెందిన కాకర్ల మునెమ్మకు రూ. 66,796, ఒంటిమిట్టకు చెందిన సుజాతకు రూ. 35,028 విలువైన చెక్కులను అందజేశారు. ఎమ్మెల్సీ రామచంద్రయ్య చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. తమకు ఆర్థిక భరోసా కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు ఎమ్మెల్సీ రామచంద్రయ్య, బాలిశెట్టి హరిప్రసాద్, చమర్తి జగన్మోహన్ రాజులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పుత్తా యల్లయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### - వైద్యాధికారిణి శ్రీవిద్య



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని నిర్మలగిరి కాలనీలో మంగళవారం మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెరుగుతున్న ఎండల పట్ల ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా చల్లని నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 104 మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడులు, హత్యలు క్షమించరాని నేరం

### - టిడిపి పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్

ప్రజాభూమి, వేంపల్లె



జర్నలిస్టులు ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధి లాంటి వారని, జర్నలిస్టులపై దాడులు, హత్యలు క్షమించరాని నేరమని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా వి.కొత్తకోట, ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్య అత్యంత బాధాకరమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటివి చోటు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. జర్నలిస్టులు సమాజ హితులని, ప్రజాస్వామ్యం నిలబడాలంటే స్వేచ్ఛాయుతమైన జర్నలిజం తప్పనిసరి చేయాలన్నారు. జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటుందని తెలిపారు.

## తిరుమలలో క్యాంటీన్లు, విశ్రాంతి గృహాలకు మే 15 డెడ్‌లైన్

ప్రజాభూమి ప్రతినిధి తిరుమల



తిరుమల: వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుమలలోని బిగ్ క్యాంటీన్ల ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని టీటీడీ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి సమీక్ష నిర్వహించి నిర్వాహకులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. నిర్ణయించిన ధరలకే ఆహారం విక్రయించాలి, సాంప్రదాయ ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి, సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించాలి, పారిశుద్ధ్యాన్ని కచ్చితంగా పాటించాలని సూచించారు. జనతా క్యాంటీన్లలో కూడా నిబంధనల ప్రకారం తక్కువ ధరల్లో భక్తులకు ఆహారం అందించాలని తెలిపారు. అలాగే కాటేజీ డోనార్ స్కీమ్ ద్వారా నిర్మిస్తున్న విశ్రాంతి గృహాలను వేగవంతంగా పూర్తి చేసి మే 15లోగా టీటీడీకి అప్పగించాలని, ప్రతి గృహంలో జనరేటర్ సౌకర్యం ఉండేలా చూడాలని ఆదేశించారు.

## శ్రీవారిని దర్శించుకున్న భారత ఉప రాష్ట్రపతి

ప్రజా భూమి ప్రతినిధి తిరుమల.



భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు ఉపరాష్ట్రపతి చేరుకోగానే రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తో బాటు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర,



అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సి వి ఎస్ ఓ మురళీకృష్ణలు ఆయనను సాదరంగా ఆహ్వానించగా, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అనంతరం ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. భారత ఉపరాష్ట్రపతికి టీటీడీ చైర్మన్ మరియు ఈవో స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు.

శ్రీ బేడీ ఆంజనేయ దర్శనం: భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న శ్రీ బేడి ఆంజనేయస్వామివారిని కూడా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల్లో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్లాల్. టిటిడి బోర్డు సభ్యులు రామమూర్తి, భాను ప్రకాష్ రెడ్డి, జంగా కృష్ణమూర్తి, పలువురు రాష్ట్రస్థాయి మరియు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్య అత్యంత పాశవికం-: ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ చినబాబు.

ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం



పలమనేరు నియోజకవర్గం వి. కోట మండలం ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు గురికావడం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ చినబాబు ఆవేదన వ్యక్తంచేసారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇలాంటి అమానవీయ ఘటన జరగడం అత్యంత శోచనీయమని, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన విలేకరిపై జరిగిన ఈ దాడిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపి, నిందితులు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులను కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇలాంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించకూడదని, విలేకరి జగన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

## రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్యపై ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు దిగ్భ్రాంతి

### - కఠిన చర్యలకు ఆదేశం




ప్రజా భూమి ప్రతినిధి వి.కోట

చిత్తూరు జిల్లా వి. కోట మండలంలో ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు గురికావడం పై చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా భావించే జర్నలిస్టుల పై ఇలాంటి దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్పీతో చర్చలు.. తక్షణ అరెస్టులకు ఆదేశం :ఈ ఘటనపై ఎంపీ వెంటనే స్పందిస్తూ జిల్లా ఎస్పీ డూడీతో ఫోన్లో మాట్లాడారు. హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులు ఎంతటి వారైనా సరే, ఉపేక్షించకుండా వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని ఎస్పీని కోరారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి భరోసా :జగన్మోహన్ రెడ్డి అకాల మరణం ఆయన కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబ సభ్యులకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు. వృత్తిపరమైన విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే జర్నలిస్టులపై దాడులు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఈ కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు స్పష్టం చేశారు.

## శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర ఉత్సవాలకు ఎమ్మెల్యే పులివర్తి నానికి ఆహ్వానం

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్



తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం గంగ జాతర ఉత్సవాలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కి ప్రత్యేక ఆహ్వానం పలికిన ఆలయ ధర్మకర్తలు మండల చైర్మన్ మహేష్ యాదవ్ , సభ్యులు, ఆలయ కార్య నిర్వహణ అధికారి విజయకుమార్ అర్చకులు. తిరుపతి పట్టణంలో వెలసిన తాతయ్యగుంట గంగమ్మ జాతర మే 5వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే కి అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎర్ర బంగారం చోరీకి ప్రధాన కేంద్రంగా సూళ్లూరుపేటమండలం

### - అక్రమ మట్టి తవ్వకాలపై అధికారుల మౌనమేల..?

ప్రజా భూమి ప్రతినిధి సూళ్లూరుపేట.



అడ్డదారుల్లో అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ మట్టి మాఫియా నాయకులు అడ్డగోలు తవ్వకాలకు అలవాటైపోయారు. ఏ ప్రభుత్వ శాఖ నుండి అనుమతులు ఉండవు. అడ్డు తగిలే అధికారులను పరిపాలన పార్టీ పేరు చెప్పి పబ్బం గడుపుకోవడం అలవాటుగా మారింది. సూళ్లూరుపేట మండల పరిధిలో పుష్కలమైన గ్రావెల్, మట్టి వనరులు లభించడంతో మట్టి మాఫియా సూళ్లూరుపేట మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలకు తెరతీసిన ఏ అధికారి ఏమని ప్రశ్నించిన పరిస్థితి లేదు. పగలు -రాత్రి తేడా లేకుండా భారీ యంత్రాలతో భూగర్భ సంపదను దోచుకుపోతున్న మండల స్థాయిలో పనిచేసే ఏ ప్రభుత్వ అధికారి అడ్డుకొని అరికట్టిన పరిస్థితి లేదు. గ్రామస్థాయి వీఆర్వో, కార్యదర్శులు నుండి మండల స్థాయి తాసిల్దార్, పోలీస్ అధికారుల వరకు మౌనమే మా సమాధానం అన్న రీతిలో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఇలుపూరు చెరువు లో మరియు రోడ్డు ప్రక్క పొలాల్లో భారీ యంత్రాలతో రాత్రివేళ తవ్వకాలు చేస్తున్న తెలిసి తెలియనట్లే వ్యవహరిస్తున్నారే తప్ప కట్టడి చేసే పరిస్థితి లేదు. అదేవిధంగా పెరటిపాడు. కొన్నెంబట్టు పరిసర ప్రాంతాల నుండి, మంగళంపాడు దావదిగుంట. వులస పడవ చెరువులను నామరూపాలు లేకుండా తవ్వకాలు జరిపి మట్టి తరలించకు పోతున్నారు. ఈ ప్రక్రియ గత నెల రోజులుగా కళ్ళ ఎదుటే కనిపిస్తున్న ఎందుకు అక్రమ తవ్వకాలను అరికట్టలేకపోతున్నారని మండల ప్రజల సూటి ప్రశ్నగా ఉంది. పెట్టుబడి లేని ఆదాయంగా అక్రమ వ్యాపారులు మట్టిని తరలించి భారీగా రియల్ ఎస్టేట్‌లకు తరలించి కాసులు పోగేసుకుంటున్నారు. ప్రభుత్వ యంత్రాంగం మాత్రం పారదర్శక పాలనతో పాటు, అవినీతి అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలన్న ఆదేశాలు అమలు నోచుకోవడం లేదు. పార్టీ మాది.. పాలకులు మా వాళ్లు.. మా వ్యాపారాలకు అడ్డొస్తే అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు కూడా రూమర్లు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ప్రభుత్వంలో ప్రజల కోసం పనిచేస్తున్న అధికారులు కొంతమేరకైనా వారి అధికారాలు వినియోగిస్తే అక్రమ వ్యాపారులకు కళ్లెం పడే పరిస్థితి ఏర్పడుతుంది. మండలంలో జరుగుతున్న మట్టి మాఫియాను అరి కట్టి భూగర్భ సంపద తరలిపోకుండా కాపాడాల్సిన ఆవశ్యకత, అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజల అభిప్రాయం గా ఉంది. స్థానికంగా మండల పరిధిలో ఉన్న కొందరు నాయకులు గతంలో ఇదేమి కర్మ .బాదుడే బాదుడు. గౌరవ సభలో. ఊరు ఊర వాడవాడలా పల్లె పల్లెనా మండల స్థాయిలో నిర్వహించి ఈమట్టి మాఫియా ఎంతెంత గుంటలుగా ఎత్తేస్తున్నారు మరి ఆయా గ్రామాల్లో బర్రె గొడ్డు గొర్రె బిడ్డ పడిపోతే ఎవరు బాధ్యత అని అడిగారు ప్రభుత్వ అధికారులు మరి ప్రభుత్వ అధికారులు నిమ్మక నీరెత్తినట్లు వ్యవహరిస్తూ పాలవన నాయకులకు కొమ్ము కాస్తున్నారు అని ప్రజలకు చెప్పడం జరిగింది ఆనాడు అడిగిన నాయకులు ఈ నాయకులు ఈనాడు అవే జరిగితే ఎవరు దీనికి బాధ్యత ఈ నాయకులు ఏమన ఆనాడు చేసిన కార్యక్రమాల్లో ప్రతి ఇంటికి ఎలాంటి నష్టం జరిగినా మాది బాధ్యత అని ఏమన్నా అగ్రిమెంట్లు రాసి ఇచ్చారా లేదు అక్రమ సంపాదనకు గత ప్రభుత్వం లో ఉన్నటువంటి నాయకులు దోచేసుకుంటే మనకు ఉండదేమో మనకు మనం ఏవిధంగా అక్రమ సంపాదన చేసుకోవాలో అని ఆలోచించి ప్రజలను రెచ్చగొట్టి మరి మాట్లాడారే తప్ప పై కార్యక్రమాల్లో ప్రజల కోసం పాకులాడుతున్న నాయకులు ఎవరన్నా ఉన్నారా మరి ప్రజల కోసమే చేసుంటే ఈనాడు వాళ్ళు చేసిన తప్పే వీళ్ళు ఎందుకు చేస్తున్నట్టు పాలనా పార్టీ నాయకుల సహకారంతో అర్ధరాత్రి అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగడానికి అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఏది ఏమైనా ప్రభుత్వ అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే అక్రమ వ్యాపారుల అవినీతి సంపాదనలో అధికారులు కూడా భాగస్వామ్యులేనని నిర్ధారించుకునే అవకాశాలు ఉన్నాయి. జిల్లా యంత్రాంగం ఎన్నో రోజులుగా సాగుతున్న మట్టి మాఫియాను కట్టడి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కూడా వారి అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు.

## స్విమ్స్‌లో కార్మికుల వర్క్ టు రూల్ తీవ్రతరం

### - ఆగిపోయిన ఆపరేషన్లు, రోగులకు ఇబ్బందులు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి: స్విమ్స్ ఆసుపత్రిలో కార్మికులు చేపట్టిన వర్క్ టు రూల్ ఉద్యమం తీవ్రరూపం దాల్చడంతో వైద్య సేవలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ఆపరేషన్లు నిలిచిపోవడం, థియేటర్లు మూతపడటం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. గత 60 రోజులుగా ఎండల మధ్య కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నప్పటికీ, టీటీడీ యాజమాన్యం స్పందించకపోవడంతో కార్మికులు వర్క్ టు రూల్‌ను అమలు చేస్తున్నారు. శానిటేషన్ హోదాలో పనిచేస్తున్న కార్మికులను వార్డు బాయ్‌లుగా గుర్తించాలని వారు గత రెండేళ్లుగా పోరాటం చేస్తున్నారు. ఇతర కార్మికులకు వేతనాలు పెంచినప్పటికీ, శానిటేషన్ హోదాలో ఉన్న వారికి వేతనాలు పెంచకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు హామీలు ఇచ్చి, లేబర్ అధికారులతో ఒప్పందాలు చేసుకున్నప్పటికీ వాటిని అమలు చేయకపోవడంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీటీడీ ఈఓ ముద్దాడ రవిచంద్ర నాలుగు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని ప్రకటించినప్పటికీ, 15 రోజులు గడిచినా చర్యలు లేకపోవడంతో కార్మికులు శానిటేషన్ పనులు మినహా మిగిలిన విధులు నిర్వహించబోమని స్పష్టం చేశారు. దీంతో థియేటర్లలో నిర్వహించాల్సిన ప్రొసీజర్లు నిలిచిపోయాయి. స్ట్రెచర్లు, వీల్‌చైర్లు నడిపే సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే అత్యవసర సేవలకు మాత్రం కార్మికులు మినహాయింపు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ, కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడకూడదని, వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి రోగుల ఇబ్బందులను తొలగించాలని ప్రభుత్వాన్ని, టీటీడీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

## శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి సి పి రాధాకృష్ణన్

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్



భారత ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ మంగళవారం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయం వద్దకు చేరుకున్న ఉపరాష్ట్రపతికి అర్చకులు సంప్రదాయబద్ధంగా ఇస్తికాపాల్ స్వాగతం పలికారు. ఆయన ఆలయంలోని ధ్వజస్తం



భానికి మొక్కుకుని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వాద మండపంలో టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర అమ్మవారి ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, జేఈవో వి వీరబ్రహ్మం, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, తిరుచానూరు ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్ లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎస్ వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి కలెక్టరేట్.



జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరి చిన గోదాము వద్ద 24-7 నిరంతరం నిఘా, పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మార్గదర్శకాలు ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్ నందు భద్రపరచబడిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, సి డబ్ల్యూ సి గోదామును మంగళవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్ లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాలు, సీలింగ్ తదితరాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేసారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్ నందు సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ భాను ప్రకాష్ రెడ్డి, ఈవిఎం గోడౌన్ ఇంఛార్జి మరియు జి ఎన్ ఎస్ ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ వై రమేష్ బాబు, రేణిగుంట తహసిల్దార్ శ్యాం ప్రసాద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నేతల ద్రాతృత్వంతో గ్రద్దగుంట గ్రామస్తులకు ఉచిత వైద్య శిబిరం.

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.



తిరుపతి జిల్లా తడ మండలం గ్రద్దగుంట గ్రామస్తులకు తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ద్రాతృత్వంతో గ్రద్దగుంట గ్రామస్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ఉచిత వైద్య శిబిరం ద్వారా బాలాజీ మెడికల్ కాలేజీ - హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో గ్రద్దగుంట గ్రామ ప్రజలకు ఉచిత వైద్యం అందించారు. బాలాజీ హాస్పిట ల్ వారు బస్సు సౌకర్యం కల్పించి గ్రామస్తులను తిరుప తికి తీసుకెళ్లి మూడు పూటల భోజనం ఏర్పాటు చేసి, చికిత్స అనంతరం మళ్లీ గ్రామానికి తీసుకొని వస్తామని హాస్పిటల్ యాజమాన్యం తెలియజేశారు. గ్రద్దగుంట గ్రామంలోని నిరుపేదలకు మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు రుణపడి ఉంటామని గ్రామస్తులు తెలియజేశారు.

## పెట్రోల్, డీజిల్ ఇంధన కొరతను తీర్చండి సిపిఐ డిమాండ్

ప్రజా భూమి ప్రతి నిధి ఏర్పేడు.



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రజలకు పెట్రోల్, డీజిల్ కొరతను తీర్చాలని సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత నాలుగు రోజుల నుండి పెట్రోల్, డీజిల్ ఇందనం లేకపోవడంతో పెట్రోల్ బంకులలో బొంకుల యజమానులు నో స్టాక్ బోర్డులు పెట్టడంతో ప్రజలు, రైతులు, ఆటో కార్మికులు నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు నిన్నటి దినం ఈ జిల్లా ప్రథమ పౌరుడు అయినటువంటి జిల్లా కలెక్టర్, ఎస్పీ గార్లు పెట్రోల్ డీజిల్ జిల్లాలో పుష్కలంగా ఉన్నాయని సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మొద్దని వారు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు ఈరోజుటి దినం కూడా పెట్రోల్ బంకులు ముందు నో స్టాక్ బోర్డులు శ్రీకాళహస్తిలో పెడుతున్నారని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ సమస్య పైన స్పందించి వెంటనే ప్రజలకు పెట్రోల్ డీజిల్ అందుబాటులో ఉండేటట్లు చూడాలని కోరారు లేనిపక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేస్తున్నామన్నారు.

## వి.కోట ఆంధ్రజ్యోతి విలేఖరి హత్యపై రేణిగుంటలో జర్నలిస్టుల ఆందోళన ...

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

వి.కోటకు చెందిన ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ రేణిగుంట విలేకరుల ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట కు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. మృతుడు జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ, నిజాలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులపై దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. హత్యకు పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేణిగుంట సిపిఎం నాయకులు హరినాథ్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయడంతో పాటు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని స్పష్టం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహిస్తూ రేణిగుంట పట్టణ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని విలేకరులకు రక్షణ కల్పించాలంటూ రేణిగుంట పోలీసులకు వినతి పత్రం అందించారు. వివిధ పార్టీలు సంఘాలు జర్నలిస్ట్ లకు మద్దతు తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు, వివిధ మీడియా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఎండిన చెరువుకి జీవం పోయనున్న జలధార

## జలధార జలహారతి ద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఫలితాలు

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు.



చిత్తూరు జిల్లాలో సాగునీటి జలకల జల ధార పనులతో జలకలను సంతరించుకోనున్న చింతమాకుల చెరువు. రైతుల మొహాల్లో చిరునవ్వు కనిపిస్తున్న నర్రా ఊరి గ్రామ సభ్యులు. ఒకప్పుడు సాగునీటితో కళకళలాడిన చింతమాకుల చెరువు మరియు వంకలు పూడిక పేరుకుపోయిన వాటిని శుభ్రం చేసి నీటిని నిల్వ చేసేలా చేస్తున్న రైతులు. జలధార జలహారతి ద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఫలితాలు వస్తాయని, యాదమరి మండలం కోనాపల్లి పంచాయతీ చింతమాకుల చెరువు నర్రా ఊరు గ్రామంలో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలధార జల హారతి కార్యక్రమంలో మార్పులు తీసుకొచ్చి ప్రవాహాన్ని సమర్థవంతంగా నియంత్రంచే విధంగా చేస్తున్నారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచడమే కాకుండా వరద సమయాల్లో కూడా నీటిని వృధా కాకుండా చేయనున్నారు. గతంలో కేవలం వర్షాధార పంటల మీద మాత్రమే ఆధారపడిన రైతులు, గ్రామ సభ్యులు ఇప్పుడు వేసవిలో కూడా ధైర్యంగా పంటను సాగు చేసుకునే వెసులుబాటు కలిగించేలా చేస్తున్నారు. నీటి నిల్వ పెరగడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో జలమట్టం గణనీయంగా పెరుగుతుందని జిల్లా అధికారులు భావిస్తున్నారు. బావులకు బోర్లకు నీరు ఎండిపోకుండా నిరంతరం వచ్చేలా ప్రణాళికలు తయారుచేసి చెరువుల్లో ఉన్నటువంటి పూడికను తొలగిస్తున్నారు. దీనివల్ల బావులు బోర్లలో నీరు ఇంకిపోకుండా నిరంతరం సాగు చేసుకునేలా చేస్తున్నారు. నీటి వనరులను సంరక్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జలధార జలహారతి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. అందులో భాగంగా చెరువుల్లో పూడికతీత కాలువ మరమ్మత్తులు చెక్ డౌన్ల నిర్మాణం వంటి పనులు 125 రోజుల ప్రత్యేక ప్రణాళికలతో నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా నీటి పొదుపుపై అవగాహన కల్పించడంతోపాటు సాగునీటి సౌకర్యాలను విస్తరించడమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేయడం జరుగుతోంది.

**యాదమరి మండలం కోనావల్లి వంచాయతీ చింతమాకుల చెరువు నర్సాపూర్ గ్రామంలో కొంతమంది సభ్యుల మాటలు**

1. ఉష మాట్లాడుతూ గతంలో చెరువులలో నీరు లేకపోవడం వల్ల నీరు నిలవడం కోసం మా చెరువులకు మీరు తెప్పించుకోవడం కోసం జల ధార జలహారతి ద్వారా పనులు చేయడం జరుగుతుందని తెలిపారు.

2. చిత్ర మాట్లాడుతూ గతంలో కొన్ని చెరువులకు నీటి సరఫరాలలో సమస్యలు ఉన్నాయని వాటిని ప్రస్తుతం అధికారులు సందర్శించి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తూ పనులు పూర్తి చేస్తున్నామన్నారు.

3. యాదమరి మండలం, నర్రా ఊరు దళితవాడకు చెందిన ధనయ్య మాట్లాడుతూ ఇక్కడ నీటి కొరత ప్రధాన సమస్యగా ఉండేదని, ఇప్పుడు మేము మా చెరువులకు నీరు తెప్పించుకోవడం కోసం పనులు చేస్తున్నామన్నారు.

4. రంజిని మాట్లాడుతూ గతంలో వంద రోజులు ఉన్న పని దినాలను ఇప్పుడు 125 రోజుల పని దినాలుగా మార్చి మాకు పనులు కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. చెరువులలో నీరు లేకపోవడం వల్ల నీరు నిలవడం కోసం మా చెరువులకు నీరు తెప్పించు కోవడం కోసం జలధార జలహారతి ద్వారా మేము పనులు చేస్తున్నామని తెలిపారు. గతంలో నీటి కొరత ప్రధాన సమస్యగా ఉండేదని ఇప్పుడు మేము వంకలలో నీటిని తెప్పించుకొని నీటి నిల్వ కోసం పనులు చేస్తున్నామని తెలిపారు. 5. ఫీల్డ్ అసిస్టెంట్ బాబు మాట్లాడుతూ యాదమరి మండలం కోనాపల్లి పంచాయతీ చింతమాకుల చెరువులో సుమారు 9 ఎకరాల 51 సెంట్లు ఉన్నాయని వాటిని శుభ్రం చేసుకుని చెరువులకు నీటి సరఫరాలో అధికారులచే సందర్శించి సమస్యలు లేకుండా సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తూ పనులు పూర్తి చేసి ప్రతి నీటి చుక్కను పొదుపు చేస్తూ నీటి భద్రత సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.



# సమన్వయం తో మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం

### సత్యవేడు మండల మీట్ లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు

### -ఇల్లు కాలిపోయిన కుటుంబానికి ఎమ్మెల్యే సాయం



ప్రజాభూమి ప్రతినిధి (సత్యవేడు) కేవీబీపురం

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం తో పని చేసి మండల సమగ్ర అభివృద్ధి కి సహకరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం సత్యవేడు ఎంపిడిఓ కార్యాలయం లో మండల సాదారణ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో వీధులు, స్మశాన వాటికలు, వాటికి రోడ్లు, త్రాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎక్కడైనా తీరని సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే ఆదిమూలం స్పష్టం చేశారు. అనంతర మండలంలోని సమస్యలను ప్రజా ప్రతినిధులు సభ లో ప్రస్తావించగా. అధికారులు వాటి పరిష్కార మార్గం చూపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో శాఖల వారీగా ప్రగతి నివేదికను అధికారులు సభలో చదివి వినిపించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సాయం : సత్యవేడు దళితవాడలో అగ్నికి ఆహుతై ఇల్లు కోల్పోయిన పుష్పరాజ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంమంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయం గా బియ్యం, నిత్యావసర వస్తువులు, రూ.5 వేలు నగదును ప్రభుత్వ తరపున అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని అన్నీ విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆదిమూలం బరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు కూటమి పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్గా,వైస్ ఛైర్మన్గా జాన్సన్,మురళి నియామకం

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.



తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్గా జాన్సన్,వైస్ ఛైర్మన్గా మురళి( చికెన్ చిన్న) నియమితులయ్యారు.ఈ కమిటీకి గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వ్యవహరిస్తారు.ఈ మేరకు రాష్ట్ర ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకంపై ఉత్తర్వులు విడుదల చేశారు. ఇందులో భాగంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్గా నాగలాపురంకు చెందిన దామోదరన్ అలియాస్ జాన్సన్, వైస్ ఛైర్మన్గా సత్యవేడు పట్టణానికి చెందిన మురళి,సభ్యులుగా యుగంధరయ్య,లత, సునీత, జయలక్ష్మి, తుపాకుల రవణ, ఉద్ది సుబ్రహ్మణ్యం,లక్ష్మీ, మరియమ్మ,వలర్మది, ఏ.కృష్ణారెడ్డి, మందపాటి సురేష్, కొల్లరామగోవిందచౌదరి,కుమార్,మార్కెట్ కమిటీ అధ్యక్షులు,వ్యవసాయ శాఖ ఏడి,నాగలాపురం ప్రత్యేక అధికారి,జిల్లా వ్యవసాయ ట్రేడ్ మార్కెట్ అధికారి వ్యవసాయ మార్కెట్ కమిటీలో సభ్యులుగా కొనసాగనున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా ప్రభుత్వం నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీని నియమించింది.ఈ కమిటీ నియామకంలో కూడా టిడిపి నియోజవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి చక్రం తిప్పినట్లు సమాచారం.ప్రధానంగా శంకర్ రెడ్డి సిఫార్సు మేరకే కమిటీ సభ్యుల నియామకం జరిగినట్లు తెలుస్తోంది.

## మాతృభాషపై పట్టు.. పరభాషాభ్యసనకు ఆయువుపట్టు

ప్రజా భూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్పి జడ్పీ బాయ్స్ హైస్కూల్లో మాతృభాషపై పట్టు సాధిస్తే తద్వారా మరెన్నో భాషలను సులువుతరంగా నేర్చుకోవచ్చునని శ్రీకాళహస్తి మండల విద్యాశాఖ అధికారులు భువనేశ్వరి, బాలయ్య అన్నారు. పట్టణంలోని ఆర్ పి బి ఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కన్నడం, తమిళం, మలయాళం భాషాభ్యసనంలో సాధించిన ప్రావీణ్యతను ఆ భాషల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యాశాఖాధికారులు, తల్లిదండ్రులు సమక్షంలో మంగళవారం పరీక్షింపజేశారు. ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య ఆధ్వర్యంలో 26 తెలుగు సరళ పదాల తో రూపొందించిన "తెలుగు జ్యోతి" పుస్తకం ఆధారంగా పలు తరగతులకు చెందిన 15 మంది విద్యార్థులు కన్నడం, తమిళం, మలయాళం భాషలను స్వీయ అభ్యసన ద్వారా కేవలం 4 నెలల వ్యవధిలో ధారాళంగా చదవడం, రాయడం చేయగలుగుతుండటం పట్ల వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అందుకు తగిన ప్రోత్సాహం అందించిన ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్యను వారు అభినందించారు. తమ పిల్లలు ఇతర భాషల అభ్యసన తీరు పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు వెంకటయ్య మాట్లాడుతూ మాతృభాష వస్తే మరిన్ని భాషలు నైనా నేర్చవచ్చు అనే ప్రాజెక్టు ద్వారా విద్యార్థులకు పరభాషలను నేర్పుతున్నట్లు తెలిపారు. ఏ భాష అభ్యసన కైనా మాతృభాషపై పట్టు కలిగి ఉండటం ఆవశ్యకమని తెలియజేయడమే ఈ ప్రాజెక్టు యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాషా నిపుణులు షింజో మైకేల్, ఉష, సులోచన, సిఆర్ఎంటి మునిమోహన్, ఉపాధ్యాయులు అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో మెగా జాబు మేళ

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో గూడూరు లోని దువ్వూరు రమణమ్మ మహిళ కాలేజ్ నందు జరుగుతున్న జాబ్ మేళా కార్యక్రమంలో శ్రీ పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మెన్ తానంకి నానాజీ తో కలసి పాల్గొని, ప్లేస్ మెంట్ లో సెలెక్ట్ అయిన నిరుద్యోగ యువతకు ఆఫర్ లెటర్ లను అందించిన...గూడూరు ఎమ్మెల్యే మరియు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీ పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నారా లోకేష్ బాబు 20 లక్షలు ఉద్యోగాలు ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం ఈరోజు ప్రభుత్వం పనిచేస్తుంది. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నిరుద్యోగ యువతకు నియోజకవర్గంలో 7 మినీ జాబ్ మేళా, 3 మెగా జాబ్ మేళా నిర్వహించాం. ఇందులో దాదాపుగా 1768 మంది హాజరు కాగా 1057 మంది నిరుద్యోగులు ఉపాధి పొందారు. ఈరోజు కూడా దాదాపుగా 15 కంపెనీలు 900 మందికి పైగా ఈరోజు జాబ్ మేళా లో అవకాశం కల్పిస్తున్నాయి. వైజాగ్ నందు గూగుల్ డేటా ఏ వన్ సెంటర్ ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. దీని ద్వారా 2 లక్షల మందికి ఉపాధి కలుగుతుందని అన్నారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ యువతకు అవకాశలు కల్పిస్తుందని అన్నారు.



## వివేకానంద రోడ్డు పెట్రోల్ బంకు ఎదుట ధర్నా

**-నాలుగు రోజులుగా పెట్రోల్ బంకుల వద్ద వాహన దారుల వడిగావులు**
**-కేంద్ర, రాష్ట్ర పాలకులు నిల్వలు ఉన్నాయని బుకాయిస్తున్నారు**
**-పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంచాలి**
**-సీపీఐ జిల్లా నాయకులు సీహెచ్. ప్రభాకర్, సీవీఆర్. కుమార్ ధ్వజం**
**-వివేకానంద రోడ్డు పెట్రోల్ బంకు ఎదుట ధర్నా**

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచేందుకే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని సీపీఐ నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం వివేకానంద రోడ్డులోని పెట్రోల్ బంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు సీవీఆర్. కుమార్ మాట్లాడుతూ దేశంలో యుద్ధం సాకుతో కృత్రిమ కొరత సృష్టించి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచేందుకు చేస్తున్న ప్రయత్నమని ఆరోపించారు. నాలుగు రోజులుగా వాహనాలు పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరుతున్నాయన్నారు. బాడుగలకు వాహనాలు నడిపే డ్రైవర్లు డీజిల్ లభించక పనులు కోల్పోవలసి వస్తోందన్నారు. వ్యవసాయ రంగం కూడా కుదేలవుతోందన్నారు. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగినంత నిల్వలు పెట్రోల్ బంకుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు సీవీఆర్. కుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జీ. శశి కుమార్, సహాయ కార్యదర్శి షేక్ జమాలుల్లా, పట్టణ కన్వీనర్ సునీల్ యాదాల, చిల్లకూరు మండల కార్యదర్శి గుండాల రమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సయ్యద్ రిజ్వాన్, హనీఫ్, సమద్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చలివేంద్రం ప్రారంభం

ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం



రామచంద్రాపురం మండలంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో మండలబిజెపి జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి పొన్నా శంకర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ బిజెపి పార్టీ మహిళా మోర్చా కార్యదర్శి సభ్యురాలు మేడసాని అన్నపూర్ణ పురుషోత్తం నాయుడు చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి తాపానికి ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజలు వాళ్ళ అవసరాలు నిమిత్తం ఎమ్మార్వో కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయంకి వచ్చే వారికి ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత దృష్ట్యా బయట తిరగకూడదని తెలిపారు. ప్రతి రోజూ స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్వో మధుసూదన్ రావు, ఏవో చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మార్వో మధుసూదనరావు బిజెపి పార్టీ సీనియర్ నాయకులు దామినేటి శివ, సుబ్రహ్మణ్యం యాదవ్,చల్లా వెంకటరమణ యాదవ్, పొన్న రేవతి, ఏకాంతం చౌదరి, మోహన్ రెడ్డి,పాల్గొన్నారు.



## తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానంలో మూడవ వారపు జాతర వేడుకలు ఘనంగా -- పసుపుదారాలతో అమ్మవారికి విశేష అలంకారం.

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి పట్టణంలో వెలసియున్న శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానంలో 2026 గంగజాతర ముందు జరిగే వారాల సందర్భంగా మూడవ వారమైన మంగళవారం (28-04-2026) అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, విశేష అలంకరణలతో పూజలు ఘనంగా నిర్వహించబడినవి.ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. శక్తి స్వరూపిణిగా భావించే గంగమ్మ తల్లికి సంప్రదాయబద్ధంగా అభిషేకాలు నిర్వహించి, పసుపుదారాలతో అలంకరించడం జరిగింది. ఈ అలంకరణ అమ్మవారి మహిమను ప్రతిబింబిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించింది.గంగమ్మ తల్లి గ్రామదేవతగా భక్తుల సంక్షేమాన్ని కాపాడుతూ, అనారోగ్యాలు, కష్టాలు తొలగించి ఆయురారోగ్యాలు ప్రసాదిస్తుందనే విశ్వాసంతో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం జరిగే గంగజాతరలో ఈ వారాల పూజలకు ప్రత్యేక స్థానం ఉంది.ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొని పూజల్లో పాల్గొన్నారు. జాతర వేడుకలను శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ మరియు కార్యనిర్వహణాధికారి ఎ. జయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## శ్రీ వేద నారాయణ స్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాభూమి ప్రతినిధి నాగలాపురం



నాగలాపురం శ్రీ వేదవల్లీ సమేత శ్రీ వేదనారాయణ స్వామివారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలో మే 1 నుండి 9వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న విషయం విదితమే. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిం చడం ఆనవాయితీ.ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. అనంతరం ఉదయం 7.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, టెంపుల్ ఇన్స్పెక్టర్లు శ్రీ శ్రీనివాసులు, చెంగల్రాయులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్యపై తీవ్ర ఆగ్రహం -- నిందితులకు కఠిన శిక్ష విధించాలి - పొన్నా రవికుమార్

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలానికి చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్య అత్యంత పాశవికమైందని (ఆర్టిఐ) ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ వ్యవస్థాపకులు పొన్నా రవికుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇలాంటి అమానవీయ ఘటన జరగడం అత్యంత శోచనీయమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించే విలేకరిపై జరిగిన ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, నిందితులు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులను కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు.విలేకరి జగన్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ కేసును లోతుగా విచారించి, భవిష్యత్తులో విలేకరులపై దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.విలేకరుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని పొన్నా రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు వెడల్పు పేరుతో రైతు పొలంలో 5 అడుగుల ఆక్రమణ

ప్రజా భూమి ప్రతినిధి : శ్రీకాళహస్తి రూరల్...

శ్రీకాళహస్తి మండలంలోని జగ్గారాజుపల్లి నుంచి మిట్ట సెంటర్ మధ్య ఉన్న ఈసీ రోడ్డు వెడల్పు పనుల పేరుతో రైతు పొలాన్ని ఆక్రమిస్తున్నారని ఇనగలూరు గ్రామ రైతు శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శివకుమార్ మాట్లాడుతూ జగ్గారాజుపల్లి రోడ్డు పక్కన సర్వే నంబర్ 52/11 డి, 52/13 బి, 53/1 ఇ, 53/4 బి, 54/9లలో తనకు 80 సెంట్లు పొలం ఉందని, ఇనగలూరుకు చెందిన కాంట్రాక్టర్ చెలికం పాపిరెడ్డి, నెల్లూరుకు చెందిన శ్రీనివాసులురెడ్డి రోడ్డు మరమ్మతుల కాంట్రాక్టు తీసుకుని తన పొలంలో 5 అడుగుల మేర తవ్వేశారని శివకుమార్ తెలిపారు. "ఎటువంటి అనుమతులు లేకుండా మా పొలంలోకి వచ్చి మట్టి తోడుతున్నారు. అడిగితే రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చారని, దురుసుగా ప్రవర్తిస్తున్నారు" అని ఆయన వాపోయారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా, "మేము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. వీఆర్వోను పంపి విచారణ చేపిస్తాం" అని చెప్పారన్నారు. అయితే సోమవారం మళ్లీ కాంట్రాక్టర్లు పనులు కొనసాగించడంతో వీఆర్వోకు ఫోన్ చేస్తే, "కాంట్రాక్టర్లు ముందుగానే ఇక్కడ రోడ్డు ఉంది, బీటీ రోడ్డు వెడల్పుకు వర్క్ ఆర్డర్ తెచ్చుకున్నామని చెప్పారు. ప్రస్తుతానికి పనులు ఆపమని చెప్పామని, తహసీల్దార్ వచ్చాక ఆయన దృష్టికి తీసుకెళ్తాం" అని బదులిచ్చినట్లు తెలిపారు. "ఇక్కడ 7 అడుగుల రోడ్డు మాత్రమే ఉంది. కానీ కాంట్రాక్టర్లు 15 అడుగులు వెడల్పు చేస్తున్నారు. దీంతో నా పొలం 5 అడుగులు ఆక్రమణకు గురవుతోంది. కనీసం ఎక్స్‌గ్రేషియా ఇచ్చి, మా అనుమతి తీసుకుని పని చేయాలి" అని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు శివకుమార్ వివరించారు."బుధవారం రికార్డులతో కార్యాలయానికి రండి, విచారణ జరిపి న్యాయం చేస్తాం" అని తహసీల్దార్ హామీ ఇచ్చారని, బుధవారం ఆయనను కలుస్తున్నామని తెలిపారు. ఇంతమంది అధికారులకు ఫిర్యాదు చేసిన మంగళవారం కూడా కాంట్రాక్టర్లు పనులు ఆపకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. "న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతాం" అని శివకుమార్ హెచ్చరించారు.





# బడి పిలుస్తుంది ఇంటింటి ప్రచార రథమును జెండా ఊపి -ప్రారంభించిన పులివర్తి నాని..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చంద్రగిరి మండలం నందు "బడి పిలుస్తుంది" కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) మొదటగా బడి పిలుస్తుంది ఇంటింటా ప్రచార రథమును పచ్చ జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, మరియు విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ బాబు నూతన ఆలోచనలతో విద్యా వ్యవస్థ బలోపేతానికి ఎప్పుడు ప్రాధాన్యమిస్తూ ఉంటారని, తద్వారా ఈ సంవత్సరం "బడి పిలుస్తుంది" కార్యక్రమం ప్రారంభించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి ఎంతగానో కృషి చేస్తున్నారు అని కొని యాడారు. ఉపాధ్యాయులు తల్లి దండ్రులను సంప్రదించి ప్రతి ఒక్క విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్చే విధంగా, వారికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు గురించి తెలియపరుస్తూ, ప్రభుత్వ పాఠశాలల విలువలు తెలియజేసే విధంగా వారిని ప్రోత్సహించాలని తెలియజేశారు .అదేవిధంగా ఆర్జెడి శామ్యూల్ మాట్లాడుతూ "బడి పిలుస్తుంది" కార్యక్రమం ద్వారా ఒకటవ తరగతిలో ప్రైవేటు పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలో నమోదు కార్యక్రమం ఎక్కువగా ఉండాలని, ఆ విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ సహకారాన్ని పూర్తిగా అందించాలని తెలియజేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్ కుమార్ మాట్లాడుతూ వినూత్నంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ "బడి పిలుస్తుంది" కార్యక్రమం ప్రతి మండలంలో 36 రోజులు పాటు ఒక్కొక్క రోజు ఒక్కొక్క మండలంలో బడి పిలుస్తుంది ప్రచార రథం పంపి బడి ఈడు పిల్లలు నమోదు ఘనంగా పెంచాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఇందిరా దేవి, చంద్రగిరి మండల అభివృద్ధి అధికారి జి.అమర్నాథ్ రెడ్డి, చంద్రగిరి టిడిపి మండల ప్రెసిడెంట్ బాలా, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గౌస్ బాషా , సెక్టోరల్ అధికారి చంద్రశేఖర్ ,చంద్రగిరి మండలం విద్యా శాఖ అధికారులు ఎస్. లలిత కుమారి మరియు కె భాస్కర్ బాబు , మండలంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగినది.



# పుదుకుప్పం అసిస్టెంట్ లైన్మెన్ పనితీరు సరిగా లేదు

## -మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిటిసి ఆగ్రహం

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

పుదుకుప్పం అసిస్టెంట్ లైన్మెన్ పనితీరు సరిగా లేదని, పలుమార్లు ఫోన్ చేసిన తీయకపోవడం షరా మామూలుగా మారిందని తిరుపతి జిల్లా సత్యవేడు మండలం పుదుకుప్పం ఎంపిటిసి,వైస్ ఎంపీపీ శరవన ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన, ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖపై జరిగిన చర్చలో పలు అంశాలపై సంబంధిత ఏఈ వాసుదేవయ్య ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఎంపిటిసి శరవన జోక్యం చేసుకొని గ్రామంలో నాలుగు ట్రాన్స్ఫార్మర్లు మరమ్మతుకు గురి కావడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనికి సంబంధించి అసిస్టెంట్ లైన్ మాన్ నరేంద్రకు ఫోన్ చేసిన తీయడం లేదన్నారు.స్థానిక ప్రజా ప్రతినిధులు అయిన మాకు క్రింది స్థాయి ఉద్యోగులే సహకరించకపోతే మండల స్థాయి అధికారులు కూడా ఎలా స్పందిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటప్పుడు ఈ పదవులు మాకెందుకని వాపోయారు. అందువల్ల విధులలో నిర్లక్ష్యం చూపుతున్న అసిస్టెంట్ లైన్మెన్పై చర్యలు తీసుకోవాలని ఏఈని కోరారు. కనీసం రెండు వీధుల్లో ఉన్న ట్రాన్స్ఫార్మర్లకు ఆన్ ఆఫ్ స్విచ్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో భయాందోళనకు గురి అవుతున్నామన్నారు. రెవెన్యూ శాఖపై జరిగిన చర్చలో తహసిల్దారు శివప్రసాద్ మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామన్నారు. ఇందులో ఏమైనా తప్పిదాలు ఉంటే సరిచేసే అధికారం కూడా తనకు ఇచ్చినందువల్ల దీన్ని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. ప్రస్తుతం జన గణన కూడా మండలంలో ప్రారంభం అయింది అన్నారు. అయితే దీనిపై ఎంపీపీ ప్రతిమ జోక్యం చేసుకొని శ్రీసిటీలో గ్రామ సభలు నిర్వహించి భూముల వాస్తవిక మార్కెట్ ధరలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని తహసిల్దారు శివప్రసాద్ను కోరారు. తద్వారా భూసేకరణలో రైతులకు న్యాయం జరుగుతుందన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరతను తీర్చాలని ఎంపీపీ ప్రతిమ ఎమ్మెల్యేను కోరారు. అంగన్వాడి,పాఠశాల భవనాలకు ప్రభుత్వ స్థలము కేటాయించాలని కొల్లడం ఎంపిటిసి రమణ కోరారు.తదనంతరం సభను ఉద్దేశించి ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ మండల సర్వసభ సమావేశంలో సభ్యులు లేవనెత్తే సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.మదనంబేడు గ్రామంలో గతంలో వేసిన లేఔట్లలో తలెత్తిన సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అలాగే పేరడం,ఆంభాకం గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను అర్హులైన పేదవారికి పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ఐదు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి గాను ఒక కోటి 49 లక్ష రూపాయలు మంజూరు అయిందన్నారు.మంత్రి ఇచ్చిన హామీ మేరకు సత్యవేడు టు విజయవాడకు బస్సు సర్వీస్ నడపాలని సంబంధిత ఆర్టీసీ డిఎం వెంకటరమణకు సూచించారు. వేసవితీవ్రత దృశ్య వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దీనిపై ఆరోగ్యశాఖ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.మండలంలో అసంపూర్తిగా నిలిచిన సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేయించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రతి కుటుంబం సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేటట్టు అధికారులు చొరవ చూపాలన్నారు. ఏది ఏమైనా కాంట్రాక్టర్ల ఉదాసీనత వైఖరి,అధికారుల నిర్లక్ష్యం వల్ల నియోజవర్గంలో అభివృద్ధి ఆశించిన మేరకు జరగలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే అభివృద్ధి పరంగా సత్యవేడు అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశానికి వైస్ ఎంపీపీ వెంకటరత్నమ్మ,మండల పరిషత్ కోఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ,డిప్యూటీ ఎంపీడీవో షణ్ముగం,మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమరావు, హౌసింగ్ డిఇ శేషగిరి,ఆర్డబ్ల్యూఎస్ డిఈ శైలజ,ఎంఈఓ రవి,ఎంఈఓ 2 ఉష,వ్యవసాయ శాఖ ఏవో మురళి, దాసుకుప్పం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ క్రిస్టల్ దాస్, సత్యవేడు పంచాయతీ సెక్రెటరీ మునిరవికుమార్ పలువురు పంచాయతీ సెకరెటరీలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి-ఇంచార్జి కమిషనర్ శారదా దేవి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

నగరంలోని ప్రజల నుండి వచ్చిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. ప్రజా పిర్యాదుల పరిష్కారం వేదికలో వచ్చిన పిర్యాదుల మేరకు మంగళవారం ఎల్ఐసి రోడ్డు, ఆఫీసర్స్ క్లబ్ , బాలాజీ కాలనీ, పోలీస్ క్వార్టర్స్, హమీద్ నగర్ తదితర ప్రాంతాలను అధికారులతో కలసి ఇంచార్జి కమిషనర్ పరిశీలించి, అనంతరం అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ ఎస్ ఐ హాస్పిటల్ సమీపంలోని అన్న కాంటీన్లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారం వేదిక, వార్డుల్లో పర్యటించిన సమయంలో వచ్చే వినతులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఆయా విభాగాల అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని తెలిపారు. ముఖ్యంగా త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, కాలువలు శుభ్రం చేయడం, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి ఎక్కువ సమస్య లు వస్తున్నాయని వాటిని పరిష్కరించాలని తెలిపారు. జనన గణన, స్వీయ గణన ను వేగవంతం చేయాలని ఆన్లైన్ ద్వారా స్వర్ణ వార్డు కార్యదర్శులను ఆదేశించారు. వార్డు పర్యటన, సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డిసిపి ఖాన్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, ఏసిపి పార్వతి ప్రియ, డి.ఈ మధు ,శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, సుమతి, తదితరులు ఉన్నారు.





# గంగ జాతరకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేద్దాం-ఇంచార్జి కమిషనర్ శారదా దేవి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి నగరంలో నిర్వహించనున్న తాతయ్యగుంట గంగజాతరకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేసి, విజయవంతం చేయాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. గంగజాతర ఏర్పాట్లపై మంగళవారం అన్ని విభాగాల అధికారులతో ఇంచార్జి కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గంగ జాతర లో ఎవరికీ కేటాయించిన విధులను వారు చక్కగా నిర్వహించి విజయవంతం చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఆలయ పరిసరాలతో పాటు, నగరంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగ్గా చేపట్టాలని తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా పలు ప్రాంతాల్లో త్రాగునీరు సౌకర్యం, మజ్జిగ పంపిణీ చేయాలని తెలిపారు. అలాగే పోలీస్ అధికారులతో కలసి సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పొంగళ్ళు పెట్టేందుకు మార్కెట్ లో అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ టాయిలెట్స్, అగ్ని ప్రమాదాలు జరగకుండా అన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. వాహనాలు ఎక్కడపడితే అక్కడ ఉంచకుండా పోలీస్ అధికారులతో కలసి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జంతు బలులు కేటాయించిన స్థలంలోనే జరిగేలా చర్యలు చేపట్టి, ఎప్పటికప్పుడు నీటితో శుభ్రం చేయాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో వచ్చిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపి ఖాన్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, అర్బన్ తహసీల్దార్ సుధాకర్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడుగా తమ్మిశెట్టి రవీంద్ర ఎన్నిక

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షులుగా తమ్మిశెట్టి రవీంద్ర ఎన్నికైన సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బొజ్జల సుధీర్ రెడ్డి తమ్మిశెట్టి రవీంద్రను దుశ్యాలవాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు రాయలసీమ అధ్యక్షులు దేవళ్ళ శ్రీనివాసులు, తిరుపతి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు గంజి మదన్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవళ్ళ రమణ, జిల్లా కార్యదర్శి వేముల బాల, శి.రోశయ్య, టీ. శ్రీనివాసులు, చంగల్ రాయలు, సుధాకర్, ఏ. సుబ్బు, ఆనందయ్య, నాగరాజు తదితరులు అభినందనలు తెలియజేశారు.





# ఆంధ్రజ్యోతి విలేకరి హత్యపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చంద్రగిరి జనసేన పార్టీ సీనియర్ నాయకులు -మన తిరుపతి ప్రెస్ క్లబ్ వ్యవస్థాపకులు తపసి మురళి రెడ్డి

## నిందితులను కఠినంగా శిక్షించాలి... తపసి మురళి రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.



పలమనేరు నియోజకవర్గం వీ.కోట మండల ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు గురి కావడంపై తపసి మురళి రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పత్రికా విలేకరిపై జరిగిన ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రశాంతమైన చిత్తూరు జిల్లా వీ.కోట నడిబొడ్డున ఈ ఘటన జరగడం చాలా దారుణమని నిందితులను వెంటనే గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులు వారిని కోరుకుంటున్నాను అన్నారు , ఈ ఘటనకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠిన శిక్ష పడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని మృతుని కుటుంబీకులకు న్యాయం జరిగేలా అండగా జనసేన పార్టీ, మరియు మన తిరుపతి ప్రెస్ క్లబ్ ఉంటుందని అన్నారు , అదేవిధంగా వారి కుటుంబీకులకు తన ప్రగాఢ సానుభూతితో పాటు సంతాపాన్ని చంద్రగిరి జనసేన పార్టీ సీనియర్ నాయకులు మరియు మన తిరుపతి ప్రెస్ క్లబ్ వ్యవస్థాపకులు తపసి మురళి రెడ్డి వ్యక్తం చేశారు.

# నెల్లటూరులో ఘనంగా పాండురంగ స్వామి అగ్నిగుండ మహోత్సవం



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

గూడూరు మండలం నెల్లటూరు బీసీ కాలనీలో మంగళవారం వేకువ జామున శ్రీ పాండురంగ స్వామి అగ్నిగుండ మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పండరి భజన గురువు పులి శ్రీకాంత్ ఆధ్వర్యంలో భక్తులు పండరి భజనలు నిర్వహించారు. తెల్లవారులు భజనలతో స్వామివారిని కీర్తించారు. మంగళవారం వేకువ జామున అగ్నిగుండం ఏర్పాటు చేసి అందులో మహిళలు చిన్నారులు పండరి భజన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అగ్నిగుండంలోని నిప్పులు తొక్కుతూ జై విట్టల జై పాండురంగ అంటూ నినదిస్తూ భక్తిపారసంతో మునిగిపోయారు. పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు అయ్యారు.

# గుడిమల్లం పరశురామేశ్వర స్వామిని దర్శించుకున్న తమిళనాడు ధర్మాదాయ శాఖ అధికారి



ప్రజాభూమి ప్రతినిధి ఏర్పేడు

తిరుపతి జిల్లాలోని చారిత్రాత్మక పుణ్యక్షేత్రం గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర స్వామి వారిని తమిళనాడు రాష్ట్ర ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఇ. జీవానందం దర్శిం చుకున్నారు. ఆలయ సందర్శనార్థం విచ్చేసిన జీవానందం కి ఆలయ చైర్మన్ గరిపాటి గిరిబాబు, అర్చక బృందం ఘనంగా స్వాగతం పలికారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన అత్యంత పురాతన లింగాకార పరశు రామేశ్వర స్వామి వారికి ఆయన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దర్శనానంతరం చైర్మన్ గిరిబాబు, అర్చకులు కలిసి ఆలయ ప్రాశస్త్యాన్ని, శతాబ్దాల నాటి శిల్పకళా వైభవాన్ని ఆయనకు వివరించారు.స్వామివారి దర్శనం అనంతరం ఆలయ చైర్మన్ గరిపాటి గిరిబాబు డిప్యూటీ కమిషనర్ జీవానందం ని శాలువాతో సత్కరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్యపై తీవ్ర దిగ్భ్రాంతి

ప్రజాభూమి ప్రతినిధి కేవీబీపురం



పలమనేరు నియోజకవర్గం, వీ.కోట, ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్య అత్యంత పాశవికం. ప్రజాస్వామ్యంలో కలంపై జరిగిన ఈ దాడిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. పలమనేరు నియోజకవర్గం, వీ.కోట మండలంలో విధి నిర్వహణలో ఉన్న విలేకరిపై ఇలాంటి దారుణానికి ఒడిగట్టడం సభ్య సమాజాన్ని తలవంచుకునేలా చేస్తోంది. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని పోలీస్ ఉన్నతాధికారులను డిమాండ్ చేస్తున్నాము. నిందితులు ఎంతటి వారైనా, ఏ పార్టీకి చెందిన వారైనా సరే చట్టం నుండి తప్పించుకోలేరు. ప్రాణాలు కోల్పోయిన జగన్ గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. వారి కుటుంబానికి న్యాయం జరిగే వరకు, ప్రభుత్వం మరియు పార్టీ పరంగా అండగా పార్టీ ఉండాలి అని కోరుకుంటున్నాను. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియాపై దాడి అంటే.. అది వ్యవస్థపై జరిగిన దాడిగానే పరిగణిస్తాం. బాధితులకు న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదు అని కేవీబీ పురం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మునస్వామి యాదవ్ తెలియజేశారు.

# ముగిసిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమాలు

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



గూడూరు సహాయ వ్యవసాయ సంచాలకులు, గూడూరు కార్యాలయంలో వి ఏ ఏ ఎ విహెచ్ఎలతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖలతో సహాయ వ్యవసాయ సంచాలకులు , గూడూరు బి. గోపి నాయక్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసినది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయమే రాబోయే కాలానికి శరణమని వివరిస్తూ ప్రతి రైతు కూడా ప్రకృతి వ్యవసాయం వైపు అడిగేసి రైతులకు తక్కువ ఖర్చుతో నిరంతరాదాయం చేకూర్చే విధంగా ప్రతి సిబ్బంది కూడా రైతులకు కావలసినటువంటి సహాయ సహకారాలు అందించి ఎక్కువ మంది రైతులని ఎక్కువ విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకురావాలని సూచించారు.జిల్లా నుండి వచ్చిన ప్రకృతి వ్యవసాయ ఎన్ ఎఫ్ ఏ మధు ప్రకృతి వ్యవసాయంలోని 9 సర్వత్రిక సూత్రాలు వాటి ఉపయోగాలు ప్రతి రైతు ఈ ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలను ఏ విధంగా పాటించాలి అన్న విషయాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగింది. ప్రకృతి వ్యవసాయంలో బయో ఇన్పుట్స్ ఔటపుట్స్ రిసోర్స్ సెంటర్స్ యొక్క ప్రాముఖ్యతను , ఈ బి ఆర్ సి సెంటర్ లల్లో రైతులకు కావలసినటువంటి కషాయాలు , ద్రావణాలను అందుబాటులో ఉంచడం జరుగుతుందని ప్రతి రైతు వీటిని వినియోగించుకునేలా చేయాలని వివరించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి గూడూరు వి. రమేష్ మాట్లాడుతూ ప్రతి వి ఏ ఏ వి హెచ్ ఎ పరిధిలో ఉన్నటువంటి రైతులతోటి ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని రైతులతో పిఎండిఎస్ ప్రీ- మాన్ సూన్ డ్రై సోయింగ్ నవధాన్యాల సాగు పద్ధతి ద్వారా భూమిని ఏ విధంగా సారవంతం చేసుకుంటాము పశువులను వ్యవసాయంతో ఎలా అనుసంధానం చేసి రైతులకు నిరంతరం ఆదాయం సమాకుర్చుకోవాలి విషయాలల పైన పూర్తిస్థాయిలో ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ప్రకృతి వ్యవసాయంలో పండించిన మంచి ఆహారాన్ని ప్రతి రైతు తినే విధంగా ప్రోత్సహించాలని సూచించారు . ఈ శిక్షణా కార్యక్రమంలో వ్యవసాయ మరియు న్యాచురల్ ఫార్మింగ్ సిబ్బంది పాల్గొన్నారు..

# చిట్టమూరు మండలంలో తహసిల్దార్ రామయ్య 24/7 పర్యవేక్షణ ప్రజలకు భరోసా!

ప్రజా భూమి ప్రతినిధి చిట్టమూరు.



ప్రతి పెట్రోల్ బంక్ పరిస్థితిని స్వయంగా పరిశీలిస్తున్న తహసిల్దార్ రామయ్య! కొత్తగుంట విజ్ఞేశ్వర బంక్‌లో మధ్యాహ్నం 2కి డీజిల్ స్టాక్ రామయ్య హామీ! మంజుల భారత్ బంక్‌లో 3 గంటలకు పెట్రోల్ డీజిల్ చేరిక తహసిల్దార్ పర్యవేక్షణలో! మల్లాం శ్రీధర్,గుణపాడు బంకుల్లో 3 గంటలకు స్టాక్ అందుబాటులోకి రామయ్య పర్యవేక్షణలో! కార్లకు 10 లీటర్లు ద్విచక్ర వాహనదారులకు రూ.300 పరిమితి తహసిల్దార్ స్పష్టమైన ఆదేశాలు! ప్రజలు భయపడవద్దు తహసిల్దార్ రామయ్య భరోసా, అన్ని వాహనాలకు తగినంత సరఫరా!వీఆర్వో శివయ్య, తలారి శ్రీనివాసులు సహకారంతో తహసిల్దార్ రామయ్య పర్యవేక్షణ మరింత బలంగా! తిరుపతి జిల్లా చిట్టమూరు మండలంలో ఇంధన సరఫరా సమస్యలపై ప్రజల్లో ఆందోళన నెలకొన్న సమయంలో, తహసిల్దార్ రామయ్య స్వయంగా ముందుకు వచ్చి పర్యవేక్షణ చేపట్టారు.మండలంలోని నాలుగు



పెట్రోల్ బంకుల్లో 24 గంటలు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, ప్రజలు భయపడవద్దని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు.కొత్తగుంటలోని విజ్ఞేశ్వర ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్లో పెట్రోల్ అందుబాటులో ఉండగా, డీజిల్ తాత్కాలికంగా డ్రై అయింది. అయితే మధ్యాహ్నం రెండు గంటలకు కొత్త స్టాక్ చేరుతుందని తహసిల్దార్ తెలిపారు. అదే గ్రామంలోని మంజుల భారత్ పెట్రోల్ బంక్లో కూడా మధ్యాహ్నం మూడు గంటలకు పెట్రోల్ డీజిల్ స్టాక్ అందుబాటులోకి వస్తుందని ప్రకటించారు.మల్లాం శ్రీధర్ పెట్రోల్ బంక్లో మధ్యాహ్నం మూడు గంటలకు పెట్రోల్ నిల్వ ఉంటుందని, గుణపాడు ఇండియన్ పెట్రోల్ బంక్లో కూడా అదే సమయానికి పెట్రోల్ డీజిల్ స్టాక్ చేరుతుందని ఆయన వివరించారు.ప్రజలు అవసరానికి మించి ఇంధనం వినియోగించవద్దని సూచిస్తూ, తహసిల్దార్ రామయ్య స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. కార్లకు 10 లీటర్లు, ద్విచక్ర వాహనదారులకు రూ.300 విలువైన ఇంధనం,అలాగే అన్ని వాహనాలకు తగినంత పరిమితి మాత్రమే వినియోగించుకోవాలని ఆయన సూచించారు.ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుగుతోంది. భయంకరనకు గురి కాకుండా ఉండండి అని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో శివయ్య, తలారి శ్రీనివాసులు పాల్గొన్నారు. ప్రజల ఆందోళనను తగ్గిస్తూ, ఇంధన సరఫరా సమయానుకూలంగా అందుబాటులోకి వస్తుందని తహసిల్దార్ రామయ్య స్పష్టంగా తెలియజేశారు.చిట్టమూరు మండలంలో తహసిల్దార్ రామయ్య 24/7 పర్యవేక్షణ ప్రజలకు భరోసా! బంకుల్లో పెట్రోల్ డీజిల్ సమయానుకూలంగా అందుబాటులోకి. కార్లకు 10 లీటర్లు, ద్విచక్ర వాహనదారులకు రూ.300 పరిమితి, అన్ని వాహనాలకు తగినంత సరఫరా.ప్రజలు భయపడవద్దు,భయంకరనకు గురి కాకుండా ఉండండి! మండల ప్రజల కోసం తహసిల్దార్ రామయ్య, వీఆర్వో శివయ్య, తలారి శ్రీనివాసులు కలిసి నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, ఇంధన సరఫరా సజావుగా కొనసాగేందుకు కృషి చేస్తున్నారు. ప్రజల ఆందోళనను తగ్గిస్తూ, ప్రతి బంక్‌లో సమయానుకూలంగా స్టాక్ చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వాహనదారులకు తగినంత పరిమితి విధిస్తూ, ఇంధన వినియోగం సజావుగా కొనసాగేందుకు తహసిల్దార్ రామయ్య పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నారు.

## బాబు వచ్చారు... గూగుల్ తెచ్చారు - డా.జి.దశరథాచారి, డా.యం.ఉమేష్ రావు

ప్రజా భూమి ప్రతినిధి : శ్రీకాళహస్తి




భవిష్యత్ తరాలకు ఒక అద్భుతమైన ఆంధ్రప్రదేశ్ ను అందించే లక్ష్యంతో పనిచేస్తున్న సియం చంద్రబాబు నాయుడు విశాఖపట్నానికి గూగుల్ తెచ్చారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథా చారి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు కొనియాడారు.15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా సెంటర్ విశాఖకు రావడం అంటే మామూలు విషయం కాదని,దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ పెట్టుబడిని సాధించిన ఘనత మన ముఖ్యమంత్రి చంద్రబాబు కే సొంతం అని కొనియాడారు. ఏపీలోని తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపనతో నేటి నుండి విశాఖ రూపురేఖలు మారిపోనున్నాయని,విశాఖ అంటే కేవలం పోర్ట్ సిటీ మాత్రమే కాదు, ఇకపై అది గ్లోబల్ 'డేటా సిటీ' గా కీర్తి గడిస్తుందని తెలిపారు.అదానీ కనెక్స్, ఎయిర్ టెల్ నెక్స్ ట్రా భాగస్వామ్యంతో గూగుల్ ఏర్పాటు చేస్తున్న ఈ మెగా ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలవడమే కాక, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే ఏమిటో గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్ నిరూపించి, ఇన్వెస్టర్లకు నమ్మకం కలిగించడంలో చంద్రబాబు విజయం సాధించేలా చేసిందని హర్షం వ్యక్తం చేశారు.చంద్రబాబు అంటే ఒక బ్రాండ్, ఒక నమ్మకమని నిరూపిస్తూ... గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా 1 గిగా వాట్ సామర్థ్యాన్ని అందుకోవడం ఏపీ సాధించిన ఘనత అని, 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏపీ ఆర్థిక వ్యవస్థ జెట్ స్పీడ్‌తో దూసుకుపోవడం ఖాయం అని ఆశాభావం వ్యక్తం చేశారు.2047 నాటికి వికసిత్ భారత్ సాధించడం లో ఏపీ కీలకం కాబోతోందని, గూగుల్ డేటా సెంటర్ విశాఖను టెక్నాలజీకి చిరునామాగా మారుస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి,వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు మరియు రాష్ట్ర కార్యదర్శి యం.సుబ్బయ్య,బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు,శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, కాపునాడు నాయకుడు తొగురు హరి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో విద్యార్థినులకు మహిళా శక్తి పోలీసుల అవగాహన కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యం లో మహిళా శక్తి టీమ్ పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. టీనేజ్ వయస్సులో సరైన నిర్ణయాలు తీసుకో వడం, చెడు ఆకర్షణలకు లోనవకుండా ఉం డడం పై విద్యార్థినులకు సూచనలు అందించారు. మహిళా భద్రతకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, లోన్ యాప్స్ వంటి అంశాలపై జాగ్రత్తలు తెలియజేశారు. అలాగే హెల్ప్‌లైన్ నంబర్లు, శక్తి యాప్ వినియోగంపై వివరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో శక్తి టీమ్ పోలీసులు పద్మావతి ఉమెన్స్ డిగ్రీ కళాశాల మరియు పద్మావతి నర్సింగ్ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, ముఖ్యంగా టీనేజ్ వయస్సులో ఉన్న అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోలీసులు సమగ్రంగా వివరించారు. ఆకర్షణలకు లోనవకుండా జాగ్రత్తగా ఉండటం, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళలపై జరిగే నేరాలు, మోసపూరిత కేసులు,గూజూరా చట్టం, మ్యాట్రిమోనియల్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, లోన్ యాప్స్, ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా జరిగేమోసాలపై జాగ్రత్తలు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే 1930 సైబర్ హెల్ప్‌లైన్, 112 ఎమర్జెన్సీ సేవలు, శక్తి యాప్ వినియోగంపై కూడా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఎలాంటి సమస్యలైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని, చట్టపరమైన రక్షణ అందుబాటులో ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సురక్షిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## శ్రీకాళహస్తిలో మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోండి:ఆర్.డి. శ్రీధర్

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి సన్నిధి వీధికి చెందిన ఆర్.డి. శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో కుటుంబం సభ్యుల తో కలిసి మాట్లాడారు. సన్నిధి వీధిలో రెండు ఇండ్లను అనధికారికంగా కూల్చివేసి, ప్రశ్నించినందుకు మున్సిపల్ అధికారులు మూడో ఇంటికి నోటీసులు ఇచ్చారని వారు తెలిపారు.ఇంకా, తమను బెదిరిస్తూ ఇంటి ముందు గుమికూడి దుర్భాషలాడటం, గేటుకు తాళం వేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. సిడిఎంఏకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని, ఎమ్మెల్యేను కలిసినా న్యాయం జరగలేదని వాపోయారు.జేసీబీలతో ఇళ్లను కూల్చే ప్రయత్నం చేస్తే అగ్ని ప్రమాదం జరిగే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు.

## మెరుగైన లక్ష్యాలు సాధించాలి

### -పీ.ఎస్.డి సూపరింటెండెంట్ వై.వి.ఎన్. రవిశేఖర్

ప్రజాభూమి, హిందూపురం టౌన్




భీమా సంకల్పం కార్యక్రమాల అమలులో సిబ్బంది మరింత కృషి చేసి మెరుగైన లక్ష్యాలను సాధించాలని పీ.ఎస్.డి. సూపరింటెండెంట్ వై.వి.ఎన్. రవిశేఖర్ సూచించారు. మంగళవారం హిందూపురం తపాలా డివిజనల్ కార్యాలయంలో భీమా సంకల్పం పేరణాత్మక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హిందూపురం డివిజన్ సూపరింటెండెంట్ రెడ్డి బాషా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విజయవాడ పీ.ఎస్.డి. సూపరింటెండెంట్ వై.వి.ఎన్. రవిశేఖర్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఉద్యోగి సమన్వయంతో పనిచేస్తే లక్ష్యాలను అధిగమించడం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. గత భీమా సంకల్పం డ్రైవ్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ప్రధాన తపాలా కార్యాలయ పోస్టు మాస్టర్ మార్కేండేయులు, డివిజనల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంధ్రజ్యోతి విలేకరి హత్య దారుణం..!

### నిందితులను కఠినంగా శిక్షించాలి..

### ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలి..

ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:




రాష్ట్రం లో జర్నలిస్టుల కు రక్షణ కరువైందని చెప్పడానికి చిత్తూరు జిల్లా వి కోట ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్య నిదర్శనమని చంద్రగిరి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు అన్నారు. మంగళవారం చంద్రగిరిలో వారు జగన్మోహన్ రెడ్డి హత్యకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల ప్రత్యేక రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను తక్షణం అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రజ్యోతి విలేకరి హత్యపై పాత్రికేయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ప్రశాంతమైన చిత్తూరు జిల్లా వి.కోట నడిబొడ్డున ఈ ఘటన జరగడం చాలా దారుణమని నిందితులను వెంటనే గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులుని కోరారు. ఈ ఘటనకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠిన శిక్ష పడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని మృతుని కుటుంబీకులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పాత్రికేయులు అందరు కలిసి సిఐ సురేష్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

## అనాధ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం

### - బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ

ప్రజాభూమి, వేంపల్లె




భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిధ రాజు జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక పట్టణంలోని అమ్మ అనాధ వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సుష్మ మాట్లాడుతూ దానాలన్నింటిలో అన్నదానం మిన్న అని పేర్కొన్నారు. సేవా దృక్పథంతో జన్మదినాన్ని జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. హిందూ సంప్రదాయంలో అన్నదానం అత్యంత పవిత్రమైనదిగా భావించబడుతుందని, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం ద్వారా ఆత్మసంతృప్తి కలుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులు, బీజేపీ నాయకులు నిషిధ రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆమెకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సౌభాగ్య, బీజేపీ వాణిజ్య విభాగం విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇకపై పెట్రోల్ కొరత వుండదు-

### వినియోగదారులు ఆందోళన చెందవద్దు:తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరి..!

ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:



ఇకపై పెట్రోల్ కొరత వుండదని తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరి అన్నారు. జిల్లా కలెక్టర్ , జేసి , ఆర్డీవో పెట్రో కంపెనీల డీలర్స్ తో సమావేశమై సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. పెట్రోల్ కొరత కారణంగా వినియోగదారులు ఇబ్బంది పడకూడదని సోమవారం మండలంలోని 8 పెట్రోల్ బంకులను తనిఖీ చేయడం జరిగిందని అన్నారు. గత కొద్ది రోజులుగా పెట్రోల్ కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వినియోగదారులు ఒక్కసారిగా పెద్ద మొత్తంలో నింపుకునేందుకు పెట్రోల్ కోసం క్యూ కట్టడంతో కొరత ఏర్పడినట్లు తెలిపారు. సోమవారం మండలంలోని అన్ని పెట్రోల్ బంకులకు స్టాకు పూర్తి స్థాయిలో పెట్రోల్ సరఫరా చేయబడిందని అన్నారు. ఇకపై పెట్రోల్ గురించి వినియోగదారులు ఆందోళన చెందవద్దన్నారు. ఎవరైనా పెట్రోల్ బంకుల నిర్వహకులు పెట్రోల్, డీజిల్ పై కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా క్యాన్లకు, బాటిల్స్ కు పెట్రోల్ నింపవద్దని తేల్చి చెప్పారు.

## టైలర్ గంగాధర్ కు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాభూమి, హిందూపురం టౌన్



తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు టైలర్ గంగాధర్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న మంగళవారం గంగాధర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న టైలర్ గంగాధర్ మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేశారు. అదేవిధంగా బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శివరామ కృష్ణ, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, వివిధ రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. కాగా లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ఉదయ్ కుమార్, ముస్లిం నగర చైర్మన్ ఉమర్ ఫరూక్ లకు గంగాధర్ మంచి మిత్రుడు కావడంతో మంగళవారం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోశారు.

## దోమల బెడద... రోగాలతో దడ

ప్రజాభూమితొండూరు: లక్షలు ఖర్చు చేస్తున్నాం,పారిశుద్ధ్యం మెరుగుపరిచాం అని అధికారులు చెబుతున్నా,తొండూరు మండలం అగడూరు గ్రామంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మురుగు కాల్వలు పూడికతో నిండి,వ్యర్థాలు సకాలంలో తొలగించకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దోమల బెడదతో గ్రామస్థులు రోగాల బారిన పడి దడదడలాడుతున్నారు.



క్షేత్రస్థాయిలో దారుణం : గ్రామంలోని ప్రధాన వీధుల్లో మురుగు కాల్వలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. నీరు నిలిచిపోయి దోమలకు ఆవాసంగా మారాయి. సాయంత్రం 6 దాటితే చాలు ఇంట్లో దోమలవోత. "పిల్లల్నిబయట ఆడనివ్వలేకపోతున్నాం. రాత్రిళ్లు నిద్ర ఉండట్లేదు. డెంగీ వస్తుందేమోనని భయంగా ఉంది" అని గ్రామంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్షలు ఖర్చు... ఫలితం సున్నా :పారిశుద్ధ్య నిర్వహణ పేరుతో మండల అధికారులు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్టు రికార్డుల్లో చూపిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మురుగు సమస్య తీరకపోవడంతో ఆ ఖర్చంతా వృథా అయ్యిందని గ్రామస్థులు మండిపడుతున్నారు.

## నిత్యాన్నదాత డొక్కా సీతమ్మకు ఘన నివాళి

### - మధ్యాహ్న భోజన పథకానికి సీతమ్మ పేరు పెట్టడం అభినందనీయం - జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్

ప్రజాభూమి, వేంపల్లె




పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నేత దాసరి రవిశంకర్ ఆధ్వర్యంలో స్థానిక పట్టణంలోని ఆయన కార్యాలయంలో నిత్యాన్నదాతగా, అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం గా పేరు పెట్టడం అభినందనీయమన్నారు. గోదావరి జిల్లాల్లోని పలు గ్రామాలకు తరచూ వెల్లి వరదలు, అనావృష్టి వంటి విపత్తుల సమయంలో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు డొక్కా సీతమ్మ అన్నదానం చేసి ఆదుకున్న మహానుభావురాలని కొనియాడారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కన్నా గొప్ప దానం లేదనే సందేశాన్ని ఆమె తన జీవితంతో చాటి చెప్పారని తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అనే భారతీయ సంప్రదాయాన్ని ఆచరణలో చూపిన మహనీయురాలు డొక్కా సీతమ్మ అని పేర్కొన్నారు. ఆమె జీవితం అన్నదానం గొప్పతనానికి నిలువెత్తు నిదర్శనమని దాసరి రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నకృష్ణ రెడ్డి, మత్తయ్య, కృష్ణ, గంగన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

## విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్యపై ఇనుప పాదం మోపాలి

### టీడీపీ నేత కొమరా వెంకట నరసయ్య



ప్రజాభూమి, ఒంటిమిట్ట: చిత్తూరు జిల్లాలో ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యను టీడీపీ సీనియర్ నాయకులు కొమరా వెంకట నరసయ్య తీవ్రంగా ఖండిస్తూ, నిందితులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుల పట్ల మెతక వైఖరి వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని హెచ్చరించిన ఆయన, మృతుడి కుటుంబానికి యాజమాన్యం కోటి రూపాయలు, ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# జిల్లాలో సాధారణ స్థితికి పెట్రోల్, డీజిల్ కు సరఫరా..

**ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పెట్రోల్ డీజిల్ సరఫరా పర్యవేక్షణ..**
**వినియోగదారుల అవసరాలకు అందుబాటులో పెట్రోల్ డీజిల్..**
**జిల్లాలో ప్రతి రోజు 8 లక్షల డీజిల్ 6 లక్షల పెట్రోల్ సరఫరా..**
**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుందని ప్రస్తుతం ఎటువంటి కొరత లేకుండా ఇంధనం సమృద్ధిగా అందుబాటులో ఉందని వినియోగదారులు ఎటువంటి అందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో పెట్రోల్ డీజిల్ సరఫరా పై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పర్యవేక్షణ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిడమానూరులో హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఒసిఎల్ బంకులను ఎనికెపాడులోని హెచ్‌పిసిఎల్ బంకును రామవరప్పాడులోని ఐఒసిఎల్ బంకు ల లో పెట్రోల్ డీజిల్ నిల్వలు సరఫరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వదంతుల కారణంగా పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పాటుడుందనే అపోహల తో వినియోగదారులు బయాందోళనలకు గురై అవసరాలకు మించి డీజిల్ పెట్రోల్ కొనుగోళ్ళు చేయడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురయ్యాయన్నారు. డీజిల్ పెట్రోల్ సజావుగా వినియోగదారులకు అందజేసేలా చర్యలు తీసుకో వాలని ముఖ్య మంత్రి సూచనల మేరకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యల కార ణంగా పెట్రోల్ డీజిల్ సరఫరా సాధారణ స్థితికి చేరుకోవడం జరిగిందన్నారు. ఇంధన సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లాలోని పెట్రోల్ బంక్‌ల వద్ద సరఫరా పరిస్థితిని క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్, డీజిల్ సరఫరా కొనసాగుతున్నదని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. అపోహలు, అసత్య ప్రచారాలను నమ్మకుండా అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రతి రోజు సుమారు 8 లక్షల లీటర్ల డీజిల్, 6 లక్షల లీటర్ల పెట్రోల్ సరఫరా జరుగుతోందని కలెక్టర్ వెల్లడించారు. ఆయిల్ కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెవెన్యూ పోలీస్ వ్యవసాయ తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, ఎక్కడా ఇంధన కొరత ఏర్పడకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారన్నారు. ఈకారణంగా పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్‌లలో వాహనాలు నిలబడాల్సిన అవసరం లేకుండా తక్షణమే ఆయిల్ పొందగలుగుతున్నారన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కంపెనీలలో పెట్రోల్ డీజిల్ అవసరాల మేరకు నిల్వలతో సిద్దంగా ఉన్నాయని తెలిపారు. బంకులలో ఆయిల్ అయిపోయిన రెండు గంటలలోపే ట్యాంక ర్లతో ఆయిల్ సరఫరా చేసేలా మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, అవసరానికి తగినంత మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో ఇంధన సరఫరా పూర్తిగా నియంత్రణలో ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం, ఆయిల్ కంపెనీలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంధన సరఫరాపై ఎలాంటి సమ స్యలు ఎదురైనా సంబంధిత అధికారులకు తెలియ జేయాలని, ఇందుకోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని వినియోగదారులకు ఇబ్బంది తలెత్తిన పక్షంలో 91549 70454 నందు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. ఆయిల్ బంకుల పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ వెంట విజయవాడ రూరల్ తహాశీల్దార్ బి. సుగుణ, రెవెన్యూ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పదోన్నతుల పండుగ జెడ్పీ సిబ్బందికి చైర్‌పర్సన్ ఉప్పల హారిక వరాల జల్లు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరింది. జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పల హారిక సారథ్యంలో మంగళవారం భారీ ఎత్తున పదోన్నతులు మరియు కారుణ్య నియామక ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగింది.పదోన్నతుల వివరాలుమొత్తం 12 మంది సిబ్బందికి వారి సర్వీసును గుర్తించి ఉన్నత స్థానాలకు పదోన్నతి కల్పించారుసీనియర్ అసిస్టెంట్‌లుగా జూనియర్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్న 06 గురు సిబ్బందికి సీనియర్ అసిస్టెంట్‌లుగా ప్రమోషన్ లభించింది.జూనియర్ అసిస్టెంట్‌లుగా రికార్డు అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్ మరియు లైబ్రరీ అసిస్టెంట్ కేడర్‌లలో ఉన్న 06 గురు సిబ్బందిని జూనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.



కారుణ్య నియామకాలు - ఆ కుటుంబాలకు భరోసాకుటుంబ పెద్దను కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న 12 మంది నిరుద్యోగులకు కారుణ్య నియామక పథకం కింద జిల్లా పరిషత్ అండగా నిలిచింది05 గురుకు జూనియర్ అసిస్టెంట్‌లుగా..07 గురుకు టైపిస్ట్‌లుగా నియామక పత్రాలను అందజేశారు.ముఖ్య అతిథుల సమక్షంలో..చైర్‌పర్సన్ ఉప్పల హారిక తన చేతుల మీదుగా లబ్ధిదారులకు ఈ ఉత్తర్వులను అందజేస్తూ, బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జె. అరుణ (ముఖ్య కార్యనిర్వహణాధికారి - సీఈవో) ఆర్.సి. ఆనంద్ కుమార్ (ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి - డిప్యూటీ సీఈవో )ఎస్టాబ్లిష్మెంట్ పరిపాలనాధికారి మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి హత్య హేయం

**బాధ్యులను కఠినంగా శిక్షించాలి..ఏపీయూడబ్ల్యూజే డిమాండ్**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి



చిత్తూరు జిల్లా వీ.కోటలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్యను ఏపీయూడబ్ల్యూజే కృష్ణా జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందమామ బాబు స్పందిస్తూ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రధాన డిమాం డ్లు మాఫియాపై ఉక్కుపాదం గంధం మాఫియా అక్రమాలను వెలుగులోకి తెచ్చినందుకే జగన్మోహన్ రెడ్డిని టార్గెట్ చేశారని, ఈ హత్యపై లోతైన దర్యాప్తు జరిపి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు.జర్నలిస్టుల రక్షణ చట్టం మీడియా స్వేచ్ఛను కాపాడటానికి మరియు విలేకరులపై దాడులను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలి. ప్రాణాలు కోల్పోయిన విలేకరి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టుల ప్రాణాలకు రక్షణ లేకపోతే ప్రజాస్వామ్యానికి మనుగడ ఉండదు. జగన్మోహన్ రెడ్డి హత్యకు కారకులైన వారిని వదిలిపెట్టకూడదు అని ఏపీడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందమామ బాబు తెలిపారు.

## పెట్రోల్, డీజిల్ కష్టాలకు ఎండ్ కార్డ్

**రేపటికల్లా సాధారణ స్థితి**

**ప్రజలు ఆందోళన చెందవద్దు.. నిల్వలు పుష్కలంగా ఉన్నాయి: ఎంపీ బాలశౌరి**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి




రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా పెట్రోల్, డీజిల్ సరఫరాలో తలెత్తిన తాత్కాలిక ఇబ్బందులు తొలగిపోయాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మచిలీపట్నం ఎంపీ, పెట్రోలియం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మెంబర్ వల్లభనేని బాలశౌరి భరోసా ఇచ్చారు. చమురు సంస్థల ఛైర్మన్లతో చర్చలుసరఫరాలో జాప్యంపై ఎంపీ బాలశౌరి వెంటనే స్పందిస్తూ.. ఐ ఓ సి ఎల్ ఛైర్మన్ అరవిందర్ సింగ్ షాని, బిపిసిఎల్ ఛైర్మన్ సంజయ్ ఖన్నా, హెచ్పీసీఎల్ ఛైర్మన్ వికాస్ తదితరులతో నేరుగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సరఫరాను వేగవంతం చేయాలని కోరగా, నేడు, రేపటిలోగా సరఫరా గణనీయంగా పెరుగుతుందని వారు హామీ ఇచ్చారు.ముఖ్యమంత్రి చొరవ - 90% సమస్య పరిష్కారంముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర పెట్రోలియం శాఖతో జరిపిన చర్చల ఫలితంగా ఇప్పటికే 90% సమస్య పరిష్కారమైంది.యుద్ధ పరిణామాల వల్ల ప్రైవేట్, మైనింగ్ ఆపరేటర్లు రిటైల్ అవుట్‌లెట్లపై ఆధారపడటంతో కొంత ఒత్తిడి పెరిగింది.ప్రభుత్వం తీసుకున్న నిర్దిష్ట పరిమితుల నిర్ణయంతో పరిస్థితి ఇప్పటికే అదుపులోకి వచ్చింది.చమురు సంస్థలు, ప్రభుత్వం నిరంతరం సమన్వయంతో పనిచేస్తున్నాయి. యుద్ధ మేఘాల నేపథ్యంలో తలెత్తిన ఈ చిక్కులు తాత్కాలికమే. రేపటికల్లా రాష్ట్రవ్యాప్తంగా సాధారణ సరఫరా పునరుద్ధరించబడుతుంది. ప్రజలు అపోహలకు లోనై అనవసరంగా స్టాక్ చేసుకోవద్దు అని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ఒక ప్రకటనలో తెలిపారు.



## పోలవరం ప్రాజెక్ట్ లో మట్టి , రాతి నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

ప్రజాభూమి ప్రతినిధి,పోలవరం:

పోలవరం ప్రాజెక్ట్ లో కేంద్ర మట్టి, పదార్థాల పరిశోధనా సంస్థ (సిఎస్‌ఎంఆర్‌ఎస్ ) బృందం మంగళవారం పరీక్షలు నిర్వహించింది. ఈ బృందంలో మట్టి, రాతి నాణ్యతా నిపుణులు అన్వేష్. గౌరవ్ పాండే , ఉదయ్ చక్రవర్తి, హరీందర్ సింగ్ ప్రకాష్ ఉన్నారు. ఇటీవలనే ప్రాజెక్ట్ నిర్మాణంలో ఉపయోగిస్తున్న కాంక్రీట్ ను సి ఎస్ ఎం ఆర్ ఎస్ బృందం పరిశీలించిన సంగతి తెలిసిందే. పోలవరం ప్రాజెక్ట్ లో ఈ సీ ఆర్ ఎఫ్ నిర్మాణానికి వినియోగిస్తున్న రాళ్లు మట్టిని ఈ బృందం సభ్యులు పరిశీలించారు. పోలవరం ప్రాజెక్ట్ లో ఈ సి ఆర్ ఎఫ్ తో పాటు పలు కీలక నిర్మాణాల్లో రాళ్లు, మట్టిని వినియోగిస్తున్న విషయం తెలిసిందే. జలవనరుల శాఖ ఎస్ ఈ రామచంద్ర రావు, ఈఈ డి శ్రీనివాస్, , ఎం ఈ ఐ ఎల్ జిఎం గంగాధర్, డీజీఎం మురళి పమ్మి, నాణ్యతా విభాగం డీజీఎం శంకరయ్య శాస్త్రవేత్తలకు అవసరమైన వివరాలు అందించారు. నాణ్యతా పరీక్షలను పరిశీలించారు. పోలవరం ప్రాజెక్ట్ లో వినియోగించే మట్టి, రాయి నిల్వ ఉన్న ప్రాంతాలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. అక్కడ నమూనాలు సేకరించి ప్రాజెక్ట్ ఆవరణలోని ల్యాబ్ లో పరీక్షలు నిర్వహించింది. నాణ్యత పట్ల తమ సంతృప్తిని వ్యక్తం చేసింది. కొంత మట్టిని తమ కేంద్ర పరిశోధనాలయంలో పరీక్షించేందుకు సేకరించింది. గ్యాప్ 1లో మట్టి, రాళ్ళ నాణ్యతను బృందం పరిశీలించింది. అదేవిధముగా ఇప్పటి వరకు గ్యాప్ 1లో జరిగిన పనుల్లో వినియోగించిన మట్టి, రాళ్లకు రింగ్ టెస్ట్ ను వీరు నిర్వహించారు.గ్యాప్ 1, 2 లో వినియోగిస్తున్న మట్టి, రాళ్లు, ఇసుక నాణ్యతను కూడా ఈ బృందం పరీక్షించింది. కొత్తూరులో పోలవరం ప్రాజెక్టులో వినియోగించేందుకు సిద్ధం చేసిన మట్టి నమూనాలను వీరు సేకరించారు. స్థానికంగా పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ మట్టిని కొంత తమ వెంట ఢిల్లీ తీసుకెళ్లి అక్కడ పరీక్షలు నిర్వహించనున్నారు. వీరి వెంట జలవనరుల శాఖ నాణ్యతా విభాగం అధికారులు జాన్ , రవికుమార్ తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో ముగిసిన రక్షకుడైన యేసు క్రీస్తు ప్రార్థన మందిర ఉజ్జీవ కూడికలు

మచిలీపట్నం ప్రజాభూమి రూరల్



మచిలీపట్నం మండల పరిధిలోని జొన్నలవారి మోడీ గ్రామంలో రక్షకుడైన యేసు క్రీస్తు ప్రార్థన మందిర సంఘ ఉజ్జీవ కూడికలు పాస్టర్ జొన్నల సురేష్ బాబు ద్వారా నిర్వహించిన ఈ ఉజ్జివ కూడికలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రత్యేక ప్రార్థనల ముగింపు రోజున భక్తులు అనేకమంది తరలివచ్చారు విజయవాడ దైవజనుల ప్రత్యేక సందేశంఈ ముగింపు సభకు విజయవాడ నుండి విచ్చేసిన ప్రముఖ దైవజనులు డేవిడ్ బ్రెన్ హం ప్రత్యేక వర్తమానాన్ని అందించారు. బైబిలు గ్రంథంలోని నీ క్రియలను నేను ఎరుగుదును జీవించుచున్నానని పేరున్నది గాని నీవు మృతుడవే అనే అంశంపై ఆయన లోతైన ప్రసంగం చేశారు. విశ్వాసులు తమ ఆధ్యాత్మిక జీవితంలో కేవలం పైకి కనిపించే భక్తి కాకుండా, క్రియలతో కూడిన నిజమైన జీవం కలిగి ఉండాలని ఆయన హితవు పలికారు. అత్యంత సరళమైన రీతిలో, ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా ఆయన అందించిన దైవ సందేశం భక్తులను ఎంతగానో ఆలోచింపజేసింది.ఆశీర్వాదకరంగా ముగింపుముగింపు రోజు కావడంతో స్థానిక గ్రామాల నుండే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుండి కూడా అనేకమంది భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఉజ్జీవ కూడికల ద్వారా దేవుని కృపను, ఆశీర్వాదాలను పొందామని విశ్వాసులు ఆనందం వ్యక్తం చేశారు. సంఘ నిర్వాహకులు కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రార్థనల అనంతరం ప్రేమ విందు భక్తులందరికీ ఏర్పాటు చేశారు .



## మునగచర్ల దాహార్తికి ముగింపు

**కృష్ణా నీటితో శాశ్వత పరిష్కారం**



**ఎంపీ నిధులతో రూ.40 లక్షల పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన**

**ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది**

ప్రజాభూమి నందిగామ:

నందిగామ మండలం మునగచర్ల గ్రామంలో ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతుండగా నేటితో శాశ్వత పరిష్కారం దిశగా అడుగు పడింది. మంగళవారం నాడు రూ.40 లక్షల ఎంపీ నిధులతో కృష్ణా నది నుంచి మునగచర్ల గ్రామానికి మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని), ఉమ్మడి కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, విజయ డైరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, తదితర కూటమి నేతలతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు.

## డీజిల్, పెట్రోల్‌పై ఆ పార్టీ పుకార్లతో ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోంది

**ఆ పార్టీ నాయకులు నెగటివ్ ప్రచారంతో ప్రభుత్వంపై అపోహలు కల్పించే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపణ**

**ఆర్సెలర్ మిట్టల్, రిలయన్స్ వంటి సంస్థలు పెట్టుబడులు, గూగుల్ త్వరలో ప్రారంభం**



**రూ.9.8 లక్షల కోట్ల పెట్టుబడులు ఇప్పటికే పురోగతిలో ఉన్నాయని స్పష్టం**

**డీజిల్ కొరత వార్తలు పుకార్లేనని, తాత్కాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు**

**ఆయిల్ కంపెనీలతో సమన్వయం ద్వారా సరఫరా మెరుగుదలకు కృషి**

ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:

రాష్ట్రంలో బాధ్యతాయుతమైన ప్రతిపక్షం లేకపోవడం వల్ల ప్రజల్లో లేనిపోని అపోహలు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి విమర్శించారు. కృష్ణా జిల్లా పామర్రు మండలం కారకంపాడు గ్రామంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి కొలుసు పార్థ సారథి మాట్లాడుతూ, ఆ పార్టీ నాయకులు నెగటివ్ ప్రచారం ద్వారా ప్రభుత్వంపై అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రం లో పెట్టుబడుల వెల్లువలా వచ్చి పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు.రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని, ఆర్సెలర్ మిట్టల్, రిలయన్స్ వంటి సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. గూగుల్ సంస్థ కూడా త్వరలో కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే రూ.9.8 లక్షల కోట్ల పెట్టుబడులు పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశారు.డీజిల్ కొరతపై వస్తున్న వార్తలు పుకార్లేనని పేర్కొంటూ, కొన్ని జిల్లాల్లో తాత్కాలిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంటోందన్నారు. పానిక్ పర్చేస్‌ల వల్ల కొంత ఒత్తిడి ఏర్పడిందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. ఆయిల్ కంపెనీలతో సమన్వయం చేస్తూ సరఫరా మెరుగుపరుస్తున్నామని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిరోజూ డీజిల్, పెట్రోల్ పై పరిస్థితిని సమీక్షిస్తున్నారని, రైతులు, ఆక్వా రంగానికి ఎటువంటి డీజిల్ కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. స్టాక్ అవుట్ పెట్రోల్ బంకుల సంఖ్య తగ్గుతూ, పరిస్థితి త్వరలో సాధారణమవుతుందని పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి ప్రాధాన్యత రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ధాన్యం చెల్లింపులు 24 నుంచి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వెల్లడించారు. మొక్కజొన్న రైతుల సమస్యను కేంద్రానికి తెలియజేసినట్టు, స్పందన వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధరల స్థిరీకరణ నిధి కింద రూ.800 కోట్లు ఖర్చు చేసి రైతులకు అండగా నిలిచినట్లు తెలిపారు. పొగాకు, కోకో, మామిడి వంటి పంటలకు మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా మద్దతు ధర అందిస్తున్నామని వివరించారు.నీటిపారుదల వ్యవస్థ అభివృద్ధిడ్రైనేజీ, ఇరిగేషన్ వ్యవస్థలను మెరుగు పరచడానికి O&M నిధులు కేటాయించి టెండర్ల ద్వారా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు.పెట్రోల్ బంకుల్లో కొరత ఉందన్న వార్తలను ఖండిస్తూ, ఎక్కడా నిల్వల కొరత లేదని స్పష్టం చేశారు. ధరలు అంతర్జాతీయ మార్కెట్ మరియు కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆధారపడి ఉంటాయని తెలిపారు. విలేకరి ఘటనపై ఖండన చిత్తూరు జిల్లా వి.కోటలో ఎబిఎన్ ఆంధ్రజ్యోతి విలేకరిపై జరిగిన దాడిని మంత్రి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, వారిపై దాడులు చేయడం అనాగరికమని పేర్కొంటూ బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. ప్రజలకు విజ్ఞప్తి: పెట్రోల్, డీజిల్ విషయాల్లో పుకార్లను నమ్మకుండా, పానిక్ పర్చేస్‌లు చేయవద్దని మంత్రి కొలుసు పార్థ సారథి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ సరఫరాను నిరంతరం కొనసాగించే చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

## ఎస్సీ రుణ గ్రహీతలకు బంపర్ ఆఫర్ వడ్డీ మొత్తం మాఫీ

**ఏప్రిల్ 30లోగా అసలు చెల్లిస్తేనే అవకాశం**

**రెండు రోజులే గడువు**

**కృష్ణా జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జి.రమేష్ వెల్లడి**

మచిలీపట్నం /ప్రజాభూమి ప్రతినిధి

జిల్లాలోని ఎన్ ఎస్ ఎఫ్ డి సి మరియు ఎన్ ఎస్ కె ఎఫ్ డిసి పథకాల ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించింది. బకాయి పడిన అసలు మొత్తాన్ని చెల్లించిన వారికి వడ్డీని పూర్తిగా మాఫీ చేయాలని నిర్ణయించింది.

ఈ మేరకు కృష్ణా జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ (ఎస్సీ కార్పొరేషన్) కార్యనిర్వాహక సంచాలకులు ఈడి జి.రమేష్ ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కీలక అంశాలువడ్డీ రద్దు: 31-12-2025 నాటికి రుణ ఖాతాల్లో పేరుకుపోయిన వడ్డీని ప్రభుత్వం పూర్తిగా రద్దు (వడ్డీ మాఫీ) చేస్తుంది.అసలు చెల్లింపు ఈ లబ్ధిని పొందాలనుకునే వారు తమ బకాయి ఉన్న అసలు మొత్తాన్ని ఈనెల 30-04-2026 లోపు ఖచ్చితంగా చెల్లించాల్సి



ఉంటుంది.చివరి తేదీ ఈ పథకం వర్తించడానికి ఏప్రిల్ 30 ఆఖరి తేదీ. ఆ తర్వాత ఈ సదుపాయం రద్దు చేయబడుతుంది. తదుపరి రుణ గ్రహీతలు అసలుతో పాటు వడ్డీని కూడా పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది.నిరుపేదలకు గొప్ప అవకాశంఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (G.O. Rt. No. 319) ద్వారా కల్పించిన ఈ అద్భుతమైన అవకాశాన్ని జిల్లాలోని నిరుపేద ఎస్సీ లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలని ఈడీ కోరారు. నిర్ణీత గడువులోగా అసలు చెల్లించి రుణ విముక్తి పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.గుర్తుంచుకోండిగడువు తేదీ: 30-04-2026 (కేవలం రెండు రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి).వివరాల కోసం మచిలీపట్నంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని సంప్రదించగలరు అని ఒక ప్రకటనలో తెలియజేశారు.

Printed by MK PUBLICATIONS AND OFFSET PRINTERS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at visakhapatnam and published at D. No.k31-27-31/3,opposite pavanpublic school,duvvada station road,kurmnnapalem, visakhapatnam, editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1888.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 14

బుధవారం 29, ఏప్రిల్ 2026

## ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాన్ని పరిశీలించిన జనసేన బృందం.



ప్రజాభూమి ప్రతినిధి–వి.ఆర్.పురం.

జనసేన పార్టీ వి.ఆర్.పురం మండల నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. రాజుపేటకాలనీ గ్రామ శివారులో గల చెరువులో పనిచేస్తున్న ఉపాధి హామీ కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారు పాటించవలసిన నియమ నిబంధనలు, ఎండలను దృష్టిలో ఉంచుకొని పని వేళలు మరియు మరికొన్ని వెసులు బాటులు కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. ప్రతి ఉపాధి హామీ కార్మికులు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ మరియు పై స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకుంటే ఉపాధి హామీ కార్మికులతో పాటు ప్రతి రైతుకి న్యాయం చేసిన వాళ్ళు అవుతారని అన్నారు. ముందుగానే ఫీల్డ్ లో ఉన్న జే.ఈ వెంకటేశ్వరరావుతో పలు అంశాలపై చర్చించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో బాధ్యత రాహిత్యంగా పనులు జరుగుతున్నాయని, కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తునరాని వారిపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, మహిళా అధ్యక్షురాలు బాగుల ప్రమీళా రాణి, కార్యదర్శి బాగుల అంజన రావు, మండల యూత్ ప్రెసిడెంట్ పెదపెట్ల పవన్ కళ్యాణ్, ఉపాధి హామీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు

### మంత్రి కందుల దుర్గేష్

### మంత్రి దుర్గేష్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిఎస్పీలు జీవన, శివప్రియ



ప్రజా భూమి ప్రతినిధి–రాజమహేంద్రవరం

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ ని మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని వారి క్యాంపు కార్యాలయంలో నార్త్ జోన్, సౌత్ జోన్ డిఎస్పీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన నార్త్ జోన్ డిఎస్పీ సి. హెచ్. జీవన, సౌత్ జోన్ డిఎస్పీ ఏ. శివప్రియలు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధికారులకు మంత్రి దుర్గేష్ అభినందనలు తెలుపుతూ, విధి నిర్వహణలో పాటించాల్సిన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. నగరంలో శాంతిభద్రతలను అదుపులో ఉంచాలని, అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ ప్రజలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని మంత్రి సూచించారు. ప్రజలతో మమేకమవుతూ, 'ఫ్రెండ్లీ పోలీసింగ్' విధానంలో బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో, సమర్థవంతంగా నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు తమ పరిధిలోని భద్రతా అంశాలను మంత్రికి వివరించారు. చివరగా డిఎస్పీలకు మంత్రి కందుల దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లాలో విద్యుత్ సమస్యలు పై సంప్రదించండి

### –ఎస్ఈ పి.సాల్మన్ రాజు.

ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా



ప్రస్తుత వేసవిలో ఎటువంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ ను సరఫరా చేస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణి సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ పి.సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వేసవి కాలంలో అవసరమైనంత విద్యుత్ అందుబాటులో ఉందని, ఎటువంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా సాధారణంగా కొనసాగుతోందన్నారు. ఏదైనా విద్యుత్ అవాంతరాలు లేదా సమస్యలు తలెత్తిన పక్షంలో వినియోగదారులు తమ సమీప ఎ.ఇ. కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, లేదా 1912 టోల్ ఫ్రీ నంబర్కు సమాచారం అందించవచ్చన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఎస్ ఈ / ఎలక్ట్రికల్ (ఏలూరు): 9440812702, ఈ ఈ (ఏలూరు ): 944081270 4, ఈ ఈ (జంగారెడ్డిగూడెం): 9491049797, సిపిడిసిఎల్ ( నూజివీడు): 9440811746, సిపిడిసిఎల్ (కైకలూరు): 9440812366 నంబర్లకు తెలియజేస్తే పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటారని సాల్మన్ రాజు తెలియజేసారు.

## నాదెండ్ల భాస్కరరావు చిత్రపటానికి ఎంపీ వల్లభనేని బాలశౌరి నివాళి



ప్రజాభూమి ప్రతినిధి–మచిలీపట్నం

హైదరాబాద్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నాదెండ్ల భాస్కరరావు కి మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ఘన నివాళులర్పించారు. మంగళవారం హైదరాబాద్‌లోని భాస్కరరావు నివాసానికి వెళ్లిన ఎంపీ, అక్కడ ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

### మనోహర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

అనంతరం, భాస్కరరావు కుమారుడు, రాష్ట్ర ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ని బాలశౌరి పరామర్శించారు. తండ్రిని కోల్పోయిన దుఃఖంలో ఉన్న మనోహర్ ని, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. భాస్కరరావు ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని, వారి మరణం రాష్ట్రానికి తీరని లోటని ఈ సందర్భంగా ఎంపీ పేర్కొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## జిల్లాలో సాధారణ స్థితికి పెట్రోల్, డీజిల్‌కు సరఫరా

- ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పెట్రోల్ డీజిల్ సరఫరా పర్యవేక్షణ..
- వినియోగదారుల అవసరాలకు అందుబాటులో పెట్రోల్ డీజిల్..
- జిల్లాలో ప్రతి రోజు 8 లక్షల డీజిల్ 6 లక్షల పెట్రోల్ సరఫరా..
- జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ

ప్రజా భూమి ప్రతినిధి–విజయవాడ

జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుందని ప్రస్తుతం ఎటువంటి కొరత లే కుండా ఇంధనం సమృద్ధిగా అందుబాటులో ఉందని వినియోగదారులు ఎటువంటి అందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో పెట్రోల్ డీజిల్ సరఫరా పై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ మం గళవారం ఉదయం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పర్యవేక్షణ నిర్వహించి అధికారులకు పలు సూచన లు చేశారు. అనంతరం నిడమానూరులో హెచ్‌పిసి ఎల్, బిపిసిఎల్, ఐఓసిఎల్ బంకులను ఎనికెపాడు లోని హెచ్‌పిసిఎల్ బంకును రామవరప్పాడులోని ఐఓసిఎల్ బంకులలో పెట్రోల్ డీజిల్ నిల్వలు సరఫరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వదంతుల కారణంగా పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పాటుడుందనే అపోహలతో వినియోగదారులు బయాందోళనలకు గురై అవసరాలకు మించి డీజిల్ పెట్రోల్ కొనుగోళ్ళు చేయడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురయ్యాయన్నారు. డీజిల్ పెట్రోల్ సజావుగా వినియోగదారులకు అందజేసేలా చర్యలు తీసుకోవా లని ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా యం త్రాంగం తీసుకున్న చర్యల కారణంగా పెట్రోల్ డీజిల్ సరఫరా సాధారణ స్థితికి చేరుకోవడం జరి గిందన్నారు. ఇంధన సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లాలోని పెట్రోల్ బంక్‌ల వద్ద సరఫరా పరిస్థి తిని క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్, డీజిల్ సరఫరా కొనసాగుతున్నదని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. అపోహలు, అస త్య ప్రచారాలను నమ్మకుండా అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రతి రోజు సుమారు 8 లక్షల లీటర్ల డీజిల్, 6 లక్షల లీటర్ల పెట్రోల్ సరఫరా జరుగుతోందని కలెక్టర్ వెల్లడించారు. ఆయిల్ కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు. రెవెన్యూ పోలీస్ వ్యవసాయ తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా




ఉండి, ఎక్కడా ఇంధన కొరత ఏర్పడకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారన్నారు. ఈకారణంగా పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్‌లలో వాహనాలు నిలబడాల్సిన అవస రం లేకుండా తక్షణమే ఆయిల్ పొందగలుగుతున్నారన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కంపెనీలలో పెట్రోల్ డీజిల్ అవసరాల మేరకు నిల్వలతో సిద్దంగా ఉన్నాయని తెలిపారు. బంకులలో ఆయిల్ అయిపోయిన రెండు గంటల లోపే ట్యాంకర్లతో ఆయిల్ సరఫరా చేసేలా మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, అవసరానికి తగినంత మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో ఇంధన సరఫరా పూర్తిగా నియంత్రణలో ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం, ఆయిల్ కంపెనీలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంధన సరఫరాపై ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారు లకు తెలియజేయాలని, ఇందుకోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని వినియోగ దారులకు ఇబ్బంది తలెత్తిన పక్షంలో 91549 70454 నందు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. ఆయిల్ బంకుల పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ వెంట విజయవాడ రూరల్ తహాశీల్దార్ బి. సుగుణ, రెవెన్యూ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భారతదేశ డిజిటల్ ప్రయాణంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది

- మన భవిష్యత్ నిర్మించడానికి వైజాగ్ సిద్ధంగా ఉంది
- 2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా విశాఖను తీర్చిదిద్దుతాం
- పదేళ్లలోనే విశాఖ శరవేగంగా అభివృద్ధి సాధిస్తుంది
- అద్భుతమైన ప్రయాణానికి ఇది ఆరంభం మాత్రమే
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే మా ధ్యేయం
- విశాఖ నోవాటెల్ హోటల్ లో జరిగిన భారత్ ఏఐ శక్తి కాంక్లేవ్ లో మంత్రి నారా లోకేష్

ప్రజాభూమి ప్రతినిధి–విశాఖపట్నం

కేవలం విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రారంభం మాత్రమే కాదని, భారతదేశ డిజిటల్ ప్రయాణంలో నూతన అధ్యాయానికి నాంది అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 'భారతదేశ ఏఐ కారిడార్ ను ఉమ్మడిగా నిర్మించడం అనే అంశంపై' గూగుల్ ఆధ్వర్యంలో విశాఖ నోవాటెల్ హోటల్ లో జరిగిన భారత్ ఏఐ శక్తి కాంక్లేవ్ లో మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారతదేశ డిజిటల్ ప్రయాణంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. అదేవిధంగా మన ఆంధ్రప్రదేశ్ కు ఇది కీలకమైన మలుపు. విశాఖపట్నం.. మనం ప్రేమగా వైజాగ్ అని పిలిచే ఈ నగరం సాధారణ నగరం కాదు. దశాబ్దాలుగా ఇది భారతదేశానికి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. భారతదేశంలోని ఖనిజ సంపదను ప్రపంచానికి అనుసంధానించింది. ఈ నగరం ఉక్కుతో నిర్మితమైంది. కానీ ఈ రోజు మనం విశాఖ పునాదులను ఏఐ విప్లవం పై నిర్మించబోతున్నాం. విశాఖ మన దేశ భవిష్యత్తును నిర్మించబోతోందని నేను బలంగా విశ్వసిస్తున్నాను.

**విశాఖపట్నం వేగంగా అభివృద్ధి చెందుతుంది**

మనం ఈ రోజు ఒక చరిత్రాత్మక మలుపు వద్ద ఉన్నాం. ప్రపంచం రోజురోజుకీ మారుతోంది. ప్రపంచం భారీ పరిశ్రమల నుంచి డిజిటల్ మౌలిక సదుపాయాల వైపు, తయారీ నుంచి మెషిన్ ఇంటెలిజెన్స్ వైపు మారుతోంది. ఈ ప్రయాణంలో వైజాగ్ మళ్లీ అభివృద్ధి చెందుతోంది.

గూగుల్ ఏఐ హబ్ ప్రారంభంతో ఈ మార్పును మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి 15 బిలియన్ డాలర్ల పెట్టబడితో పాటు ఒక గిగావాట్ డేటా సెంటర్ ఎకోసిస్టమ్ ఏర్పాటుకానుంది. ఇది సాధారణ వృద్ధి కాదు, భారీస్థాయి అభివృద్ధి. మొదటిసారి వైజాగ్ లో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. కనెక్టివిటీ విషయంలో మనం ఇతర రాష్ట్రాలతో పోటీ పడతాం. ఒకప్పుడు పోర్టులు ఈ నగరాన్ని ప్రపంచంతో కలిపినట్లే, ఈ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు డిజిటల్‌గా ప్రపంచంతో అనుసంధానం చేస్తాయి.

**అద్భుతమైన ప్రయాణానికి ఇది ఆరంభం**

ప్రపంచవ్యాప్తంగా వర్జీనియా నుంచి డబ్లిన్ వరకు డేటా సెంటర్ల ప్రభావాన్ని మనం చూశాం. కాబట్టి ఈ పెట్టుబడిని కేవలం 15 బిలియన్ డాలర్లుగా చూడకండి. ఇది ఒక బలమైన ఎకోసిస్టమ్‌కు పెట్టుబడి. ఒక అద్భుతమైన ప్రయాణానికి ఆరంభం. ఈ పెట్టుబడి వల్ల విశాఖపట్నంలో సుమారు 2 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వస్తాయి. నూతన పరిశ్రమలు కూడా ఈ ఎకోసిస్టమ్ చుట్టూ అభివృద్ధి చెందుతాయి. ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు.. ఇది ఆర్థిక అభివృద్ధికి ఒక మల్టిప్లయర్. డేటా, సంఖ్యలకంటే ఎక్కువగా వైజాగ్‌కు ఉన్న మరో బలం.. ఇక్కడి శక్తి, ప్రతిభ, ఆత్మవిశ్వాసం. 2014లో అతిపెద్ద తుఫాను విశాఖను తాకింది. చెట్లు అన్నీ నేలకూలిపోయాయి. కానీ 48 గంటల్లోనే ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారిని నవ్వుతూ ఆహ్వానించారు. ఇది ఈ నగర ప్రజల స్థైర్యానికి నిదర్శనం. దీపావళి సమయంలో అగ్నిప్రమాదాల నివారణకు టపాసులు కాల్చవద్దని చంద్రబాబు గారు పిలుపునిస్తే ఒక్కరు కూడా వాటి జోలికి వెళ్లలేదు. అదే వైజాగ్ స్ఫూర్తి, బాధ్యత. ఇది యువత ఆశయాలు కలిగిన నగరం. ఇక్కడ సృజనాత్మకత సహజం. జీవితం, పని సమతుల్యంగా ఉన్న నగరం ఇది. ఇవన్నీ వైజాగ్ ను ప్రత్యేకంగా నిలుపుతున్నాయి.

**2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా విశాఖను తీర్చిదిద్దుతాం**

2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థికవ్యవస్థగా విశాఖ ఎకనమిక్ రీజియన్ ను తీర్చిదిద్దాలనేది ప్రజా ప్రభుత్వ లక్ష్యం. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ సంస్థతో గ్రీన్ స్టీల్ సిటీకి శంకుస్థాపన చేశాం. అదేవిధంగా ఏఐ, డేటా, ఫార్మా, మెడికల్ డివైసెస్ రంగాల్లో భారీ అభివృద్ధి జరుగుతోంది. ఈ ప్రాంతం కృత్రిమ మేధ(ఏఐ), క్లీన్ ఎనర్జీ, మెడికల్ తయారీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్‌కు కేంద్రంగా మారబోతోంది. హైదరాబాద్ అభివృద్ధిని మనం అందరం చూశాం. ఒకప్పుడు సైబర్ టవర్స్ నిర్మాణానికి చంద్రబాబు గారు సంకల్పించినప్పుడు అందరూ ఎగతాళి చేశారు. కంప్యూటర్లు అన్నం పెడతాయా అని విమర్శించారు. కానీ స్పష్టమైన విజన్, పట్టుదలతో అది సాధ్యమైంది. హైదరాబాద్‌లో 30 ఏళ్లలో జరిగిన అభివృద్ధిని.. విశాఖలో వచ్చే 10 పదేళ్లలోనే సాధించాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. మా విధానం సింపుల్‌గా ఉన్నా శక్తివంతమైంది. విస్తృతి, సమగ్రత, స్వయం సమృద్ధి. పెట్టుబడులు ఆకర్షించడం మాత్రమే కాదు.. మొత్తం పరిశ్రమలను స్థాపించడం మా లక్ష్యం. గూగుల్ మాపై నమ్మకం ఉంచి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడం గొప్ప విషయం. ఇది ఇప్పుడు మీ ప్రాజెక్ట్ మాత్రమే కాదు..మన అందరి ప్రాజెక్ట్. మేం ఎంవోయూలపై కాకుండా షేక్ హ్యాండ్‌లపై నమ్మకం ఉంచుతాం. ఒకసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మా ప్రాజెక్ట్. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వచ్చాయి.

**20 లక్షల ఉద్యోగాల కల్పనే మా ధ్యేయం**

ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్రం. మేం చాలా కసితో ఉన్నాం. మమ్మల్ని ఒక స్టార్టప్‌లా చూడండి. చరిత్రలో నాలుగుసార్లు రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకోవాల్సి వచ్చింది. మొదట మద్రాస్ లో భాగంగా ఉన్నాం. తర్వాత కర్నూలు రాజధానిగా ఉన్నాం. కొన్నేళ్ల తర్వాత తెలంగాణ, ఏపీ విడిపోయాయి. అందరం కలిసి ఆనాడు హైదరాబాద్ ను అభివృద్ధి చేసుకున్నాం. తర్వాత విడిపోయాం. మాకు ఉన్న కసి, సంకల్ప బలం మమ్మల్ని ముందుకు తీసుకెళ్తోంది. అందరితో కలిసి మేం చరిత్ర సృష్టించాలనుకుంటున్నాం.

మా కేబినెట్ లో 25 మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారు. శాసనసభ్యుల్లో సగం మంది మొదటిసారిగా ఎన్నికైన వారు. మేం అందరం ఉత్సాహంతో, కసితో పనిచేస్తున్నాం. పెట్టుబడిదారులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనే మా ధ్యేయం. ఏపీ, వైజాగ్ లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గూగుల్ క్లౌడ్, గూగుల్ గ్లోబల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాష్ కోలే తో పాటు 49 కంపెనీల ప్రతినిధులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



### గండిక్షేత్రం శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం

## నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

ప్రజా భూమి ప్రతినిధి–చక్రాయపేట

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో గండిక్షేత్రంలోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం 2026--2028 సంవత్సరానికి గాను నూతన ధర్మకర్తల మండలి (పాలకమండలి) ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్‌గా కల్లూరి వెంకటస్వామి సహా పది మంది పాలకమండలి సభ్యులు, అలాగే ఎక్స్–అఫీషియో సభ్యుడిగా వర్తి కేసరి స్వామి భగవంతుని సాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకార ప్రక్రియను దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) హాజరై శ్రీ వీరాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీటెక్ రవి, టీడీపీ వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి కలిసి నూతన పాలకమండలి చైర్మన్, సభ్యులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతన పాలకమండలి సభ్యులుగా కల్లూరి వెంకటస్వామి (చైర్మన్), శ్రీనివాసులు, రామచంద్రా రెడ్డి, జయలక్ష్మీ దేవి, గణపతి రెడ్డి, రామతులసి, లావణ్య, సునీత, పార్వతమ్మ, జయశ్రీ, సరస్వతి లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తామని వారు తెలిపారు. అర్చకులు వేదాశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, చక్రాయపేట టిడిపి ఇంచార్జ్ మహేశ్వర రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథ్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకుడు బాలస్వామి రెడ్డి, టిడిపి వేంపల్లె పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, టౌన్ క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్, దక్కా రమేష్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డా. హరీష్, దాసరి రవిశంకర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ, బీజేపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, ఆలయ సిబ్బంది, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆక్వాకల్చర్‌కు అండగా కూటమి ప్రభుత్వం

### డీజిల్ సరఫరాలో ఎటువంటి అంతరాయం ఉండదు

### జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు నిరంతర పర్యవేక్షణ

### మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి




ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వాకల్చర్ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర వ్యవ సాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,34,617 హెక్టార్లలో ఆక్వాకల్చర్ సాగు జరుగుతోందని, అందులో 1,21,829 హెక్టార్లలో చేపల పెంపకం, 1,12,788 హెక్టార్లలో ఉప్పునీటి సాగు జరుగుతోందని పేర్కొన్నారు. శ్రింప్, సీ బాస్ వంటి వాణిజ్య పంటలు సాగు చేస్తున్న సుమారు 1.2 లక్షల హెక్టార్లకు 24 గంటల నిరంతర విద్యుత్ అవసరం ఉందని మంత్రి తెలిపారు. విద్యుత్ అంతరాయం ఉన్న సమయంలో రైతులు డీజిల్ జనరేటర్లపై ఆధారపడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం రోజుకు సగటున 2 గంటల విద్యుత్ కోత ఉన్నట్లు అంచనా వేస్తూ, ఒక హెక్టారుకు రోజుకు సుమారు 5 లీటర్ల డీజి ల్ అవసరం అవుతోందని వివరించారు. వారానికి ఒక హెక్టారుకు 40 లీటర్ల డీజిల్ అవసరం కాగా, మొత్తం 1.2 లక్షల హెక్టార్లకు వారానికి సుమారు 5000 కిలోలీటర్ల డీజిల్ అవసరం ఉంటుందని తెలిపారు.

**డీజిల్ సరఫరా పర్యవేక్షణలో కట్టుదిట్టమైన చర్యలు**

ఆక్వాకల్చర్ రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా డీజిల్ సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాల వారీగా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ప్రత్యేకంగా పరిస్థితిని సమీక్షిస్తూ, డీజిల్ అందుబాటును పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారుల సహకారంతో ప్రతి ప్రాంతంలో సమన్వయం కొనసాగుతోందని చెప్పారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ వారి పక్షాన నిలబడి, అవసరమైన మద్దతు అందిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఆక్వాకల్చర్ రంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

ప్రజాభూమి



బుధవారం 29, ఏప్రిల్ 2026

## ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాన్ని పరిశీలించిన జనసేన బృందం.



ప్రజాభూమి ప్రతినిధి–వి.ఆర్.పురం.

జనసేన పార్టీ వి.ఆర్.పురం మండల నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. రాజుపేటకాలనీ గ్రామ శివారులో గల చెరువులో పనిచేస్తున్న ఉపాధి హామీ కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారు పాటించవలసిన నియమ నిబంధనలు, ఎండలను దృష్టిలో ఉంచుకొని పని వేళలు మరియు మరికొన్ని వెసులు బాటులు కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. ప్రతి ఉపాధి హామీ కార్మికులు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ మరియు పై స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకుంటే ఉపాధి హామీ కార్మికులతో పాటు ప్రతి రైతుకి న్యాయం చేసిన వాళ్ళు అవుతారని అన్నారు. ముందుగానే ఫీల్డ్ లో ఉన్న జే.ఈ వెంకటేశ్వరరావుతో పలు అంశాలపై చర్చించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో బాధ్యత రాహిత్యంగా పనులు జరుగుతున్నాయని, కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహారిస్తునరాని వారిపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, మహిళా అధ్యక్షురాలు బాగుల ప్రమీళా రాణి, కార్యదర్శి బాగుల అంజన రావు, మండల యూత్ ప్రెసిడెంట్ పెదపెట్ల పవన్ కళ్యాణ్, ఉపాధి హామీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు

**మంత్రి కందుల దుర్గేష్**

**మంత్రి దుర్గేష్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిఎస్పీలు జీవన, శివప్రియ**



ప్రజా భూమి ప్రతినిధి–రాజమహేంద్రవరం

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ ని మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని వారి క్యాంపు కార్యాలయంలో నార్త్ జోన్, సౌత్ జోన్ డిఎస్పీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన నార్త్ జోన్ డిఎస్పీ సి.హెచ్. జీవన, సౌత్ జోన్ డిఎస్పీ ఏ. శివప్రియలు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధికారులకు మంత్రి దుర్గేష్ అభినందనలు తెలుపుతూ, విధి నిర్వహణలో పాటించాల్సిన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. నగరంలో శాంతిభద్రతలను అదుపులో ఉంచాలని, అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ ప్రజలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని మంత్రి సూచించారు. ప్రజలతో మమేకమవుతూ, 'ఫ్రెండ్లీ పోలీసింగ్' విధానంలో బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో, సమర్థవంతంగా నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు తమ పరిధిలోని భద్రతా అంశాలను మంత్రికి వివరించారు. చివరగా డిఎస్పీలకు మంత్రి కందుల దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లాలో విద్యుత్ సమస్యలు పై సంప్రదించండి

**–ఎస్ఈ పి.సాల్మన్ రాజు.**

ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా



ప్రస్తుత వేసవిలో ఎటువంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ ను సరఫరా చేస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణి సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ పి.సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వేసవి కాలంలో అవసరమైనంత విద్యుత్ అందుబాటులో ఉందని, ఎటువంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా సాధారణంగా కొనసాగుతోందన్నారు. ఏదైనా విద్యుత్ అవాంతరాలు లేదా సమస్యలు తలెత్తిన పక్షంలో వినియోగదారులు తమ సమీప ఎ.ఇ. కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, లేదా 1912 టోల్ ఫ్రీ నంబర్కు సమాచారం అందించవచ్చన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఎస్ ఈ / ఎలక్ట్రికల్ (ఏలూరు): 9440812702, ఈ ఈ (ఏలూరు ): 944081270 4, ఈ ఈ (జంగారెడ్డిగూడెం): 9491049797, సిపిడిసిఎల్ ( నూజివీడు): 9440811746, సిపిడిసిఎల్ (కైకలూరు): 9440812366 నంబర్లకు తెలియజేస్తే పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటారని సాల్మన్ రాజు తెలియజేసారు.

## నాదెండ్ల భాస్కరరావు చిత్రపటానికి ఎంపీ వల్లభనేని బాలశౌరి నివాళి



ప్రజాభూమి ప్రతినిధి–మచిలీపట్నం

హైదరాబాద్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నాదెండ్ల భాస్కరరావు కి మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ఘన నివాళులర్పించారు. మంగళవారం హైదరాబాద్‌లోని భాస్కరరావు నివాసానికి వెళ్లిన ఎంపీ, అక్కడ ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

**మనోహర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి**

అనంతరం, భాస్కరరావు కుమారుడు, రాష్ట్ర ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ని బాలశౌరి పరామర్శించారు. తండ్రిని కోల్పోయిన దుఃఖంలో ఉన్న మనోహర్ ని, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. భాస్కరరావు ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని, వారి మరణం రాష్ట్రానికి తీరని లోటని ఈ సందర్భంగా ఎంపీ పేర్కొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## జిల్లాలో సాధారణ స్థితికి పెట్రోల్, డీజిల్‌కు సరఫరా

- ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పెట్రోల్ డీజిల్ సరఫరా పర్యవేక్షణ..
- వినియోగదారుల అవసరాలకు అందుబాటులో పెట్రోల్ డీజిల్..
- జిల్లాలో ప్రతి రోజు 8 లక్షల డీజిల్ 6 లక్షల పెట్రోల్ సరఫరా..
- జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ

ప్రజా భూమి ప్రతినిధి–విజయవాడ

జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుందని ప్రస్తుతం ఎటువంటి కొరత లే కుండా ఇంధనం సమృద్ధిగా అందుబాటులో ఉందని వినియోగదారులు ఎటువంటి అందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో పెట్రోల్ డీజిల్ సరఫరా పై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ మం గళవారం ఉదయం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పర్యవేక్షణ నిర్వహించి అధికారులకు పలు సూచన లు చేశారు. అనంతరం నిడమానూరులో హెచ్‌పిసి ఎల్, బిపిసిఎల్, ఐఓసిఎల్ బంకులను ఎనికెపాడు లోని హెచ్‌పిసిఎల్ బంకును రామవరప్పాడులోని ఐఓసిఎల్ బంకులలో పెట్రోల్ డీజిల్ నిల్వలు సరఫరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వదంతుల కారణంగా పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పాటుడుందనే అపోహలతో వినియోగదారులు బయాందోళనలకు గురై అవసరాలకు మించి డీజిల్ పెట్రోల్ కొనుగోళ్ళు చేయడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురయ్యాయన్నారు. డీజిల్ పెట్రోల్ సజావుగా వినియోగదారులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యల కారణంగా పెట్రోల్ డీజిల్ సరఫరా సాధారణ స్థితికి చేరుకోవడం జరిగిందన్నారు. ఇంధన సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లాలోని పెట్రోల్ బంక్‌ల వద్ద సరఫరా పరిస్థితిని క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్, డీజిల్ సరఫరా కొనసాగుతున్నదని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. అపోహలు, అసత్య ప్రచారాలను నమ్మకుండా అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రతి రోజు సుమారు 8 లక్షల లీటర్ల డీజిల్, 6 లక్షల లీటర్ల పెట్రోల్ సరఫరా జరుగుతోందని కలెక్టర్ వెల్లడించారు. ఆయిల్ కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు. రెవెన్యూ పోలీస్ వ్యవసాయ తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా





ఉండి, ఎక్కడా ఇంధన కొరత ఏర్పడకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారన్నారు. ఈకారణంగా పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్‌లలో వాహనాలు నిలబడాల్సిన అవస రం లేకుండా తక్షణమే ఆయిల్ పొందగలుగుతున్నారన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కంపెనీలలో పెట్రోల్ డీజిల్ అవసరాల మేరకు నిల్వలతో సిద్దంగా ఉన్నాయని తెలిపారు. బంకులలో ఆయిల్ అయిపోయిన రెండు గంటల లోపే ట్యాంకర్లతో ఆయిల్ సరఫరా చేసేలా మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, అవసరానికి తగినంత మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో ఇంధన సరఫరా పూర్తిగా నియంత్రణలో ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం, ఆయిల్ కంపెనీలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంధన సరఫరాపై ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారు లకు తెలియజేయాలని, ఇందుకోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని వినియోగ దారులకు ఇబ్బంది తలెత్తిన పక్షంలో 91549 70454 నందు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. ఆయిల్ బంకుల పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ వెంట విజయవాడ రూరల్ తహాశీల్దార్ బి. సుగుణ, రెవెన్యూ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భారతదేశ డిజిటల్ ప్రయాణంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది

- మన భవిష్యత్ నిర్మించడానికి వైజాగ్ సిద్ధంగా ఉంది
- 2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా విశాఖను తీర్చిదిద్దుతాం
- పదేళ్లలోనే విశాఖ శరవేగంగా అభివృద్ధి సాధిస్తుంది
- అద్భుతమైన ప్రయాణానికి ఇది ఆరంభం మాత్రమే
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే మా ధ్యేయం
- విశాఖ నోవాటెల్ హోటల్ లో జరిగిన భారత్ ఏఐ శక్తి కాంక్లేవ్ లో మంత్రి నారా లోకేష్

ప్రజాభూమి ప్రతినిధి–విశాఖపట్నం

కేవలం విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రారంభం మాత్రమే కాదని, భారతదేశ డిజిటల్ ప్రయాణంలో నూతన అధ్యాయానికి నాంది అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 'భారతదేశ ఏఐ కారిడార్ ను ఉమ్మడిగా నిర్మించడం అనే అంశంపై' గూగుల్ ఆధ్వర్యంలో విశాఖ నోవాటెల్ హోటల్ లో జరిగిన భారత్ ఏఐ శక్తి కాంక్లేవ్ లో మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారతదేశ డిజిటల్ ప్రయాణంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. అదేవిధంగా మన ఆంధ్రప్రదేశ్ కు ఇది కీలకమైన మలుపు. విశాఖపట్నం.. మనం ప్రేమగా వైజాగ్ అని పిలిచే ఈ నగరం సాధారణ నగరం కాదు. దశాబ్దాలుగా ఇది భారతదేశానికి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. భారతదేశంలోని ఖనిజ సంపదను ప్రపంచానికి అనుసంధానించింది. ఈ నగరం ఉక్కుతో నిర్మితమైంది. కానీ ఈ రోజు మనం విశాఖ పునాదులను ఏఐ విప్లవం పై నిర్మించబోతున్నాం. విశాఖ మన దేశ భవిష్యత్తును నిర్మించబోతోందని నేను బలంగా విశ్వసిస్తున్నాను.

**విశాఖపట్నం వేగంగా అభివృద్ధి చెందుతుంది**

మనం ఈ రోజు ఒక చరిత్రాత్మక మలుపు వద్ద ఉన్నాం. ప్రపంచం రోజురోజుకీ మారుతోంది. ప్రపంచం భారీ పరిశ్రమల నుంచి డిజిటల్ మౌలిక సదుపాయాల వైపు, తయారీ నుంచి మెషిన్ ఇంటెలిజెన్స్ వైపు మారుతోంది. ఈ ప్రయాణంలో వైజాగ్ మళ్లీ అభివృద్ధి చెందుతోంది.

గూగుల్ ఏఐ హబ్ ప్రారంభంతో ఈ మార్పును మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి 15 బిలియన్ డాలర్ల పెట్టబడితో పాటు ఒక గిగావాట్ డేటా సెంటర్ ఎకోసిస్టమ్ ఏర్పాటుకానుంది. ఇది సాధారణ వృద్ధి కాదు, భారీస్థాయి అభివృద్ధి. మొదటిసారి వైజాగ్ లో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. కనెక్టివిటీ విషయంలో మనం ఇతర రాష్ట్రాలతో పోటీ పడతాం. ఒకప్పుడు పోర్టులు ఈ నగరాన్ని ప్రపంచంతో కలిపినట్లే, ఈ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు డిజిటల్‌గా ప్రపంచంతో అనుసంధానం చేస్తాయి.

**అద్భుతమైన ప్రయాణానికి ఇది ఆరంభం**

ప్రపంచవ్యాప్తంగా వర్జీనియా నుంచి డబ్లిన్ వరకు డేటా సెంటర్ల ప్రభావాన్ని మనం చూశాం. కాబట్టి ఈ పెట్టుబడిని కేవలం 15 బిలియన్ డాలర్లుగా చూడకండి. ఇది ఒక బలమైన ఎకోసిస్టమ్‌కు పెట్టుబడి. ఒక అద్భుతమైన ప్రయాణానికి ఆరంభం. ఈ పెట్టుబడి వల్ల విశాఖపట్నంలో సుమారు 2 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వస్తాయి. నూతన పరిశ్రమలు కూడా ఈ ఎకోసిస్టమ్ చుట్టూ అభివృద్ధి చెందుతాయి. ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు.. ఇది ఆర్థిక అభివృద్ధికి ఒక మల్టిప్లయర్. డేటా, సంఖ్యలకంటే ఎక్కువగా వైజాగ్‌కు ఉన్న మరో బలం.. ఇక్కడి శక్తి, ప్రతిభ, ఆత్మవిశ్వాసం. 2014లో అతిపెద్ద తుఫాను విశాఖను తాకింది. చెట్లు అన్నీ నేలకూలిపోయాయి. కానీ 48 గంటల్లోనే ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారిని నవ్వుతూ ఆహ్వానించారు. ఇది ఈ నగర ప్రజల స్థైర్యానికి నిదర్శనం. దీపావళి సమయంలో అగ్నిప్రమాదాల నివారణకు టపాసులు కాల్చవద్దని చంద్రబాబు గారు పిలుపునిస్తే ఒక్కరు కూడా వాటి జోలికి వెళ్లలేదు. అదే వైజాగ్ స్ఫూర్తి, బాధ్యత. ఇది యువత ఆశయాలు కలిగిన నగరం. ఇక్కడ సృజనాత్మకత సహజం. జీవితం, పని సమతుల్యంగా ఉన్న నగరం ఇది. ఇవన్నీ వైజాగ్ ను ప్రత్యేకంగా నిలుపుతున్నాయి.

**2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా విశాఖను తీర్చిదిద్దుతాం**

2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థికవ్యవస్థగా విశాఖ ఎకనమిక్ రీజియన్ ను తీర్చిదిద్దాలనేది ప్రజా ప్రభుత్వ లక్ష్యం. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ సంస్థతో గ్రీన్ స్టీల్ సిటీకి శంకుస్థాపన చేశాం. అదేవిధంగా ఏఐ, డేటా, ఫార్మా, మెడికల్ డివైసెస్ రంగాల్లో భారీ అభివృద్ధి జరుగుతోంది. ఈ ప్రాంతం కృత్రిమ మేధ(ఏఐ), క్లీన్ ఎనర్జీ, మెడికల్ తయారీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు కేంద్రంగా మారబోతోంది. హైదరాబాద్ అభివృద్ధిని మనం అందరం చూశాం. ఒకప్పుడు సైబర్ టవర్స్ నిర్మాణానికి చంద్రబాబు గారు సంకల్పించినప్పుడు అందరూ ఎగతాళి చేశారు. కంప్యూటర్లు అన్నం పెడతాయా అని విమర్శించారు. కానీ స్పష్టమైన విజన్, పట్టుదలతో అది సాధ్యమైంది. హైదరాబాద్‌లో 30 ఏళ్లలో జరిగిన అభివృద్ధిని.. విశాఖలో వచ్చే 10 పదేళ్లలోనే సాధించాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. మా విధానం సింపుల్‌గా ఉన్నా శక్తివంతమైంది. విస్తృతి, సమగ్రత, స్వయం సమృద్ధి. పెట్టుబడులు ఆకర్షించడం మాత్రమే కాదు.. మొత్తం పరిశ్రమలను స్థాపించడం మా లక్ష్యం. గూగుల్ మాపై నమ్మకం ఉంచి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడం గొప్ప విషయం. ఇది ఇప్పుడు మీ ప్రాజెక్ట్ మాత్రమే కాదు..మన అందరి ప్రాజెక్ట్. మేం ఎంవోయూలపై కాకుండా షేక్ హ్యాండ్‌లపై నమ్మకం ఉంచుతాం. ఒకసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మా ప్రాజెక్ట్. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వచ్చాయి.

**20 లక్షల ఉద్యోగాల కల్పనే మా ధ్యేయం**

ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్రం. మేం చాలా కసితో ఉన్నాం. మమ్మల్ని ఒక స్టార్టప్‌లా చూడండి. చరిత్రలో నాలుగుసార్లు రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకోవాల్సి వచ్చింది. మొదట మద్రాస్ లో భాగంగా ఉన్నాం. తర్వాత కర్నూలు రాజధానిగా ఉన్నాం. కొన్నేళ్ల తర్వాత తెలంగాణ, ఏపీ విడిపోయాయి. అందరం కలిసి ఆనాడు హైదరాబాద్ ను అభివృద్ధి చేసుకున్నాం. తర్వాత విడిపోయాం. మాకు ఉన్న కసి, సంకల్ప బలం మమ్మల్ని ముందుకు తీసుకెళ్తోంది. అందరితో కలిసి మేం చరిత్ర సృష్టించానుకుంటున్నాం.

మా కేబినెట్ లో 25 మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారు. శాసనసభ్యుల్లో సగం మంది మొదటిసారిగా ఎన్నికైన వారు. మేం అందరం ఉత్సాహంతో, కసితో పనిచేస్తున్నాం. పెట్టుబడిదారులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనే మా ధ్యేయం. ఏపీ, వైజాగ్ లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గూగుల్ క్లౌడ్, గూగుల్ గ్లోబల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాష్ కోలే తో పాటు 49 కంపెనీల ప్రతినిధులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



**గండిక్షేత్రం శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం**

## నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

ప్రజా భూమి ప్రతినిధి–చక్రాయపేట

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో గండిక్షేత్రంలోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం 2026--2028 సంవత్సరానికి గాను నూతన ధర్మకర్తల మండలి (పాలకమండలి) ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్‌గా కల్లూరి వెంకటస్వామి సహా పది మంది పాలకమండలి సభ్యులు, అలాగే ఎక్స్–అఫీషియో సభ్యుడిగా వర్తి కేసరి స్వామి భగవంతుని సాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకార ప్రక్రియను దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) హాజరై శ్రీ వీరాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీటెక్ రవి, టీడీపీ వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి కలిసి నూతన పాలకమండలి చైర్మన్, సభ్యులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతన పాలకమండలి సభ్యులుగా కల్లూరి వెంకటస్వామి (చైర్మన్), శ్రీనివాసులు, రామచంద్రా రెడ్డి, జయలక్ష్మీ దేవి, గణపతి రెడ్డి, రామతులసి, లావణ్య, సునీత, పార్వతమ్మ, జయశ్రీ, సరస్వతి లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తామని వారు తెలిపారు. అర్చకులు వేదాశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, చక్రాయపేట టిడిపి ఇంచార్జ్ మహేశ్వర రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథ్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకుడు బాలస్వామి రెడ్డి, టిడిపి వేంపల్లె పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, టౌన్ క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్, దక్కా రమేష్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డా. హరీష్, దాసరి రవిశంకర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ, బీజేపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, ఆలయ సిబ్బంది, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆక్వాకల్చర్‌కు అండగా కూటమి ప్రభుత్వం

**డీజిల్ సరఫరాలో ఎటువంటి అంతరాయం ఉండదు**

**జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు నిరంతర పర్యవేక్షణ**

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి





ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వాకల్చర్ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర వ్యవ సాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,34,617 హెక్టార్లలో ఆక్వాకల్చర్ సాగు జరుగుతోందని, అందులో 1,21,829 హెక్టార్లలో చేపల పెంపకం, 1,12,788 హెక్టార్లలో ఉప్పునీటి సాగు జరుగుతోందని పేర్కొన్నారు. శ్రింప్, సీ బాస్ వంటి వాణిజ్య పంటలు సాగు చేస్తున్న సుమారు 1.2 లక్షల హెక్టార్లకు 24 గంటల నిరంతర విద్యుత్ అవసరం ఉందని మంత్రి తెలిపారు. విద్యుత్ అంతరాయం ఉన్న సమయంలో రైతులు డీజిల్ జనరేటర్లపై ఆధారపడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం రోజుకు సగటున 2 గంటల విద్యుత్ కోత ఉన్నట్లు అంచనా వేస్తూ, ఒక హెక్టారుకు రోజుకు సుమారు 5 లీటర్ల డీజి ల్ అవసరం అవుతోందని వివరించారు. వారానికి ఒక హెక్టారుకు 40 లీటర్ల డీజిల్ అవసరం కాగా, మొత్తం 1.2 లక్షల హెక్టార్లకు వారానికి సుమారు 5000 కిలోలీటర్ల డీజిల్ అవసరం ఉంటుందని తెలిపారు.

**డీజిల్ సరఫరా పర్యవేక్షణలో కట్టుదిట్టమైన చర్యలు**

ఆక్వాకల్చర్ రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా డీజిల్ సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాల వారీగా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ప్రత్యేకంగా పరిస్థితిని సమీక్షిస్తూ, డీజిల్ అందుబాటును పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారుల సహకారంతో ప్రతి ప్రాంతంలో సమన్వయం కొనసాగుతోందని చెప్పారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ వారి పక్షాన నిలబడి, అవసరమైన మద్దతు అందిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఆక్వాకల్చర్ రంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.